తొలిసారిగా వ్యాధిగ్రస్తులకు కూడా పూర్తి ఆరోగ్యపరిక్షణకార్డు
అదీ అతిస్వల్పవ్యయంతో
ఈ నదవకాశం వినియోగించుకోండి.
కోస్టల్ హెల్త్ కేర్ వారి
అబ్బా ABC హెల్త్ కార్డ్
ఇంకా 3రోజులు మాత్రమే లభిస్తుంది
కోస్టల్ హెల్త్ కేర్,40-1-53, బెంజిసర్కిల్,విజయవాడ
TEC-75037

స్వాతంత్ర్య సమరానికి అక్షరాయుధాలు అందించిన అగ్రశ్రేణి దినపత్రిక

ANDHRA PATRIKA
Regd.H/VJ NO.49
ఉదయం
* * *

ఆంధ్రపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM VIJAYAWADA & HYDERABAD

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

విజయవాడ బుధవారం 13-9-89 సంపుటం:76 సంచిక:163 పుటలు:8 వెల:రు.1.30పైసలు

Thought for the day
Excellence is never granted to man, but as the reward of labour.
BAPALAL & CO. JEWELLERS
24/1, Cathedral Road, Madras · 600 086. Phone : 473030
Craftsmanship and quality. These are the gifts the God granted us.

322182

సభాహక్కులలో జోక్యంసహించరానిది

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబర్ 12 : శాసనసభకు గల విస్తృత విశేషాధికారాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చునా, స్పీకర్‌ను కోర్టుకు పిలిచే అధికారం కోర్టులకు ఉన్నాయా అనే విషయాలపై మంగళవారం శాసనసభలో రసవత్తరమైన చర్చ జరిగింది. ఈ విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకొని శాసనసభకు గల అధికారాన్ని పరిరక్షించడానికి శాసనసభ ఒక తీర్మానాన్ని ఆమోదించాలని పలువురు శాసన సభ్యులు కోరారు.

స్పీకర్‌ను కోర్టుకు పిలవడం ద్వారా శాసనసభ హక్కులను ప్రశ్నించే అధికారాలలో కోర్టులు జోక్యం చేసుకోకూడదని, స్పీకర్‌ను కోర్టుకు పిలవకూడదని స్పీకర్ శ్రీ జి. నారాయణరావు అభిప్రాయపడ్డారు.

శాసన సభకు గల విస్తృత విశేషాధికారాలు, హక్కులలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదని ఈనెల 19 వ తేదీన భోపాల్‌లో జరుగనున్న స్పీకర్ల సమావేశంలో చర్చించడం జరుగుతుందని స్పీకర్ శ్రీ జి. నారాయణరావు మంగళవారం శాసనసభలో తెలిపారు.

శాసనసభలో శ్రీయుతులు సి.హెచ్. విద్యాసాగరరావు, ఎ. నరేంద్ర, బి. బాలరెడ్డి, వి. రాంభూపాల్ చౌదరి, ఎం.వి.మైసూరారెడ్డి ప్రభృతులు ఆంధ్రప్రదేశ్ శాసనసభ శిక్ష విధించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను కోర్టు విడుదల చేయడాన్ని శాసన సభా నియమావళి 304 వ నిబంధన క్రింద సభాధ్యక్షుడికి తీసుకువచ్చినప్పుడు స్పీకర్ జోక్యం చేసుకుంటూ పైవిధంగా అన్నారు.

శాసనసభలకు గల అధికారాలను గతంలో శాసనసభ స్పీకర్ల సమావేశం చర్చించి శాసనసభలకు విస్తృత అధికారాలు, హక్కులు ఉన్నాయని అభిప్రాయపడిందని ఆయన అన్నారు. శాసనసభ హక్కులు అధికారాల విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం, స్పీకర్‌ను కోర్టులకు పిలిచే విషయంలో తలెత్తిన వివాదంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సలహాను అడుగాలని బి.జె.పి. సభ్యుడు శ్రీ సి. హెచ్. విద్యాసాగరరావు చేసిన సూచనను స్పీకర్ శ్రీ జి. నారాయణరావు అంగీకరించారు.

స్పీకర్‌ను న్యాయస్థానాలకు పిలిచే హక్కు ఉందా, అయితే రాజ్యాంగంలో ఈ నిబంధనలను ఎక్కడ పొందుపరిచారు అని కాంగ్రెస్ (ఐ) సభ్యుడు శ్రీ డి.కె. సమరసింహారెడ్డి స్పీకర్‌ను ప్రశ్నించారు. రాజ్యాంగంలోని 235(3) అధికరణ ప్రకారం ప్రతిపౌరుడు ప్రాథమిక హక్కులు కలిగి ఉన్నాడని, ప్రాథమిక హక్కులను ఎవరైనా ఉల్లంఘిస్తే కోర్టులకు పోయే అధికారం పౌరులు కలిగిఉన్నారని శ్రీ సమరసింహారెడ్డి అన్నారు.

శాసనసభకు గల హక్కులు, అధికారాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవడం అభేది కాంగ్రెస్ (ఐ) అధికారంలో గల రాష్ట్రాలకు కూడా వర్తిస్తుందని, పార్లమెంటులో కూడా అవరోధాలు కలుగుతున్నాయని శ్రీ నారాయణరావు అన్నారు.

శాసనసభ గానీ, స్పీకర్‌గానీ కోర్టుకు సంబంధించి పార్టీలు కాదని ఈ విషయంలో సందేహాలుంటే అడ్వకేట్ జనరల్ సలహాలు తీసుకోవాలని శ్రీ సి.హెచ్. విద్యాసాగరరావు సూచించారు.

శాసనసభా హక్కులను పరిరక్షించవలసిన బాధ్యతను స్పీకర్ కలిగి ఉన్నారని, ప్రస్తుతం జరుగుతున్న చర్చ పరిణామాలు దేశవ్యాప్తంగా ప్రభావితం చేస్తాయని స్పీకర్ అన్నారు.

శ్రీ పి. వెంకటపతి (సి.పి.ఎం.) శాసనసభ శిక్షవిధిస్తే ఆ శిక్షను తగ్గించే హక్కు సభకు మాత్రమే ఉంది తప్ప మరొక సంస్థకు లేదని ఈ విషయంలో రాష్ట్రపతి జోక్యం చేసుకోవలసిందిగా సభ తీర్మానాన్ని ప్రతిపాదించాలని అన్నారు.

— మునిసిపల్ శాఖా మంత్రి శ్రీ వడ్డి రంగారావు మాట్లాడుతూ శాసన సభ స్పీకర్‌ను శాసనసభను ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదని అన్నారు.

శ్రీ కె. బాపిరాజు (కాంగ్రెస్) ఈ విషయాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకువచ్చి తుది నిర్ణయం వచ్చేవరకు మరొక నిర్ణయం చేయకూడదని అన్నారు.

శ్రీ వి. రాంభూపాల్ చౌదరి (కాం) ఈ సమస్యపై శాసనసభ స్పీకర్ల సమావేశం చర్చించి ఆ చర్చల ఆధారంగా రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్ళాలని అన్నారు.

శ్రీ యెర్రం నాయుడు (తె.దే) ఈ విషయంపై శాసనసభ ఏకగ్రీవంగా ఒక తీర్మానాన్ని ఆమోదించాలని కోరారు. శ్రీ సి. నరసిరెడ్డి (జ) మనలను సుప్రీంకోర్టు పిలిచే అధికారం ఎక్కడ ఉందని అన్నారు. పార్లమెంటు శాసనసభల విషయాలలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడాన్ని మందలించాలని కోరుతూ

మిగతా 2 వ పేజీలో



హౌసింగ్ సొసైటీలకు చితి పట్టణభూపరిమితి

(ఆంధ్రపత్రిక రాజకీయప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబర్ 12: విశాఖపట్నం పట్టణాల్లో పట్టణ భూపరిమితి చట్టం విధించిన కారణాన వందలాది సొసైటీలకు అనుమతి లభించక సభ్యులుగా చేరిన పేద ప్రజలు అవస్థల పాలవుతున్నారని, నేడు శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో భారతీయ జనతాపార్టీ సభ్యులు సర్వశ్రీ ఎ. నరేంద్ర, బద్దం బాల్‌రెడ్డి, ఎన్. ఇంద్రసేనారెడ్డి, ఆర్. రవీంద్రనాథ్ రెడ్డి, సి. హెచ్. విద్యాసాగరరావు, విజయపాల్ ప్రభుత్వ చర్యను నిశితంగా విమర్శించారు.

వెంటనే పట్టణ భూపరిమితి చట్టాన్ని సడలించి పేద కుటుంబాల వారిని ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి శ్రీ ఎన్. టి. రామారావు సమాధానమిస్తూ 5 ఎకరాల స్థలానికి పట్టణ భూపరిమితి చట్టం నుండి మినహాయింపు ఇచ్చామని సమాధానమిచ్చారు.

శ్రీ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో 'రెడ్ టేపిజం' ఎక్కువైందని, పెట్టుకున్న దరఖాస్తుల పరిశీలన సక్రమంగా జరగటం లేదని ఆరోపించారు.

ఎవరైనా భూ ఆక్రమణదారులుంటే వారిని శిక్షించితే మాకు అభ్యంతరం లేదు. కాని అమాయక ప్రజలకు న్యాయం చెయ్యండి అని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ పట్టణ భూపరిమితి చట్టం సవరణకు పునరాలోచన చెయ్యాలని సమాధానమిచ్చారు.

బి. జె. పి. సభ్యుడు శ్రీ బద్దం బాల్‌రెడ్డి ప్రశ్నిస్తూ పునరాలోచన చేసేలోపే ఏడు సంవత్సరాల్లో పేద ప్రజలు ఏడు చెరువుల నీళ్లు తాగుతున్నారని, సొసైటీల్లో పేద కుటుంబీకులు తమ భార్యల తాళిబొట్టు కుదువబెట్టి డబ్బు కట్టారని అటువంటి స్థలాలకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వని పక్షంలో వారి పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ఆలోచించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పట్టణ ప్రాంతాలలో వేలాది ఎకరాలను భూ ఆక్రమణదారులు ఆక్రమించుకొంటే ప్రభుత్వం ఏమి చేసిందని, ఎంత మందిపై చర్య తీసుకొన్నదని శ్రీ బాల్‌రెడ్డి ప్రశ్నించారు.

సుప్రీమ్‌కోర్టులో కేసుమ ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని సభ్యులు కోరారు. కార్పొరేషన్‌లో నిధులు లేవని శ్రీ బాల్‌రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి శ్రీ రామారావు సమాధానమిస్తూ భూ ఆక్రమణదారులపైన భూ ఆక్రమణ కోర్టులో పిటిషన్ దాఖలు చెయ్యండి అని సమాధానమిచ్చారు.

కాంగ్రెస్ సభ్యుడు శ్రీ పి. జనార్దనరెడ్డి ప్రశ్నిస్తూ ఇండియన్ డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగుల కాలనీకి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు ఎందుకని అని అడిగారు.

ముఖ్యమంత్రి సమాధానమిస్తూ రెండు నెలల సమయం కావాలని కోరారు.

మృత్యువాకిటలో కేరింతలు కొట్టిన జీవితం

ఇస్లామాబాద్, సెప్టెంబరు 12: మృత్యుగీతం ఆలపించే స్మశానవాటికలో జీవితం కేరింతలు కొట్టింది. మృత్యువు కబళించిన ఒక పసిడి మొగ్గ విటారుగా విలబడితోడురాను పొమ్మంది. కరాచీలోని మేవాషా స్మశానవాటికలో ఒక రోజైనా నిండని పసికందు ఏడుస్తూ కనిపించింది. స్మశానంలో ఈ పాపను కనిపెట్టిన పిల్లలు ఆమెకు తిరిగి ప్రాణం పోసారు. ఒక గోతిలో ఈ పసిబిడ్డను ఎవరో పదిలి పైపైన మట్టికప్పి వెళ్లిపోయారు.

పసిబిడ్డను ఆస్పత్రిలో చేర్చారు. ఆమెను దత్తతుకీ ఇవ్వవచ్చని భావిస్తున్నారు.

ఈ బిడ్డ అక్రమ సంతానం కావడం వల్ల తల్లి ఈ విధంగా వదిలేసి వుంటుందని భావిస్తున్నారు.

వరదనిధిమాట నీటిమూట

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

విజయవాడ, సెప్టెంబరు 12: జూలై-ఆగస్టు నెలల్లో వచ్చిన వరదలకు ఇతర ప్రాంతాలతోపాటు విజయవాడ నగరానికి తీవ్రమైన నష్టం వాటిల్లగా, రాష్ట్ర ప్రభుత్వం రు. 25 లక్షల సహాయం ప్రకటించిందే గాని, ఇంత వరకు పైసా విడుదల చేయలేదని మేయరు డా. జంధ్యాలశంకర్ వెల్లడించారు.

మంగళవారం పత్రికల వారితో మాట్లాడుతూ వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రు.2.02 కోట్లు ప్రభుత్వం నుంచి రావలసివుండగా, మొదటి క్వార్టరు, రెండవ క్వార్టర్ల డబ్బు విడుదల కాలేదని, మూడవ క్వార్టరు కూడా ముగిసిందని ఆయన చెప్పారు.

88-89 సంవత్సరానికి కూడా రు. 34లక్షలు బకాయిపడి వున్నదని ఆయన అన్నారు.

యాక్షన్ ప్లాన్ క్రింద గత ఏడాది కోటిన్నర రాగా ఈ ఏడు రు. 1.12 కోట్లకు తగ్గించి పేసారని ఆయన వివరించారు.

డిసెంబరు విధ్వంసకాండలో నష్టాల క్రింద రు. 8లక్షలు సహాయం ప్రకటింపబడిందేగాని, అది రాలేదని డా. శంకర్ చెప్పారు.

రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు

విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యాన నవంబరు 10 నుంచి 14 వరకు పెద్ద ఎత్తున యువజనోత్సవాలను నిర్వహించనున్నట్లు మేయరు డా. శంకర్ చెప్పారు. రు. 3-4 లక్షలకు పైగా వ్యయం అవుతుందని ఆయన అన్నారు.

ఈ ఉత్సవాల్లో క్రీడల పోటీలు, నాటక, నృత్య, సంగీత పోటీలు, వ్యాసరచన పోటీలు వుంటాయి.

నాటకాలు, నాటికలు, జానపద నృత్యాలకు పెద్దమొత్తంలో నగదు బహుమతులు ఇస్తామని ఆయన చెప్పారు.

పురుషులు, స్త్రీలకు ఆటల పోటీలతోపాటు, నాటకాలు, నాటికలు, జనపద నృత్యాలు, భరత నాట్యం, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్‌పోటీలు వుంటాయని రాష్ట్రంలోని యువతీ యువకులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

పోటీలకు ఎంపిక అయిన క్రీడాకారులకు కళాకారులకు, ఉచిత భోజన వసతులు ఏర్పాటు చేస్తామని మేయరు చెప్పారు.

పోటీల వివరాలు కన్వీనరు, యువజనోత్సవాలు, మేయరు ఛాంబర్, నగరపాలక సంస్థ, విజయవాడ-1 చిరునామా నుండి పొందవచ్చును.

చావును ఇంజెక్ట్ చేసిన మృత్యుదేవత

మృత్యు వీడలో తచ్చాడే వారికి అమృతంపోసి వెలుగును ప్రసాదించేది వైద్యం. రోగుల ఆలనా పాలనా చూసి ప్రాణం పోసేవారు నర్సులు అయితే మిచల్ రోయడర్ అటువంటి నర్సుకాదు. ఆమె రోగులకు అమృతం పోసేబదులు చావును ఇంజెక్ట్ చేసింది. పశ్చిమ జర్మనీలోని సెయింట్ పీటర్స్ ఆస్పత్రిలో మిచల్ అయిదుగురు రోగులకు పానికరమైన మందులు ఇంజెక్ట్‌చేసి వారి చావుకు కారణమైంది. 'మృత్యు దేవత'గా పేరు సాధించుకుంది.

ఆమె అయిదుగురు రోగుల చావుకు కారణమని, ఒకరిపై ఆమె హత్యా ప్రయత్నం చేసిందని, మరో కేసులో అజాగ్రత్తగా వుందని కోర్టు భావించింది. మరో కేసులో చావును కోరుకున్న ఒక స్త్రీని కూడా ఆమె హత్య చేసిందని కోర్టు భావించింది.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వున్న ఈ రోగుల పట్ల జాలి కలిగి ఆమె పానికరమైన మందులు ఇంజెక్ట్‌చేసి వుంటుందని న్యాయమూర్తి తెలిపారు.

'చావు బ్రతుకుల యజమాని'గా ప్రవర్తించిన ఈ నర్సుకు జీవితశిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది కోరారు.

అయితే కోర్టువారు మిచల్ రాయడర్‌కు 11ఏళ్ల కారాగార శిక్ష విధిస్తూ సోమవారం తీర్పునిచ్చింది.

విశాఖరేవు అభివృద్ధికి కేంద్రం సమ్మతి

విశాఖపట్నం, సెప్టెంబర్ 12: విశాఖపట్నం ఓడరేవును మరింతగా లోతుచేసి అభివృద్ధి చేసే పథకానికి కేంద్ర అడవులు, పర్యావరణ శాఖ అనుమతి మంజూరు చేసింది. ఇనుప ఖనిజం రవాణా సౌకర్యాల మెరుగుదలకు సౌకర్యాలను కల్పించాలని ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ కోరింది.

తీర ప్రాంతంలోని కట్టడాలు నౌకల నుండి వచ్చే నిరుపయోగ పదార్థాలు సముద్రంలో కలిసి జలాలను కలుషితం చేయకుండా తగిన చర్యలు గైకొనాలని కేంద్ర అడవులు, పర్యావరణ శాఖ షరతు విధించింది. ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సమగ్రమైన పథకాన్ని రూపొందించి ఆరు మాసాలలోగా దీనిని పరిశీలనకు పంపాలని కూడా మంత్రిత్వ శాఖ పోర్ట్ ట్రస్ట్ అథారిటీని కోరింది.

బి.జె.పి. సభ్యుని వ్యాఖ్యకు న్యాయశాఖ మంత్రి ఆగ్రహం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 12 : శాసనసభల్లో మంగళవారం భారతీయ జనతాపార్టీ సభ్యుడు శ్రీ సి.హెచ్. విద్యాసాగర్‌రావు శాసనసభ శిక్ష విధించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను భారతీయ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలపై విడుదల చేయడం గురించి 304 నిబంధన కింద ఇచ్చిన నోటీసుపై మాట్లాడుతున్నప్పుడు న్యాయశాఖమంత్రి శ్రీ సి. ఆనందరావుపై చేసిన వ్యాఖ్యలు మంత్రికి ఆగ్రహాన్ని కలిగించాయి.

శ్రీ సి.హెచ్. విద్యాసాగర్ రావు (బి.జె.పి.) మాట్లాడుతూ శాసనసభ శిక్ష విధించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలను సుప్రీమ్‌కోర్టు విడుదల చేయవలసిందిగా శాసనసభ స్పీకర్‌కు ఆదేశాలు ఇచ్చిన ఉత్తర్వులపై ఉత్పన్నమైన వివాదాన్ని చర్చించటానికి సభను సమావేశ పరచాలని స్పీకర్ భావించారని, ఈ సంఘటన జరిగినప్పటి నుంచి న్యాయశాఖమంత్రి పైముఖ్యాన్ని అవలంభించారని, శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి మంత్రి బాధ్యత తీసుకునిఉంటే బాగుండేదని అన్నారు. ఈ విషయంలో మంత్రి నైరాశ్యంగాను, నిర్వీర్యంగాను, నిమిత్తమాత్రుడిగాను ఉండిపోయారని శ్రీ విద్యాసాగరరావు పదేపదే అనడంతో మంత్రి శ్రీ ఆనందరావు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

న్యాయశాఖమంత్రి శ్రీ ఆనందరావు జోక్యం చేసుకుంటూ వ్యక్తిగతంగా సభ్యుడు నిర్వీర్యం, నిరాశ్రయం అని అనడం సబబుగాలేదని, మీరు ఎన్నిగంటలు మాట్లాడినా జరగవలసింది జరుగుతుందని కొన్ని వ్యాఖ్యలు చేశారు.

జయవర్ధనే మరదలి కాల్చివేత

శ్రీలంక, సెప్టెంబర్ 12: శ్రీలంకలోని మాజీ అధ్యక్షుడు శ్రీ జె.ఆర్. జయవర్ధనే మరదలును గుర్తు తెలియని సాయుధులు మంగళవారం తుపాకితో కాల్చి చంపివేశారు.

మాజీ అధ్యక్షుడు శ్రీ జయవర్ధనే తమ్ముడు శ్రీ ఆర్.పి. జయవర్ధనే భార్య శ్రీమతి గ్లాడిస్ జయవర్ధనే కారుపై రద్దీగా ఉండే స్లేవ్ ఐలాండ్ ప్రాంతంలో అయిదుగురు సాయుధులు బుల్లెట్‌లు కురిపించి ఆమెను తుదముట్టించారు. వివరాలు అందలేదు.

1987 జూలైలో శ్రీ రాజీవ్ గాంధీతో అప్పటి శ్రీలంక అధ్యక్షుడు శ్రీ జె. ఆర్. జయవర్ధనే భారత శ్రీలంక ఒప్పందం కుదుర్చుకొన్న అనంతరం తీవ్రవాద జె.వి.పి., జయవర్ధనే ప్రభుత్వంపై హింసాకాండ ప్రారంభించింది.

రైతుజాగృతి సదస్సులు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబర్ 12: పాడిపరిశ్రమ, పట్టు పరిశ్రమ పండ్ల తోటలు, చెరకు పంటలసాగు విషయంలో రైతులను జాగృతం చేసేందుకు రాష్ట్ర కర్షకపరిషత్ విత్తూరు జిల్లా అన్ని నియోజకవర్గాలలో కర్షక చైతన్య సదస్సులను నిర్వహిస్తుంది.

ఈనెల 18 నుండి 20 వరకు 26, 27, తేదీలలో రెండు దశలలో ఈసదస్సులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కర్షక పరిషత్ అధ్యక్షుడు శ్రీ డి. వెంకటరావు, మాజీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబునాయుడు, తెలుగుదేశం ప్రాంతీయ కార్యదర్శి శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు విలేఖరులకు ఈ సంగతి తెలియజేశారు.

18న కుప్పం, పుంగనూరు, 19న కలికిరి, వాయిల్పాడు, మొలకల చెరువు, మదనపల్లి, 20న పాలేరు, పాకాల, చంద్రగిరి, తిరుపతి, 26న చిత్తూరు, పెనుమూరు, పుత్తూరు, 27న నగరి, సత్యవీడు, కాళహస్తిలలో ఈ సదస్సులు జరుగుతాయి.

అధ్వాన్నస్థితిలో రాజధానిరోడ్లు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 12: హైదరాబాద్-సికింద్రాబాద్ జంట నగరాలలో రహదారుల పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. రహదారులు పునః నిర్మించడానికి ప్రభుత్వం ఏమైనా చర్యలు గైకొంటున్నదా? అని సర్వశ్రీ జనార్దనరెడ్డి, కె. ఎర్రంనాయుడు, జి.ఎస్.ఎస్. శివాజీ మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నించారు.

పురపాలక శాఖామంత్రి శ్రీ వడ్డీ రంగారావు సమాధానమిస్తూ ఇటీవల కురిసిన వర్షాలవల్ల రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నమాట వాస్తవమని అంగీకరించారు.

అయితే పాతబస్తీలో రహదారుల నిర్మాణానికి టెండర్లు పిలిచామని మంత్రి అన్నారు. రహదార్ల విషయం దాదాపు ప్రతిదినం మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ తోనూ, పాతపట్టణం అభివృద్ధి సంస్థ అధికారుల తోనూ చర్చలు కొనసాగిస్తున్నామని మంత్రి శ్రీ వడ్డి రంగారావు సమాధానమిచ్చారు.

వాహనాల పార్కింగ్ విషయంలో గతంలో చేసిన ప్రభుత్వ ఉత్తర్వుపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని తరువాత కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశంలో చర్చించిన తరువాత ఉత్తర్వులు జారీ చేస్తామని మంత్రి అన్నారు.

టి.డి.పి. శాసనసభ్యుడు శ్రీ జి.ఎస్.ఎస్. శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వం రహదార్ల మరమ్మతుకు ఎంత కేటాయించింది అని అడగగా మంత్రి సమాధానమిస్తూ 23 రహదారులకు నివేదిక తయారుచేసామని వాటి విలువ రు. 2.20 కోట్లు అని అదికాక పాతబస్తీ అభివృద్ధి సంస్థ, ప్రభుత్వం 50 శాతం ఖర్చుతో మరి కొన్ని రహదార్ల నిర్మాణం చేస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ సభ్యుడు శ్రీ పి. జనార్దనరెడ్డి మాట్లాడుతూ ఇటీవల వర్షాలకు ముందు జంటనగరాలలో రహదార్ల నిర్మాణానికి ప్రభుత్వం ఎంత నిధులు కేటాయించింది అని ప్రశ్నించారు.

స్పీకర్ శ్రీ జి. నారాయణరావు జోక్యం చేసుకుంటూ 5 సంవత్సరాల నుండి రహదార్ల పరిస్థితిపై చర్చిస్తూ కార్పొరేషన్ ఏమి చేస్తున్నదని ప్రశ్నించారు. జంట నగరాలలో కార్పొరేషన్ పరిధిలో రహదార్ల నిర్మాణం కార్పొరేషన్ చేయాలని అన్నారు. అది కార్పొరేషన్ విధి అన్ని చెప్పారు.

కాని కాంగ్రెస్ సభ్యుడు శ్రీ జనార్దనరెడ్డి జోక్యం చేసుకుంటూ రహదార్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉంది ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై మంత్రి సమాధాన మివ్వాలని పట్టుబట్టారు.

పురపాలక శాఖామంత్రి శ్రీ వడ్డి రంగారావు సమాధానమిస్తూ ఒక్క రాష్ట్రంలోనే కాదు యావత్ భారతదేశంలో రహదార్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని సమాధానమిచ్చారు.

తాము రాష్ట్ర పరిస్థితిని గురించి ప్రశ్నిస్తే దేశ పరిస్థితిని గురించి ఎందుకు మాట్లాడుతున్నారు అని కాంగ్రెస్ సభ్యులు శ్రీ జానీ, శ్రీ జనార్దనరెడ్డి మంత్రిని ప్రశ్నించారు.

స్పీకర్ జోక్యం చేసుకుంటూ సభ్యులు ఏదయినా ప్రశ్న తన ద్వారా అడగాలే తప్ప నేరుగా మంత్రులను ప్రశ్నించరాదని సలహా ఇచ్చారు.



పన్ను బాకీలు రు.308 కోట్లు!

హైదరాబాద్, సెప్టెంబరు 12: : అమ్మకంపన్ను, రాష్ట్ర ఎక్సైజ్ సుంకం, భూమిశిస్తు, ప్రత్యేక భూమి పన్ను, యింకా ఇతర ఖాతాల క్రింద రావలసిన రు. 308 కోట్ల మేరకు బకాయిలను 1987 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వసూలు చేయలేదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజా నివేదికలో తెలియజేశారు.

పెద్ద మొత్తంలో వున్న ఈ బకాయిలలో అమ్మకం పన్నులే రు. 79.60 కోట్ల మేరకు వసూలు కావలసి వున్నదని నివేదికలో పేర్కొన్నారు. కాగా మొత్తం బకాయిలలో ఐదు సంవత్సరాల నుండి వసూలు కావలసిన బకాయిలు రు. 93 కోట్లు వున్నాయి.

1985-86 ఎక్సైజ్ సంవత్సరం వరకు వసూలు కావలసిన బకాయిలు రు. 18.35 కోట్లు వున్నాయి. 1987 మార్చి ఆఖరు నాటికి భూమి శిస్తు బకాయిలు రు. 67.59 కోట్లు, విద్యుత్ ఖాతా క్రింద సుంకాలు, పన్నుల బకాయిలు రు. 32.59 కోట్లు వున్నాయి.

వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించి ఎన్సైన్‌మెంట్ ఫైళ్ళు, రిఫండ్ రికార్డులు, యితర డాక్యుమెంట్లను పరిశీలిస్తే 1023 కేసులలో రు. 3.34 కోట్ల మేరకు అమ్మకం పన్నును తక్కువగా అంచనావేసి చూపించినట్లు స్పష్టమవుతున్నదని 'కాగ్' నివేదిక వివరించారు.

ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 30 రోజులలో రిజిస్ట్రేషన్ పునరుద్ధరించుకొనట్లయితే రిజిస్ట్రేషన్ రద్దు చేయాలనే స్పష్టమైన నిబంధన వున్నప్పటికి చాలా సందర్భాలలో దీనిని పాటించలేదని నివేదిక పేర్కొన్నది.

రాష్ట్ర ఎక్సైజ్ కార్యాలయం రికార్డులకు సంబంధించి మచ్చుకు జరిపిన పరిశీలనలో 42 కేసులలో సుంకాన్ని తక్కువగా విధించినట్లు వెల్లడయిందని, దీనివల్ల ప్రభుత్వానికి రు. 55.80 లక్షల ఆదాయం నష్టం జరిగిందని నివేదికలో తెలిపారు.

భూమిశిస్తు ఖాతా క్రింద వ్యవసాయ భూముల శిస్తును తక్కువగా చూపినట్లు తెలిపారు. అలాగే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల విషయంలో కూడ తక్కువగా సుంకం విధించినట్లు ఆడిట్‌లో బయట పడిందని నివేదికలో వివరించారు.

వినోదపు పన్ను మదింపు సక్రమంగా జరగలేదని, రాష్ట్రంలో అనేక చోట్ల సినిమా థియేటర్‌లకు సంబంధించి రు. 47.27 లక్షల పన్నును ప్రభుత్వం కోల్పోయిందని కాగ్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ కార్పొరేషన్ 1981-86 మధ్య కాలంలో రు. 24.83 కోట్ల రుణాలకు సంబంధించి నిబంధనలనేవే లేవని, ఈ రుణాలనుగాని, వడ్డీని వసూలు చేయలేదని నివేదికలో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బోర్డు పేరిట 1986 మార్చి నాటికి వున్న రుణాల నిలువ రు. 621 కోట్లు కాగా, వాటిపై చెల్లించవలసిన వడ్డీ రు. 19.26 కోట్లు. వివిధ ఏజెన్సీలు విద్యుత్ బోర్డుకు చెల్లించవలసిన విద్యుత్ బకాయిలు 1986 మార్చి నాటికి రు. 46.58 కోట్లు వున్నాయని నివేదికలో తెలిపారు.

పూరిళ్ల నిర్మూలనకు నిరసనగా నిరశన

నెల్లూరు, సెప్టెంబర్ 12: స్థానిక గాంధీనగర్ ప్రాంతంలో సిపిఐ. ఆధ్వర్యంలో ఇటీవల కొందరు వేసుకున్న గుడిసెలు రెవిన్యూ అధికారులు తొంగించి వేయడాన్ని నిరసిస్తూ సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయం ముందు సిపిఐ. నిరాహారదీక్షలు కొనసాగిస్తున్నట్లు ఆ పార్టీ నెల్లూరు పట్టణ కార్యదర్శి శ్రీ ఎం. రామచంద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సోమవారం జరిగిన మహిళల నిరాహార దీక్ష కార్యక్రమానికి సిపిఐ. పట్టణ మహిళా సమాఖ్య కార్యదర్శి శ్రీమతి ఎం. బుజ్జమ్మ సారధ్యం వహించినట్లు, ఈ శిబిరంలో పది మంది మహిళలు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు. ఈ శిబిరాన్ని తాను, ఎ.ఐ.టి.యు.సి. కార్యదర్శి శ్రీ వి. రామరాజు ప్రారంభించామని కూడా ఆయన తెలిపారు.

చింతతోపు గ్రామంలో అగ్నిప్రమాదం

నెల్లూరు, సెప్టెంబర్ 12: జిల్లాలోని తోటపల్లి గూడూరు మండలంలోని చింతతోపు గ్రామంలో సోమవారం వేకువజామున జరిగిన అగ్నిప్రమాదంలో ఒక ఇల్లు దగ్ధమయింది. అలాగే ముత్తుమూరు మండలంలోని పుంజలూరు పాడు గ్రామంలోని ఒక పూరిల్లు సోమవారం ఉదయం దగ్ధమయింది. దాదాపు 10 వేలు నష్టం వాటిల్లి వుండవచ్చునని తెలుస్తోంది.

విశాఖలో మరో నక్సలైట్ లొంగుబాటు

విశాఖపట్నం, సెప్టెంబరు 12: : పీపుల్సు వార్ గ్రూపు సెంట్రల్ ఆర్గనైజేషన్ సభ్యుడు శ్రీ షేక్ మౌలా ఈ రోజు విశాఖపట్నం పోలీసుల వద్ద లొంగిపోయారు.

విశాఖ జిల్లా రూరల్ పోలీసు సూపరింటెండెంట్ శ్రీ పి. చంద్రశేఖరరెడ్డి ఎదుట లొంగిపోయిన శ్రీ షేక్ మౌలా ఆ తర్వాత విలేఖరులతో మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా తాను కటక్‌లో వుంటున్నానని చెప్పారు.

విశాఖ జిల్లా చోడవరం మండలంలో నక్సలైట్ ఉద్యమానికి ఆర్గనైజర్ వున్న శ్రీ షేక్ మౌలా 1984 నుండి అజ్ఞాత జీవితం గడుపుతున్నారు. విశాఖ జిల్లాలో ఇప్పటివరకు ఆరుగురు నక్సలైట్లు లొంగిపోయారు.

ఇప్పటికీ కూర్చి వేతకుర్రలు

మధురై, సెప్టెంబరు 12: : తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ హర్యానా, అస్సాంలోని నాన్ కాంగ్రెస్ ప్రభుత్వాలను రానున్న లోక్‌సభ ఎన్నికలకు ముందుగానే కూర్చివేయాలనే పథకంతో కేంద్రంలోని కాంగ్రెస్ (ఐ) నాయకత్వం ప్రయత్నాలు సాగిస్తున్నదని జనతాదళ్ ఉపాధ్యక్షులు శ్రీ రామకృష్ణ హెగ్డే ఆరోపించారు.

విలేఖరులతో మాట్లాడుతూ కర్నాటక పరిణామాల అనుభవాన్ని ఉటంకించారు. ఎటువంటి కారణం లేకుండానే కర్నాటక జనతాదళ్ ప్రభుత్వాన్ని కేంద్రం బర్తరఫ్ చేసి, శాసనసభను రద్దు చేసిందని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలను అనుకూల వాతావరణానికి వీలుగా వాయిదా వేయవచ్చుననే వుకార్లు, ఊహాగానాలు వున్నాయని శ్రీ హెగ్డే అన్నారు.

కాంగ్రెస్ (ఐ) సర్వే ప్రకారం ఆ పార్టీకి రానున్న ఎన్నికలలో 125 నుండి 130 సీట్లకు మించి రావని శ్రీ హెగ్డే చెప్పారు.

రానున్న ఎన్నికలలో నేషనల్ ఫ్రంట్‌కు మెజారిటీ వస్తే నాయకత్వం ఎవరికి లభిస్తుందని ప్రశ్నించగా నేషనల్ ఫ్రంట్‌లోని ఏ పార్టీకి అత్యధిక స్థానాలు లభిస్తే ఆ పార్టీకే నాయకత్వం వుంటుందని అన్నారు. ఈ విషయమై భాగస్వామ్య పార్టీలు చర్చించి ఒక నిర్ణయానికిరాగలవని ఆయన అన్నారు.

తొలి దశలో కొన్ని ఎదురు దెబ్బలు తగిలినప్పటికి ఇప్పుడు సంఘటితమై, ఎన్నికలకు సిద్ధమవుతున్నదని తెలిపారు. దళ్‌లో నిర్మాణ సమస్యలకు అంతగా ప్రాముఖ్యత నివ్వవలసిన పనిలేదన్నారు.

బోఫోర్స్ వ్యవహారం

బోఫోర్స్ శతఘ్నుల ఒప్పందంపై మాజీ సైన్యాధిపతి జనరల్ సుందర్జీ,

పలు పిటిషన్‌లకు సుప్రీంకోర్టు అనుమతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారాన్ని సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో సోమవారంనాడు దాఖలైన 12 పిటిషన్లని స్వీకరించింది. ఈ పిటిషన్లను తొమ్మిది రాష్ట్రాలలోని క్రికెట్ అసోసియేషన్లు, రెండు క్రీడాసంస్థలు, మరొక రిట్‌ను ఎనిమిదిమంది ఎడిటర్లు దాఖలుచేసారు.

ఆ రిట్ పిటిషన్లన్నింటిని, ప్రధాన రిట్‌తో అనుసంధానం చేసి మంగళవారంనాడు వాదనలు వినగలరని ప్రధాన న్యాయమూర్తి ఇ.ఎస్. వెంకటరామయ్య ప్రకటించారు.

బస్సు ఆపని కండక్టరుకు కండెలు వాచాయి

నెల్లూరు, సెప్టెంబర్ 12: ఎంతో వ్యయప్రయాసలకోర్చి బస్సు ప్రయాణంకోసం రోడ్డు మీదకు వస్తే వచ్చిన బస్సు ఆపనందుకు కండక్టరును దేహశుద్ధి చేసిన ఉదంతం తెలిసింది.

ఆదివారం సర్వేపల్లి వద్ద వస్తున్న ఆర్.టి.సి. బస్సు కండక్టరు ఎ. పొన్నురాజు ఆపకపోవడంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని తెలుస్తోంది. సర్వేపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా వేలంపాటలు

నెల్లూరు, సెప్టెంబర్ 12 (నవవార్త): స్థానిక కస్తూర్బా కళాక్షేత్రంలో 1989-90 సంవత్సరానికి సారాయి వేలం పాటలు జిల్లా కలెక్టరు శ్రీ కె. రాజు, జాయింట్ కలెక్టరు శ్రీమతి ప్రీతిసుధాన్, జిల్లా ఆబ్కారీ సూపరింటెండెంట్ శ్రీ కె. దివాకర్, గుంటూరు డివిజన్ ఆబ్కారీ ఉప కమిషనర్ శ్రీ డి. ప్రసాదరావు నిర్వహించారు.

జిల్లా నలుమూలల నుండి ఈ వేలం పాటలకు పాటదారులు వచ్చారు.

1988-89 సంవత్సరానికి ప్రివిలైజ్ ఫీజ్ 15 అంగళ్లకు 40 లక్షల 64 వేల 675 రూపాయలు రాగా, 1989-90 సంవత్సరానికి 54 లక్షల 26 వేల 820 రూపాయలు ప్రభుత్వానికి వేలం పాటల్లో వచ్చింది.

అగ్నిప్రమాదం

తిరుపతి, సెప్టెంబరు 12 (నవవార్త) : ఇక్కడకు సమీపంలోని చంద్రగిరి వద్ద అగ్నిప్రమాదం జరిగి ఆరు పెద్ద తాటాకు ఇళ్లు దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో వ్యవసాయసామాగ్రి, బట్టలు, ధాన్యం బూడిద అయ్యాయి.

రాజమండ్రి దళ్ సభలకు వి.పి.సింగ్, దేవీలాల్

కొత్తపేట, సెప్టెంబరు 12: (నవవార్త) : తూర్పు గోదావరి జిల్లా జనతా పార్టీ సమావేశాలకు నేషనల్ ఫ్రంట్ కన్వీనర్, జనతాదళ్ అధ్యక్షుడు శ్రీ వి.పి.సింగ్ ఈనెల 13న రాజమండ్రి రానున్నారు. ఈ సభలకు హర్యానా ముఖ్యమంత్రి శ్రీ దేవీలాల్ కూడా హాజరౌతారని పార్టీ నాయకుడు శ్రీ పి.కొండలరావు ఒక ప్రకటనలో తెలియజేసారు.

రాజమండ్రిలో జరిగే ఈ సభలను జయప్రదం చేసే నిమిత్తం శ్రీ కొండలరావు జిల్లాలో పర్యటిస్తున్నారు.

బొబ్బిలిడిస్టిలరీఏర్పాటుఎప్పుడు?

(ఆంధ్రపత్రిక రాజకీయ ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబర్ 12: బొబ్బిలిలో డిస్టిలరీ ఏర్పాటు ఎప్పుడు జరుగుతుందని శాసనసభ్యులు సర్వశ్రీ ఎన్.వి. చిన్న అప్పలనాయుడు, కె. రామమోహనరావు ప్రశ్నోత్తరాల సమయంలో చక్కెర పరిశ్రమల మంత్రిని ప్రశ్నించారు.

చక్కెర, దౌళిశాఖ మంత్రి శ్రీ జి. నాగిరెడ్డి సమాధానమిస్తూ బొబ్బిలి చక్కెర కర్మాగారం సమీపంలో, ఏ డిస్టిలరీ ఏర్పాటు త్వరలో జరుగుతుందని సమాధానమిచ్చారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతిచ్చాయని, నిర్మాణానికి రు. 5కోట్లు ఖర్చు కాగలదని, ఆ మొత్తాన్ని ఆర్థిక సంస్థల సహాయాన్ని అర్థించమని, వారు మంజూరు చేసిన వెంటనే పనులు చేపడతామని మంత్రి సమాధానమిచ్చారు.

సి.పి.ఐ. సభ్యుడు శ్రీ సిహెచ్. విఠల్‌రెడ్డి మాట్లాడుతూ పై డిస్టిలరీని నిజామ్ షుగర్ ఫ్యాక్టరీకి అప్పగించారా అని ప్రశ్నించారు.

మంత్రి సమాధానమిస్తూ మొట్ట మొదట బొబ్బిలి, సీతారామనగర్ ఫ్యాక్టరీలు బొబ్బిలి రాజా వారి క్రింద వుండేవని, అయితే ఫ్యాక్టరీలో నష్టం వచ్చిన కారణాన వాటిని ప్రభుత్వం చేపడుతున్నదని అన్నారు.

కర్మాగారంలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి జెనరేటర్లు లేవని, యంత్రాలు పూర్తిగా పాడయ్యాయని, కొత్త యంత్రాలు కొనాలని మంత్రి తెలిపారు.

కాంగ్రెస్ సభ్యుడు శ్రీ ఆలపాటి ధర్మారావు ప్రశ్నిస్తూ ప్రభుత్వం కొన్ని సంస్థలు ప్రభుత్వం చేపట్టాలని విజ్ఞప్తి చేసిన దరఖాస్తులను పరిశీలించలేదని ఆరోపించారు. వాటి వివరాలు సభ ముందు ఉంచాలని ఆయన కోరారు.

మంత్రి సమాధానమిస్తూ వాటిని పరిశీలిస్తామని అన్నారు.

లంచగొండి అధికారులపై చర్య

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 12: తూనికలు,కొలతల అధికారులు కొందరు కాంట్రాక్టర్లను ప్రోత్సహిస్తూ వ్యాపారస్తుల వద్ద నుండి సీట్ల వేయుటకు పెద్ద ఎత్తున లంచాలు పుచ్చుకొంటున్నారని, ఈ విషయంపై చర్యతీసుకొని దోషులను శిక్షించాలని నేడు శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సర్వశ్రీ యు. వెంకటరెడ్డి, ఎం. కాశిరెడ్డి, ఎన్.ఆర్. హాయ్ దేవనాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

తూనికలు, కొలతల శాఖ మంత్రి శ్రీ బషీరుద్దీన్ బాబూఖాన్ మాట్లాడుతూ అలాంటి విషయాలు ప్రభుత్వ దృష్టికి రాలేదని సమాధానమిచ్చారు.

మంత్రి సమాధానంపట్ల సంతృప్తి చెందని సభ్యులు అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. శాసనసభ్యుడు శ్రీ కె. సుబ్బారెడ్డి మాట్లాడుతూ తూనికలు, కొలతల శాఖ అధికారుల అక్రమాల కారణంగా ఎంతోమంది వినియోగదారులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

బుష్‌పై షెవర్డ్‌నాజే విమర్శ

మాస్కో, సెప్టెంబర్ 12 : అమెరికా మాజీ అధ్యక్షుడు శ్రీ రోనాల్డ్‌రీగన్ పాలనలో ఏర్పరచబడిన అవకాశాలను శ్రీ బుష్ సద్వినియోగపరచకుండా ప్రధాన ఆయుధాల నియంత్రణ ఒప్పందాన్ని శ్రీ జార్జి బుష్ ఉల్లంఘిస్తున్నారని సోమవారం నాడు రష్యా విదేశాంగ మంత్రి శ్రీ ఎడ్వర్డ్ ఎ. షెవర్డ్‌నాజే ఆరోపించారు.

విజయవాడ సిటీబస్సుల జాతీయానికై ఉద్యమం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

విజయవాడ, సెప్టెంబర్ 12 : సిటీబస్సుల నన్నిటినీ జాతీయం చేయాలని, సెప్టెంబర్‌లో 10 లోగా ప్రకటించాలన్న శ్రీముఖం గడువు తీరడంతో ఇక ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నట్లు సి. పి. ఐ. అనుబంధ సంఘాల ఆధ్వర్యాన ఏర్పడిన పోరాట కమిటీ ప్రకటించింది.

గతనెల 20 న ఇక్కడ జరిగిన సమావేశం ప్రభుత్వాన్ని ఈ వ్యవహారంపై హెచ్చరించింది.

కన్వీనరు శ్రీ కె. శేఖర్ బాబు మంగళవారం పత్రికలవారితో మాట్లాడుతూ, సిటీబస్సుల జాతీయానికి అవసరమైన అన్ని చర్యలు పూర్తి అయిపోయి ముఖ్యమంత్రి సంతకం కోసం ఫైలు వేచి ఉన్నదని, హైదరాబాదు, విశాఖపట్టణంలో జాతీయం చేసి ఇక్కడ చేయకపోవడంలో గల ఔచిత్యం ఏమిటో అవగతం కాదని అన్నారు.

నగరంలో 105 ప్రయివేట్ బస్సులు, 54 ఆర్.టి.సి. బస్సులు నడుస్తున్నాయి.

విజయవాడ డొంకరూట్లు, కడప నెల్లూరు రూట్లు జాతీయం చేసిన ప్రభుత్వం విజయవాడ బస్సులను జాతీయంచేయక పోవడంలో ప్రజలకు ఏవో అనుమానాలు ఉన్నాయని ఆయన అన్నారు.

బస్సులు జాతీయాన్ని కోరుతూ 17న ముఖ్యమైన కేంద్రాల్లో పికెటింగ్‌లు జరుపుతామని, అనంతరం ముఖ్యమంత్రి వద్దకు ఒక ప్రతినిధివర్గం కూడా వెడుతుందని శ్రీ శేఖర్‌బాబు చెప్పారు.

హైదరాబాద్‌లో భవనంకూలి బాలుని మృతి

హైదరాబాద్, సెప్టెంబర్ 12: పాత బస్తీలోని మదీనా మసీదు సమీపంలో తకరికానాకా వద్ద ఒక భవనం కూలిపోయి రెండేళ్ల వసీబాలుడు మరణించాడు. ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని ఉస్మానియా ఆసుపత్రిలో చేర్చారు.

ఆగని తూర్పుజర్మన్ శరణార్థుల వెల్లువ

పాసౌ(పశ్చిమజర్మనీ), సెప్టెంబరు 12 : పశ్చిమజర్మనీ నుంచి, తూర్పుజర్మన్ శరణార్థులు, అధిక సంఖ్యలో పశ్చిమజర్మనీకి తరలిపోవటం ఈ రోజు కూడా కొనసాగింది. హంగరీలోకి మరో 16000 మంది తూర్పుజర్మన్‌లు ప్రవేశించారనే వార్త చేరిన తర్వాత, అరీతిగా వేలమంది రాకకు అధికార్లు సమాయత్తం అయినారు.

కనీసం, 808 మంది తూర్పుజర్మన్‌లు సరిహద్దు ప్రాంతంలో మూడు వేర్వేరు చోట్లకు చేరుకున్నారని, బవేరియాలో సరిహద్దు పోలీస్ వారు పేర్కొన్నారు. ఇంకా పలువురు యీ ఉదయం వస్తున్నారని, వారు తెల్పారు.

శరణార్థులు ఎక్కువమంది, వందలాది ప్రయివేటు కార్లలో కనీసం 100 బస్సులలోనూ వచ్చారు. వీరంతా హంగరీనుంచి, ఆస్ట్రియా మీదుగా, పశ్చిమజర్మనీలో దక్షిణరాష్ట్రం బవేరియా చేరుకొన్నారు. 2208 మంది శరణార్థులలో, 377 మంది పాసౌ సరిహద్దు స్టేషన్‌కు రైలులో చేరుకొన్నారు.

వారిని పాస్ రాష్ట్రంలోని, గీసెన్‌లోని శరణార్థ శిబిరానికి కొనిపోవటం జరిగిందని సరిహద్దు పోలీస్ తెల్పారు.

16 వేలమంది తూర్పుజర్మన్‌లు, గత 24 గంటలలో హంగరీ చేరారని, నేడు, ప.జర్మన్, టి.వి., తెల్పింది. తూర్పుజర్మన్‌లు, రుమేనియా, బల్గేరియా, చెకోస్లవేకియా నుంచి వచ్చారని బుడాపెస్ట్ రేడియో తెల్పినట్లు ప.జర్మన్ టి.వి. ప్రసారం చేసింది.

సభాహక్కుల్లోజోక్యం

(1వ పేజీ తరువాయి)

శాసనసభ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని ఆయన కోరారు.

శ్రీ ఎం. ఓంకార్ (ఎం.సి.పి.ఐ.) శాసనసభ పార్లమెంట్ సభ్యుల అధికారాలను క్రోడీకరించని కొన్ని అంశాలను కోర్టులు పరిశీలిస్తున్నాయని ఇటువంటివాటిని ఖండిస్తూ ఒక తీర్మానాన్ని చేయాలని అన్నారు.

సుప్రీంకోర్టు విడుదల ఉత్తర్వులను అమలుపరచవలసిన పని ఏమీలేదని అయితే దయార్ద్రహృదయంతో స్పీకర్ అమలుచేసారని సుప్రీంకోర్టు తన పరిధిని దాటిందని ఆయన అన్నారు.

శ్రీ రజబ్ అలి (సి.పి.ఐ.) రాజ్యాంగపరంగా మనకు గల హక్కులను మనం కాపాడుకోవాలని ఎవరో మనల్ను రక్షించవలసిన అవసరంలేదని ఈ విషయంలో ఒక తీర్మానం చేయాలని ఆయన కోరారు.

సుప్రీంకోర్టు శాసనసభ హక్కుల విషయంలో జోక్యం చేసుకోకుండా చూడాలని రాష్ట్రపతిని కోరాలని ఇందుకు సంబంధించి ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని శ్రీ ఎన్. రాఘవరెడ్డి (సి.పి.ఎం.) కోరారు.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి (కాం) మన హక్కులను క్రోడీకరిస్తూ ఒక తీర్మానం చేయాలని కోరారు.

న్యాయశాఖ మంత్రి శ్రీ సి. ఆనందరావు మాట్లాడుతూ ఆనాడు తీర్మానం ఏకగ్రీవంగా చేసే హైకోర్టు మన తీర్మానాన్ని సమర్థించిందని అయితే సుప్రీంకోర్టు స్టే ఇవ్వడం దురదృష్టకరం అని అన్నారు.

అసెంబ్లీ చేసిన తీర్మానం విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం వారి పరిధికి మించిన పని అని ఆయన అన్నారు.

శాసనసభ అధికారాలలో 211 ప్రకారం శాసనసభ హక్కులు అధికారాలలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకొనే అధికారాలు లేవని అదేవిధంగా 212 నిబంధన 2 ప్రకారం స్పీకర్‌ను కోర్టుకు పిలిచే అధికారం కోర్టుకు లేదని ఆయన అన్నారు.

ఈ విషయంలో శాసనసభలో వివిధ పక్షనాయకులు చర్చించి ఒక తీర్మానం చేసి రాష్ట్రపతి దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి (కాం) మాట్లాడుతూ శాసనసభకు కొన్ని బాధ్యతలు ఉన్నట్లు న్యాయస్థానాలకు కూడా రాజ్యాంగం ప్రకారం కొన్ని బాధ్యతలు ఉన్నాయని అన్నారు.

1983లో శాసనసభలో శ్రీ రామోజీరావ్ విషయంలో ప్రభుత్వం ఒక వైఖరిని అవలంబించిందని ఇప్పుడు మరొక వైఖరిని అవలంబిస్తోందని ఆయన అన్నారు.

స్పీకర్ శ్రీ జి. నారాయణరావు జోక్యం చేసుకొంటూ ఆ కేసు మనకు ఎంతవరకు ఉపయోగపడుతుందని అన్నారు.

మీరు న్యాయపరమైన అంశాలనే ప్రస్తావించండిగానీ రాజకీయ అంశాలను వద్దు అని స్పీకర్ శ్రీ నారాయణరావు కాంగ్రెస్ (ఐ) సభ్యుడు శ్రీ సమరసింహారెడ్డి మాట్లాడుతున్నప్పుడు అన్నారు.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి (కాం) రాజ్యాంగ నిర్దేశక సభ రూపొందించిన అంశాలను ప్రస్తావిస్తున్నప్పుడు ఈ విషయాలు ఇప్పుడు దేనికి 211, 212 అధికరణాలను మీరు చదవండి అని స్పీకర్ అన్నారు.

మనకు ఈరోజు హక్కులు లేకపోతే ఒకరోజు కూడా సభను నిర్వహించలేమని సుప్రీంకోర్టును అగౌరవపరచడంలేదని రాజ్యాంగాన్ని గౌరవించాలని స్పీకర్ అన్నారు.

18 అంతర్‌రాష్ట్ర బస్‌సర్వీసులు

తిరుపతి, సెప్టెంబరు 12 (నవవార్త) : తిరుపతి డివిజన్ నుండి కొత్తగా 18 అంతర్ రాష్ట్ర బస్సు రూట్లను ప్రారంభిస్తామని ఆర్.టి.సి. డివిజనల్ మేనేజర్ శ్రీ వై. విజయకుమార్ చెప్పారు. ఒక నెల రోజుల్లో ఈ రూట్లను ప్రారంభిస్తామని అన్నారు.

తిరుపతి నుంచి సేలం, పళని, తిరువన్నామలై, ఆర్కోట్, తిరువట్టూర్, ఆరని, వెల్లూరు, కృష్ణగిరి, పాన్నేరి, తదితర ప్రాంతాలకు బస్సులను నడుపుతారు.

అన్న 'మహనీయ' మూర్తి

నెల్లూరు, సెప్టెంబర్ 12 (నవవార్త) :

అన్న దేవుడు...
ఓ మహనీయుడు

మహిళల కోసం ఉద్భవించిన ఆదర్శమూర్తి ఆడపడుచుల సమస్యల కోసం నిత్యం తపించే ఓ చైతన్యదీప్తి ఆమె నీరుకారిపోయింది.

ముఖ్యమంత్రి ఆడపడుచుకు 30 శాతం రిజర్వేషన్లు, ఆస్తి హక్కు కల్పించారని, ముఖ్యమంత్రిని వెన్నంటి వుండటం మహిళల కర్తవ్యమని మహిళలకు తన ఉద్బోధ చెయ్యబోగా ఓ విలేకరి ఎన్నికల్లో 30 శాతం

ఆడపడుచు అభిమాన అభినివేశాలు

అంటూ ఆదివారం రాత్రి జిల్లా తెలుగు మహిళ సదస్సుకు పోజరైన అల్లూరి రమాదేవి పత్రికా విలేఖర్ల సమావేశంలో "రామనామ జపం"తో తన అభిప్రాయాల్ని వెల్లడించడం ప్రారంభించింది.

మహిళలంటే ముఖ్యమంత్రి శ్రీ రామారావుకు ఎనలేని ప్రేమని, మహిళలు ఆయన్ను కలుసుకోడానికి ఎప్పుడు వచ్చినా ఆయన ద్వారాలు

మహిళల కోసం తెరచి వుంటాయని శ్రీమతి రమాదేవి అనగానే ఓ విలేకరి ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది ఇటీవల ఒక మహిళను బయటకు గెంటేసిన వార్తను ప్రస్తావించడంతో సీట్లు ముఖ్యమంత్రి మహిళలకు కట్టబెడతాడా, మంత్రివర్గంలో ఒక్క మంత్రి పదవి మహిళలకు ఎందుకు కేటాయించారు. అన్న ప్రశ్నలకు ఆమె ఏంచెప్పాలో అర్థంకాక తబ్బిబ్బయిపోయింది.

నెల్లూరులోరంగామిత్ర మండలి ఏర్పాటు

నెల్లూరు సెప్టెంబరు 12: (నవార్త) : ఇటీవల వాల్మీకి గుండం విజయవాడ తూర్పు నియోజక వర్గపు శాసనసభ్యుడు స్వర్గీయ వంగవీటి మోహనరంగా అభిమానులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు కలిసి గురువారం సమావేశమై "రంగా మిత్ర మండలి"ని నెల్లూరులో ఏర్పాటు చేశారు.

తిరుమలలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

తిరుమల, సెప్టెంబరు 12 (నవవార్త) : తిరుమలలో విద్యుత్ సమస్య పరిష్కరించడం కోసం చంద్రగిరి నుండి 33 కె.వి. ఎలక్ట్రిక్ లైన్‌ను ఒకటిన్నర నెలల్లో నెలకొల్పుతామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి చెప్పారు. ఇందుకోసం రు. 1.50 లక్షలను ఖర్చు చేస్తారు.

ఉచిత భోజన పథకంకు సంబంధించిన పాత్రలు, ప్లేట్లు, శుభ్రపరచటానికి మరో వాషింగ్ మిషన్, కొనుగోలు చేయాలని ట్రస్టుబోర్డు సమావేశం నిర్ణయించింది.

గోగర్భం డామ్‌లో నీరు ఎండిపోయినందున, పైప్‌లైన్ నిర్మించి పాపవినాశనం డామ్ నుండి పదిరోజుల్లో నీరు సరఫరా చేయటానికి అధికార్లు నిర్ణయించారు. ప్రస్తుతం పాపవినాశనం డామ్ నుండి 5 లక్షల గ్యాలన్లు, పాత పాపనాశనం డామ్ నుండి రెండు లక్షల గ్యాలెన్లు బావులమంచి ఒక లక్ష గ్యాలెన్లు నీరు తిరుమలకు సరఫరా అవుతోంది. కొత్త పైప్ లైన్ నిర్మాణం వల్ల మరో లక్ష గాలన్ల నీరు సరఫరా స్థానిక బాలాజీనగర్‌కు సరఫరా కాగలదు.

మిత్రపక్షాలపై మదన్ మోహన్ విసుర్లు

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 12: : తెలుగుదేశం, మిత్రపక్షాలవారు ఇటీవల రాష్ట్రపతికి పంపిన మహాజరులో కేంద్రప్రభుత్వంపై చేసిన ఆరోపణలను రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ.మదన్ మోహన్ ఖండించారు.

నేడు ఇక్కడ ఆయన పత్రికల వారితో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టులకు నిధులు కేటాయించడం లేదని ఆరోపించటాన్ని ఆయన వ్యతిరేకించారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక చేపట్టిన ప్రాజెక్టులనీ రాష్ట్రప్రభుత్వం, తన స్వంత నిధులనే కేటాయించినట్లుగా పేర్కొందని ఆయన అన్నారు.

కాని ఇప్పుడేమో కేంద్రంపై లేని పోని ఆరోపణలు చెస్తున్నదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రజల్ని తప్పు త్రోవ పట్టించటానికి ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల గురించి కేంద్రంపై మిత్రపక్షాలు మోపిన అభాండాలను ఆయన ఖండించారు. శ్రీ వంగవీటి మోహన రంగారావు హత్యానంతరం విజయవాడను సందర్శించి అక్కడి ప్రజల, ధన ప్రాణ రక్షణలకు తగిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయాన్ని కేంద్రం అందించాలని కోరింది మొదట కాంగ్రెస్ ప్రార్టీ అని శ్రీ మదన్‌మోహన్ గుర్తు చేసారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదన్న తెలుగుదేశం వాదనలను ఆయన త్రోసిపుచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెసేతర రాష్ట్రాల్లో అస్థిరతను సృష్టించటానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొనటాన్ని ఆయన నిరసించారు.

కాంగ్రెస్‌లో అసమ్మతి వాదుల గురించి ప్రస్తావిస్తూ అసమ్మతి వాదులు పేర్కొంటున్నట్టుగా అధిష్టానవర్గం నుండి నేటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని శ్రీ మదన్ మోహన్ చెప్పారు.

స్వర్గీయ మహాదేవు రాధాకృష్ణరాజుకు నివాళి

విజయవాడ, సెప్టెంబరు 12 (నవవార్త)

భాను ఆర్ట్‌క్రియేషన్స్ 'రౌడీయిజం జిందాబాద్' షూటింగ్‌లో-నిర్మాత సి.హెచ్.వి. అప్పారావు, ఏ. కోదండరామిరెడ్డి, వాణివిశ్వనాథ్.

"రౌడీయిజం జిందాబాద్"

ఏస్ డైరెక్టర్ ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'స్వర్ణకమలం' వంటి ఉత్తమ చిత్రాన్ని సమర్పించిన కె.యస్. రామారావు సమర్పణలో భాను ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై తమ ద్వితీయ సంచలన చిత్రంగా సి.హెచ్.వి. అప్పారావు నిర్మిస్తున్న "రౌడీయిజం జిందాబాద్" చిత్రం సెప్టెంబరు 21 నుండి 31 వరకు తిరుపతిలో రెండవ షెడ్యూలు పూర్తి చేసుకుంది.

ఈ షెడ్యూలులో చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో చంద్రగిరి రోడ్లమీద, అక్కడే ఒక మార్కెట్ ఏరియాలో కొన్ని సన్నివేశాల్ని ఒట్లు గగుర్పొడిచే విధంగా చిత్రీకరించారు.

ఈ చిత్రీకరణతో పాటలు, సైట్స్ తప్ప దాదాపు టాకీ పార్టు పూర్తయిందని సెప్టెంబరులో జరిగే షెడ్యూలుతో చిత్ర నిర్మాణం పూర్తవుతుందని నిర్మాత సి.హెచ్.వి. అప్పారావు వివరించారు.

డా. రాజశేఖర్, వాణి విశ్వనాథ్ తొలిసారిగా జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో సత్యనారాయణ, అల్లురామలింగయ్య, ప్రసాద్ బాబు, బ్రహ్మానందం, వినోద్, మల్లికార్జునరావు, రాళ్లపల్లి, అరుణ్‌కుమార్, హేమలత, మధు, రమ డారెడ్డి, కిరణ్, చిట్టిబాబు, అన్నపూర్ణ, నిర్మల, శ్రీలక్ష్మి, ఎం. వి. లక్ష్మి, మాస్టర్ రాంగోపాల్, బేబీ కీర్తి ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. మోహన్‌రాజ్, జానీ అనే మళయాళం విలన్స్‌ను ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం చేస్తున్నారు.

ఈ చిత్రానికి పాటలు- వేటూరి, మాటలు- గణేష్‌పాత్రో, సంగీతం- చక్రవర్తి, కెమెరా- సుధాకరరెడ్డి, కళ- అరుణ్‌ఘోష్‌నాంకర్, కూర్పు- జి. జి. కృష్ణారావు, నృత్యాలు- శివశంకర్, తార, థ్రిల్స్- భాషా, స్టిల్స్- నారాయణరావు, ప్రొడక్షన్- సూర్యనారాయణ, శ్రీరాములు, కో-డైరెక్టర్- కె. అజయ్‌కుమార్, అసోసియేట్- పి.యస్. రాయ్, స్క్రీన్‌ప్లే- దర్శకత్వం- ఏ. కోదండరామిరెడ్డి.

కేరళలో విడుదలై విజయఢంకా మ్రోగిస్తున్న "కిరీటం" అనే మళయాళ చిత్రం ఆధారంగా ఈ చిత్రం రూపొందుతుందని, విడుదలై ఎనభై రోజులు పైనే అయినా యిప్పటికీ హౌస్‌ఫుల్ కలెక్షన్లతో నడుస్తుందని అటు మాస్, యిటు క్లాస్ తరగతులు కూడా ఈ చిత్రాన్ని చూస్తున్నారని- అటువంటి సక్సెస్‌ఫుల్ హీరో పాత్రను యిక్కడ డా. రాజశేఖర్ పోషిస్తున్నట్లు ఈ చిత్రం విడుదలైన తర్వాత అతని హీరో యిమేజ్ మరింత ఎదగగలదన్న ఆశాభావాన్ని ఈ చిత్ర సమర్పకులు, క్రియేటివ్ ప్రొడ్యూసర్ కె.యస్. రామారావు వ్యక్త పరిచారు.

-కె.ఉమామహేశ్వరరావు

'బ్రహ్మ-రుషి-విశ్వామిత్ర' ప్రారంభం!

"బ్రహ్మ-ఋషి-విశ్వామిత్ర" ప్రారంభం

రాష్ట్ర ముఖ్యమంత్రి యన్.టి. రామారావు తీస్తున్న బ్రహ్మర్షి విశ్వామిత్ర పౌరాణిక చిత్రమే అయినా, దానిని ఆయన వ్యాపారము కోసము తీస్తున్నారు. మేము తీస్తున్న బ్రహ్మ-రుషి-విశ్వామిత్ర సమాజ సేవకోసము తీస్తున్నామని అఖిలభారత హిందు రక్షా సమితి దక్షిణభారత విభాగ ప్రధాన కార్యదర్శి సర్దార్ జగత్‌సింగ్ సెప్టెంబరు 5వ బ్రహ్మ-రుషి-విశ్వామిత్ర చిత్ర ప్రారంభోత్సవములో చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ సంయుక్త హిందూ మంచ్ కన్వీనర్‌గా, హిందూ మహాసభ ఆంధ్రప్రదేశ్ విభాగానికి జనరల్ సెక్రటరీగా కూడ వ్యవహరిస్తున్న సర్దార్ జగత్‌సింగ్ ఎన్.యస్. రాజారెడ్డి దర్శకత్వములో జగత్ జననీ పిక్చర్స్ పతాకముపై బ్రహ్మ-రుషి- విశ్వామిత్ర చిత్రాన్ని తెలుగు హింది భాషలలో ఏకకాలములో నిర్మిస్తున్నారు. హైద్రాబాదు పాత బస్తీలోని ఇమ్లీబన్ పార్క్‌లో ప్రారంభమైన ఈ చిత్రానికి క్లాప్ ప్రముఖ నిర్మాత కె. రాఘవ ఇచ్చారు. జగత్‌గురు రామానుజాచార్య స్విచాన్ చేశారు. పూజా కార్యక్రమాలను గోవర్ధన్ మహారాజ్ కేవలియా నిర్వహించారు. తొలిషాట్‌ను కణ్వముని బాల శకుంతలపై చిత్రీకరించారు. ఈ సన్నివేశములో ఆంజనేయశర్మ, బేబీ స్వరూప, నాగవల్లి పాల్గొన్నారు.

ఈ సందర్భములో ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశములో నిర్మాత జగత్‌సింగ్ మాట్లాడుతూ ఎన్టీఆర్‌కి దేశమంటే ప్రేమ కనుక ఉంటే రాష్ట్ర భాష హిందీని 4వ తరగతి నుండి 8వ తరగతికి మార్చివుండేవారు కాదు. కాషాయ వస్త్రాలను ధరించి వాటి విలువను యన్.టి.ఆర్. కించపరుస్తున్నారు. మేము సంసార జీవితము గడుపుచూనే మా శక్తికి మించి నిజాయితీగా కృషిచేస్తున్నాము. దేశ స్వాతంత్ర సమయములో మతము పేరిట దేశం ముక్కలయింది. భారతదేశము హిందూ భూమిగా ఉండిపోయింది.అయిన రాజకీయ స్వార్థపరులు ఓట్లకోసం ఇతర మతస్థులను హిందూధర్మానికి వ్యతిరేకముగా నెత్తి కెక్కించు కుంటున్నారు. ఇతర మతాల వారిని హిందువులుగా మార్చడము కన్నా హిందువులను హిందువునిగా నిలుపుకోవడమే కష్టతరమైన నేటి పరిస్థితులలో హిందూ ధర్మాన్ని ప్రచారము చేసే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని తీస్తున్నామని చెప్పారు.

కాంతారావు విశిష్టునిగా, రాజేష్ దుష్యంతునిగా నూతన్ ప్రసాద్, రుక్మిణిగా, నిర్మల, జానకీ మొదలైన వారు నటించే ఈ చిత్రములో ముఖ్య పాత్రలైన విశ్వామిత్ర మేనక పాత్రధారుల పేర్లు ఒక వారంలో పద్మాలయా స్టూడియోలో ఈ చిత్రము రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైనప్పుడు వెల్లడిస్తామని దర్శకుడు రాజారెడ్డి చెప్పారు. ఒకే షెడ్యూల్‌లో అక్టోబర్ నెలాఖరుకి పూర్తిచేసి ఈ చిత్రాన్ని దసరాకు విడుదల చేయాలనుకుంటున్నామని చెప్పారు.

ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: సుఖదేవ్, సంగీతం: రాజ్‌కోటి, ఎడిటింగ్: మోహన్, ప్రొడక్షన్: విజయ్‌కుమార్, అశోక్‌రాజు, అసోసియేట్స్: మోహన్‌దాస్, దేవేందర్ రెడ్డి, రాధాకృష్ణ, కథ, మాటలు, పాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వము: ఎన్.యస్. రాజారెడ్డి.

-డి.కె.ఎం.

'నూతిలో తాబేలు', ఇస్మాయిల్ కవిత

"A poem must be a well made verbal object that does honour to the language in which it is written"

-W.H.Auden.

"నేను కవిత్వంలో ఒకేముఖ్యమైన పనిచెయ్యడానికి పూనుకున్నాను. భాషని శుభ్రపరచటానికి యత్నించాను"

-ఇస్మాయిల్

కవిగా ఇస్మాయిల్ 'సదాబాలకుడు'. బడికిపోయి, చదువులుచదివి పెరిగి పెద్దయి, పాండిత్యం అర్జించి, శుష్కించిపోయి, పాండురోగంతో పాలిపోయిన మాటలను దరిచేరనివ్వని వసివాడు ఇస్మాయిల్. తేలికైన మాటలతో, మనస్సునిండా వల్లపాగమంచును కురిపించి హృదయాలను భారరహితస్థితికి తీసికెళ్లగల స్థిరచిత్తుడు ఆయన. అనునిత్యం మనం అప్రయత్నంగా 'అనాలోచితంగా' వాడే మామూలు మాటలతో గుండెలోతుల్లో తడిమంటపెట్టడం ఆయనకు తెలిసినట్టుగా మరెవరికీ తెలియదు. తత్వం, తర్కం, వ్యాకరణం, అలంకారం, ఇత్యాది బుద్ధిగతమైన జాడ్యాలుసోకని 'తేట'గీతి ఇస్మాయిల్ కవిత. తప్పినకొలదీ ఊరేఊట ఆయన కవితామయోనిది. అందుకే ఆయనను "ఇస్మాయిల్! కవితామయోనిధీ!" అని పిలవాలనిపిస్తుంది. నిరలంకార సౌందర్యం ఆయన సొత్తు. నిత్యయవ్వనుడు కనుకే ఆయనకు అది సాధ్యమైంది.

భాషను పరిపుష్టం చేసేవేరిటవండితులు సృష్టించిన బరువైన మాటల బండతనం, నిష్ప్రయోజకత్వం 'ఎంకి' తరువాత బహుశా ఒక్క ఇస్మాయిల్‌కే తెలుసు. సంక్షిప్తత, క్లుప్తత, brevity, precision ఎంకి, కృష్ణశాస్త్రితర్వాత మనం ఒక్క ఇస్మాయిల్ లోనే చూస్తాం. ప్రకృతిని దృశ్యమానం చేయడంలో, పటంకట్టడంలో, చిత్రికపట్టడంలో, ప్రకృతి సందర్శనం మనలో కలిగించే ఆనందానుభూతికి అక్షరరూపం ఇవ్వడంలో ఆయన అనన్యుడు.

వెన్నెలరాత్రి నిశ్శబ్దంగావుండే తటాకాన్నిచూసి ఆ దృశ్యాన్ని "ఎన్నెలంతా మేసి ఏరు నెమరేసింది" అని నండూరి సుబ్బారావుగారు అక్షరబద్ధం చేసినప్పుడు మనం ఎంతగా అచ్చెరువొందామో ఇస్మాయిల్ కవిత్వాన్ని చదివికూడా అంతే అచ్చెరువొందుతాం! (ఉదా: "గోదావరి దాటాం") వస్తు ప్రపంచాన్ని వున్నదున్నట్లు చెప్పడమే కవిపని (Poet's task is "to see things as they really are") అనిగాని మనం అనుకుంటే, ఆయనని ఇస్మాయిల్‌గారు నిర్వహించినంత గొప్పగా, సమర్థంగా వేరెవ్వరూ చెయ్యలేదన్నది నిర్వివాదాంశం. దృశ్యానికి చూపరికిమధ్య అనేదేలేకుండా చెయ్యగలగొప్ప నేర్పరి ఆయన. అనుభవం (experience) ఎలాగైతే క్షణమో , ఆ అనుభవాన్ని మనకు అనుభూతంచేసే ఆయన

కవిత్వంకూడా అంతేక్షణం.

చలంగారి 'పురూరవ' చదువుతుంటే ఊర్వశి మాటలు వింటుంటే- ఏమిటిది? ఈయనకిది ఎలా సాధ్యమైంది? ఇంత తేలికైన మాటలతో (weightless words) ఇంతటిగొప్ప అర్థాలను, సన్నివేశాలను ఈయన ఎలా సృష్టించగలిగాడు! అని మనకు ఆశ్చర్యమేస్తుంది. ("అల్పాక్షరముల అనల్పార్థంబు" అంటే బహుశా ఇదేనేమో).

ఇస్మాయిల్‌గారి కవిత్వం చదువుతున్నప్పుడుకూడా-అందరి సంగతి ఏమోగాని నాకుమాత్రం చలంగారిని చదివినప్పుడుకూడా ఆశ్చర్యమేకలుగుతుంది. నండూరి సుబ్బారావుగారు, చలంగారు, కృష్ణశాస్త్రిగారు కూడా సాధించలేని ఔన్నత్యాన్ని కవిత్వంలో ఆయన సాధించారని తేటతెల్లమౌతుంది. పశ్చిమాన రిల్కే, తాజ్, విలియమ్స్‌లు ఇస్మాయిల్‌కు సమీపబంధువులు.

ప్రాచీన చైనా, జపాన్ కవులు తమ కవిత్వంలో ప్రదర్శించిన అపురూపమైన చాతుర్యాన్నే మనం ఇస్మాయిల్‌గారి కవిత్వంలోకూడా దర్శిస్తాం.

"We should always be prepared to judge a poet, by you force and originality of his metaphors" అన్నాడు హెర్బర్ట్ రీడ్.

"verses are not, as people imagine, simply feelings, they are experiences"అన్నాడు రిల్కే.

స్వానుభవంలోనుంచి సిద్ధించే నజీవమైన పరిభాషలో దృశ్యాన్నిప్రతీకాత్మకంచేయటం ఎలాగో ఇస్మాయిల్‌కు తెలుసుననుకుంటే మరి ఆ ప్రతీకలకు ప్రాణంపోసే "వాంఛాకుసుమం" ఏమిటనే ప్రశ్న ఇక్కడ వస్తుంది. జీవితంమీద, మనిషిమీద ప్రేమే ఆ వాంఛాకుసుమం. ఇస్మాయిల్ కవితల్లోని ప్రతీకలు సౌందర్య సాధనాలుకావు. అవి కవిత అంతర్భాగంగా ఇమిడిపోతాయేతప్ప వేటికవి విడివిడిగా వుండవు. దానికి కారణం ఆయన "కవిత్వం రాయాలి" అంటూ నినాదిస్తూ వేదికలెక్కి ఉపన్యసిస్తూ కవిగా చెలామణీకావాలనే తాపత్రయంతో కవివేషంతో, పోజుతో సంచరించే బూటకపుకవి కాకపోవడమే నని ఇక్కడ మనం చెప్పుకోవాలి.

కవిత్వం భాషకాదు. పరిభాష అని అర్థంచేసుకోలేని మూఢత్వం ఒక ప్రక్క రాజ్య మేలుతుంటే కవిత్వానికి కూడా పరిభాష ఉంటుంది. ప్రయత్నంలేకుండా, ప్రత్యేకమైన సంస్కారంలేకుండా అది అర్థంకాదని చెప్పి ఇస్మాయిల్‌గారిని ప్రజాస్వామ్యవాదులు పాపం క్షమించలేకపోతున్నారు.

ప్రజాస్వామ్యానికి పనికిరాని నిర్దిష్ట సాంఘిక ప్రయోజనంలేని కవిత్వం రాయడం మహాపాపమని మిల్, బెంథాం వారసులైన కుకవులు రంకెలేస్తున్న ప్రస్తుత తరుణంలో 'ఆయా ప్రయోజనంవాదం' (neo utilitarianism) శుద్ధఅబద్ధం అని బల్లగుద్ది నిర్భయంగా చెపుతున్నందుకు మనం ఆయనను అభినందించాలి.

ఇళ్ళల్లో, బళ్ళల్లో, వున్నకాల్లో జ్ఞానం పేరిట నేర్చుకున్న నానాచెత్తనూ 'వదిలించుకుని' (The process of un-learning) కొత్త కళ్ళతో, కొత్త చర్మంతో లోకంలో పుట్టడానికి తోడ్పడినందుకు ఇస్మాయిల్‌గారికి మనమంతా రుణపడి ఉంటాం.

-ఎ. సురేంద్రరాజు

"చెట్టు ఇస్మాయిల్"గా సుప్రసిద్ధుడైన ఇస్మాయిల్‌గారి షష్టిపూర్తి అభినందన సభ 12-9-89 (మంగళవారం)నాడు హైదరాబాదులో కవిమిత్రులమధ్య జరుగుతున్న సందర్భంగా ఈప్రత్యేక వ్యాసం.

-ఎడిటర్

భవిష్యత్ దార్శనికుడు విశ్వనాథ

(ఆంధ్రపత్రికప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 12: "తనకాలంలో దేశంలో ప్రచారమైన సిద్ధాంతాలను చూసి వాటి దుష్పరిణామాలను వూహించి ప్రతిక్రియాత్మక రచనలు చేసిన క్రాంతదర్శి విశ్వనాథ" అని హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ రీడర్ డాక్టర్ ముదిగొండ వీరభద్రయ్య అన్నారు.

అశోక్‌నగర్ సిటీ సెంట్రల్ లైబ్రరీలో అదివారంనాడు "రసతరంగిణి" ఆధ్వర్యంలో జరిగిన విశ్వనాథ జయంత్యుత్సవంలో ఆయన "వేనరాజు" పాటకంపై ప్రసంగించారు. స్వేచ్ఛాముక సిద్ధాంతం కుటుంబవ్యవస్థను కూకటివేళ్లతో వెళ్లగించివేస్తుందని, కుటుంబం విచ్ఛిన్నమైతే సమాజం నాశనమవుతుందని విశ్వనాథ ఉద్బోధించారని ఆయన అన్నారు. ఇప్పుడు అమెరికా, నార్వే, డెన్మార్క్‌లలో పెళ్లికాని తల్లుల సంఖ్య అధికమవుతోందని యీ పరిణామం గమనించి రష్యాలో జన్మించి అమెరికా పౌరుడైన ఒక ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త 1959లోనే హెచ్చరించాడని ఆయన చెప్పారు.

ఈ పరిణామం ఏర్పడకుండా వుండాలంటే భా[illegible] కుటుంబ వ్యవస్థను అనుసరించాలని శాస్త్రవేత్త సూచించాడని డాక్టర్ వీరభద్రయ్య తెలిపారు. తనకాలంలో యీ కుటుంబవ్యవస్థను నాశనం చేసే సిద్ధాంతాలు ప్రచారం కావటం చూసిన విశ్వనాథ అలాటి సిద్ధాంతాన్నే ప్రవచించిన వేనరాజు కథను నాటకంగా మలచి, దానిని ఖండించాడని ఆయన అన్నారు. సమకాలీన సమాజ ధోరణులకు ప్రతిస్పందించి రచన చేసినందునే విశ్వనాథ సజీవునిగా నిలిచాడని ఆయన చెప్పారు.

కళారాధకుడైన వాడు, ముఖ్యంగా సంగీత పిపాసువైన వాడెవడూ నాస్తికునిగా మిగలలేడని వాడు ఆస్తికునిగా మారిపోతాడని ఆయన వ్యాఖ్యానించారు. సంగీతం, కవిత్వం మనిషి మనస్సుకు దివ్యసీమల స్పర్శను కలిగిస్తాయని , వేనరాజు గొప్పవైణికుడు కావటం వల్ల చివరకు నాస్తికత్వం నశించిపోయిందని, అనిజాన్ని అంగీకరించలేక మరణించడాని డాక్టర్ వీరభద్రయ్య అన్నారు. తొలుత నాస్తికుడైన ప్రముఖ రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు కూడా సంగీత పిపాసువై చివరిరోజులలో బుద్ధికొలతవాదాన్ని ప్రతిపాదించి తన వర్గం నుండి నిరసనను ఎదుర్కోవలసి వచ్చిందని ఆయన చెప్పారు.

మనిషి స్వేచ్ఛను సమాజంనియంత్రిస్తూ వుంటుందని, సమాజ నియమానికి, మానవధర్మానికి అతడు కట్టుబడి వుండాలని ఆయన అన్నారు. రామాయణ కల్పవృక్షంలో రాముడి నోట"వాదిమనుజ ధర్మము" ని విశ్వనాథ చెప్పించారని ఆయన వివరించారు. ఋషుల ప్రబోధాన్ని, సిద్ధాంతాలను వినకుండా పరిశీలించ కుండా విమర్శించటాన్ని విశ్వనాథ ఖండించారని, ప్రచారంలో వున్నదట్టాన్ని విమర్శించటానికి వీలులేని సమాంజలో ఋషి భావనను యధేచ్ఛగా విమర్శించటం చూసిన విశ్వనాథ ఆగ్రహం చెందారని డాక్టర్ వీరభద్రయ్య అన్నారు."ధర్మాన్ని ఆచరించినందువల్ల మెప్పరాదు, కానీ దానిని ఆచరించక పోవటంవల్ల ప్రత్యవాయం కలుగుతుంది. ఆ మౌలిక ధర్మాన్ని ఆచరించమని ఉద్బోధించటం విశ్వనాథ రచనల లక్ష్యము"ని ఆయన వివరించారు.

తరువాత విశ్వనాథవారి "బద్దన్న సేనాని" నవలపై ప్రసంగించిన ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ లెక్చరర్ డాక్టర్ కసిరెడ్డి వెంకటరెడ్డి పరిస్థితుల ప్రాబల్యంవల్ల పాలకుడు నిస్సహాయుడైనపుడు ప్రజలే నడుం బిగించిన కథ బద్దన్నసేనాని జీవితమని అన్నారు. పరాయి పాలకుల దౌష్ట్యప్రభంజనాన్ని ఎదుర్కోవటానికి బద్దన్న ఏ విధంగా గ్రామగ్రామాన ప్రజలను సమీకరించాడో యీ నవలలో విశ్వనాథ వివరించి సందేశమిచ్చారని ఆయన చెప్పారు.

"మాతృభూమి రక్షణకే నేను యీ ప్రజాసైన్యాన్ని తయారు చేసాను కానీ స్వదేశీయుడైన మరో రాజును మట్టి కరిపించటానికి కాదు" ని బద్దన్న చెప్పినమాటలు జాతికి చిరస్మరణీయాలని డాక్టర్ వెంకటరెడ్డి అన్నారు. బాదమ్ము అనే వివాహిత బద్దన్నకు స్ఫూర్తిగా నిలిచిందని, అయితే శ్రేష్ఠుడి జీవితాన్ని పది మంది అనుకరిస్తారు కనుక బద్దన్న, బాదమ్ముల మధ్యసంబంధం మచ్చగానే మిగులుతుందని, అదికూడా వుండరాదని విశ్వనాథ యీనవలలో చెప్పివారిద్దరిచే ప్రాణత్యాగం చేయించారని ఆయన వివరించారు. శత్రువు దగ్గర మహాస్త్రంవుంటే దానికి విరుగుడుగా మరోమహాస్త్రాన్ని తయారు చేసికోవాలని విశ్వనాథ బద్దన్నసేనాని తో సూచించారని డాక్టర్ వెంకటరెడ్డి అన్నారు.

ఆ తరువాత శ్రీ కల్లూరి భాస్కరం ప్రసంగిస్తూ విశ్వనాథ తన రచనలన్నిటా వ్యాపార సంస్కృతిని నిరసించాడని, ఆయన రచనలను యీ దృక్కోణంనుంచి కూడా పరిశీలించాలని సూచించారు.

సభకు అధ్యక్షత వహించిన రసతరంగిణి ఉపాధ్యక్షుడు శ్రీ పి. ఎ. వి. వల్లభాచార్య యీ జాతి ఉత్థాన పతనాలకు ప్రాదయదక్షంగా ప్రతిస్పందించిన మహాకవికి నివాళులు అర్పించటం మనకర్తవ్యమని అన్నారు. ఆంధ్రుల అస్వతంత్రతా భావాన్ని చూసి జాతిని ఉద్బోధించారని అన్నారు. వేనరాజు నాటకం ఆత్మసంస్కారాన్ని, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని అందిస్తే బద్దన్న సేనాని నవల కార్యక్షేత్రంలో మనిషి ప్రవర్తించ వలసిన మార్గాన్ని ప్రబోధించిందని ఆయన అన్నారు. ఈ దేశంలోని ప్రతి అణువు, గాలి, నీరు అన్నీ విశ్వనాథకు అమృతతుల్యాలని, యింతగా జాతితోమమేకమై రచనలు సాగించిన మరోకవి ఆంధ్రసాహిత్యంలో లేడని శ్రీ వల్లభాచార్య అన్నారు.

ప్రాచ్యరసపాక్కులోని పరిణతార్థములు తెలియని అకృత పరిశ్రములు, శ్రమగతాలనబుద్ధులు కావ్యాలను దూషిస్తూ వుంటూరని విశ్వనాథ ఆవేదన చెందారని ఆయన వివరించారు. సభకు శ్రీ టి. కె. విజయకుమార్ స్వాగతం పలకగా, కార్యదర్శి శ్రీ పై. వి. వివేకానందం వందన సమర్పణ చేశారు.

ఆల్ ఇండియాసాయి సమాజ్
మైలాపూర్-మద్రాసు-600004.
ఫోన్: 74784, GRAMS: SAI SANGH

71వ మహాసమాధి ఉత్సవములు-1989

29-9-1989 నుండి 15-10-1989.

29-09-89	శుక్రవారం సా. 7గం	అంకురార్పణ కలశస్థాపన.
11-10-89	బుధవారం ఉ. 9 గం.	మహాసమాధి దినము, ఆరాధన, ప్రత్యేక పూజ, బీదలకు అన్నదానము.
13-10-89	శుక్రవారం	సద్గురు సాయిబాబా, శ్రీశ్రీ నరసింహస్వామీజీవార్ల చిత్రపటములతో గొప్పఊరేగింపు.
14-10-89	శనివారం మ.12 గం.కు	స్వామిజీ ఆరాధన,
	సా. 6 గం.కు	బహిరంగ సభ.
15-10-89	ఆదివారం ఉ. 9గం.కు	మహిళా దినోత్సవం దీపారాధన పూజ,
	రాత్రి 8 గం.కు	ఆంజనేయ ఉత్సవం.

ప్రత్యేక సహస్రనామ అర్చన

ప్రతిరోజుఉదయం, సాయంత్రం ప్రత్యేక సహస్రనామ అర్చన కలదు. ప్రతి అర్చనకు రుసుము రు.25 లు. పళ్ళటి పెండలాకెట్, ప్రసాదము యివ్వబడును. ప్రతిదినము సాయంత్రం సాంస్కృతిక భక్తి కార్యక్రమాలు నిర్వాటు చేయబడినవి.

ప్రత్యేకపూజ అభిషేకంతో రు. 150
అద్వైతరపూజ రు.0.75
సహస్రనామ అర్చన (పోస్టు ద్వారా) రు. 2.25
దీపారాధన పూజ: రు. 25.
ఉత్సవాలలో భక్తులెల్లరూ పాల్గొని, బాబా ఆశీస్సులు పొందగలరు.
విరాళాలు కృతజ్ఞతతోస్వీకరించబడును.

గమనిక: మహాసమాధి రోజు, శ్రీశ్రీ నరసింహస్వామిజీ ఆరాధనదినములలో జాలైన 11-10-89, 14-10-89లు మినహాయించి మిగతా దినములలో ఒక ఉత్సవ ఉభయం జరువదలచిన భక్తులు రు. 1500లు చెల్లించవలెను. ఇందు, రెండుపూటల ప్రత్యేక సహస్రనామ అర్చన, ప్రత్యేక అభిషేకం, ప్రసాదం; బీదల అన్నదానం, సంగీత కచ్చేరీలు వారి పేర్ల బాబా ఆశీస్సులతో జరువబడును.

ఎం. వాసుదేవన్,
గౌరవ కార్యదర్శి.

మతసామరస్యానికిపుష్పాంజలి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: బాబ్రి-రామజన్మభూమి వివాదంలో ఒకప్రక్క మతమౌఢ్యులు విభేదాలను సృష్టించుకుంటూవుంటే, మతాలకు, కులాలకు, జాతులకు అతీతమైంది, సోదరభావమ జాతీయత అని నిరూపిస్తూ పూల్ వాలోంకి సెయిర్ (పుష్పయాత్ర)ను నిర్వహిస్తున్నారు ఢిల్లీ ప్రజలు.

మొగలు చక్రవర్తుల హయాంలో ప్రారంభమైన ఈయాత్రా కార్యక్రమం నేటివరకు కొనసాగుతుండటం ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. *1942*లో "క్విట్ ఇండియా" ఉద్యమవత్తిడితో ఈకార్యక్రమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించినా *1961*లో జవహర్‌లాల్ నెహ్రూ దీనిని తిరిగి ప్రారంభించారు.

దక్షిణఢిల్లీ, మెహ్రౌలీలోని క్వాజా భక్తియార్ కాకిదర్గాలో పువ్వులతో తయారుచేసిన "ఛద్దర్"ను సమర్పించడం ఈయాత్ర ఆచారం. అలాగే దర్గాకు సమీపంలోవున్న "యోగ్ మాయాజీ" దేవాలయంలోకూడా పూలతో పూజలను నిర్వహిస్తారు. ఈరెండు పూజా కార్యక్రమాలలో, మత భేదాలను తెంచుకుని అన్నివర్గాల ప్రజలు పాల్గొంటారు. *1806-37*లో ఢిల్లీని పాలించిన అక్బర్ షాII కాలంలో ఈపుష్పయాత్ర ప్రారంభమైనట్టు చెబుతారు. ఆయన తనకుమారుడు మిర్జా జహాంగీర్ వారసత్వ వివాదంలో చిక్కుకొని అలహాబాద్‌లో కారాగార శిక్ష ననుభవించాల్సి వస్తుంది. ఆ సందర్భంలో జహాంగీర్ తల్లి, మిర్జాకనుక విడుదలైతే మెహ్రౌలీలోని క్వాజా భక్తియార్ కాకిదర్గాలో పూల "ఛద్దర్"ను సమర్పిస్తానని మొక్కుకుందట. వెంటనే మీర్జా విడుదలకావటంతో ముంతాజ్ తనమొక్కుబటిని ఎంతో ఆడంబరంగా పువ్వయాత్రను జరిపి తీర్చుకుంది. పువ్వుల వింజామరలతో "ఛద్దర్"ను అల్లి, హిందువులు, ముస్లింలు ఎంతో సంబరంగా ఈఉత్సవంలో పాల్గొన్నారు. ఈఉత్సవాలతో ఆకర్షితుడైన అక్బర్ షా, హిందూ- ముస్లింల ఐక్యతకు నిదర్శనంగా దీనిని ప్రతిఏటా జరపాలని నిర్ణయించారు. అప్పటినుండి వర్షఋతువు ముగిసిన అనంతరం ఢిల్లీ ప్రజలు దీనిని నిర్వహించడం జరిగింది. రాజు, మహారాణి, రాకుమారులు ఇతర రాజవంశీకులు మెహ్రౌలీలో జరిగే కార్యక్రమానికి ఊరేగింపుగా వెళ్లేవారు. ఈపుష్పయాత్రలో భాగంగానే మెహ్రౌలీలోని రాజకుటుంబీకుల సమాధులను, ప్రదర్శనాశాలను, చారిత్రాత్మిక కట్టడాలనుకూడా వీరి బృందం సందర్శించేది. పట్టపురాణులే వీరి బృందానికి లోజనాలను వండి వెళ్లేవారు.

రాజప్రాసాదం 'జర్నా'నుంచి ప్రారంభమయ్యే ఊరేగింపులో వాద్యబృందం, సైనికులు బట్టి, క్రీడాకారులూ, ఇతర వృత్తిపనివారు-చిత్ర, విచిత్ర వేషధారణతో పాల్గొనేవారు. మొదటిరోజు ఊరేగింపు మెహ్రౌలీ బజారు వీధులగుండా సాగి యోగ్‌మాయాజీ దేవాలయంలో పూలవింజామరలను సమర్పిస్తుంది. తరువాతిరోజు క్వాజా దర్గాకు పూల వింజామరలను అర్పిస్తారు.

బ్రిటిష్ ఆధిపత్యంలోకూడా కొంతమంది పురప్రముఖులు ఈయాత్రను నిర్వహించారు.

చివరి మొగల్ చక్రవర్తి ఈఉత్సవాలు చాలా వైభవంగా జరిగేవి. ఉత్సవాల సందడి కొద్దినెలలముందే ప్రారంభమయ్యేది. *1857*లో ఈఉత్సవాలలో చక్రవర్తులు పాల్గొనే సాంప్రదాయం అంతరించింది.

ప్రస్తుతం జరుగలోయే పుష్పయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఖవ్వాలీలుకూడా ఉంటాయి. మల్లయుద్ధపోటీలు, కోడిపందాలు, గాలిపటాల, ఈతల పోటీలుకూడా చోటు చేసుకుంటాయి.

ప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీ ఇంటినుంచి "షెహనాయ్" స్వరంతో ప్రారంభమయ్యే యాత్ర ఢిల్లీనగర వీధులంతా కొనసాగుతుంది. *25* రాష్ట్రాలు పాల్గొంటున్న ఈకార్యక్రమాలు వచ్చేనెల *15*న ముగుస్తాయని నిర్వాహక కార్యదర్శి శ్రీ యోగేశ్వర దయాళ్ చెప్పారు. రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకట్రామన్ ముగింపు కార్యక్రమాలలో ముఖ్యఅతిథిగా వ్యవహరిస్తారనికూడా ఆయన తెలిపారు.

ఆదాయం పన్ను చెల్లించడానికి మీ తారీఖు

అడ్వాన్సు పన్ను

రు.1500/-లు లేక అంతకు మించి మీ "ప్రస్తుత ఆదాయం"పై పన్ను చెల్లించవలసి ఉంటే, ఈ దిగువనిచ్చిన విధంగా మీ అడ్వాన్సు పన్ను(1989-90)ఆర్థిక సంవత్సర సమయంలో (చెల్లించడాన్ని గుర్తుంచుకోండి).

ఇన్‌స్టాల్‌మెంటు చెల్లించవలసిన తేదీ (ఆ రోజు లేక అంతకు ముందుగా)	చెల్లించవలసిన మొత్తం
సెప్టెంబరు 15	అట్టి అడ్వాన్సు పన్నులో 20 శాతం తక్కువ కాకుండా
డిసంబరు 15	ముందు ఇన్‌స్టాల్‌మెంటులో ఏదైనా మొత్తాన్ని చెల్లించి ఉంటే, ఆ మొత్తాన్ని తగ్గించి మిగిలిన అడ్వాన్సు పన్నులో 50 శాతం తక్కువ కాకుండా.
మార్చి 15	గత ఇన్‌స్టాల్‌మెంటు లేక ఇన్‌స్టాల్‌మెంట్లలో ఏదైనా మొత్తాన్ని చెల్లించి ఉంటే ఆ మొత్తాన్ని అట్టి అడ్వాన్సు పన్ను నుండి తగ్గించి మిగిలిన పూర్తి మొత్తం.

మరచిపోకండి: 50,000/- రూ.లు మించి మీ ఆదాయం ఉన్నప్పుడు మీరు చెల్లించవలసి ఉన్న ఆదాయం పన్నులో 8 శాతం చొప్పున సర్చార్జీని దానితో కలపటం.

ఆఖరి తేదీ వరకు వేచి ఉండడం ఎందుకు

సరిగ్గా, సకాలంలో మీ అడ్వాన్సు పన్నును చెల్లించండి

ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మె

సైకిక్ సీరియల్

పారిజాతం

79

రచన నిర్మాణ సంశ్లేషముద్ర

తొలి తెలుగులు ప్రసరిస్తున్న వెన్నెల జలపాతం

చల్లాసుబ్రహ్మణ్యం

ఈసారి షావతను నంబరడగకుండా ఫోను ఆమె ముందుకి జరిపి ఆమె కూర్చునేందుకు స్టూలు తెచ్చి వేశాడు. డబ్బులుకూడా అడగలేదు. ఆమె డి.ఐ.జి. వరకురాం ఇంటికి ఫోన్ చేసింది.

" సార్ లేరమ్మా! టూర్లో వెళ్ళారు. అమ్మగారు పుట్టింటికెళ్ళారు..." అనే సమాధానం వచ్చింది.

నీరవంగా ఫోన్ పెట్టేసి- షావతను వద్దంటున్నా వినకుండా మరో రెండ్రూపాయలిచ్చి- దగ్గర్లో ఆగి ఉన్న ఆటో ఎక్కింది. తిన్నగా కంట్రోల్ రూం కెళ్ళింది

అసిస్టెంట్ కమీషనర్ దగ్గర అపాయింట్ మెంట్ అడది గనుక తేలిగ్గానే దొరికింది.

" ప్లీజ్ బి సీటెడ్! వాట్ కెన్ ఐ డు ఫర్యూ!" అన్నాడు వైష్ణవిని ఎగాదిగా చూస్తూ.

" అయాం వైష్ణవి! మోడల్ పోస్టల్ బిడ్డర్ని... దాన్ని కొంతమంది దుండగులు బ్లాస్ట్ చేసే ప్రయత్నంలో ఉన్నారు. అందుకే మీ హెల్ప్ తీసుకోవడానికొచ్చాను..."చెప్పింది వైష్ణవి.

అంతలో ఫోన్ మోగింది.

" ఎక్స్క్యూజ్మీ...." అంటూ ఫోనెత్తాడు.

" ..... "

" ఓ శివాజీరావ్జీ! హౌఆర్యూ!" ఉలిక్కిపడింది వైష్ణవి.

" ..... "

" వ్యాట్? ఏచ్చా?"

" ..... "

" అవును....కరెక్ట్గా అలాగే చెప్తోంది....."

" ..... "

"ఆహా.... ఐసీ.....ఐసీ..... ఓకే ..డోంట్ వర్రీ! నేను మేనేజ్ చేస్తాను.... " అంటూ ఫోన్ పెట్టేసిన ఎ.సి.పి. సుందరం ఎదురుగా వైష్ణవి లేక పోవడంతో బిత్తరపోయాడు.

• • • •

కంట్రోల్ రూంలోంచి బయటపడిన వైష్ణవి మళ్ళీ ఆటో ఎక్కింది. ఇక ఆమె దగ్గర వందు రూపాయలే ఉన్నాయ్! వాతాత్తుగా తన మెడలో ఉన్న నన్నటి బంగారు గొలుసు గుర్తుకొచ్చింది. అయితే ఎక్కడ అమ్మాలో తెలీక- ఆటో డ్రైవర్ని అడిగింది.

ఆటో డ్రైవర్కి ఆమె పరిస్థితి అర్థమైపోయింది. తనకి బాగా తెలిసిన మార్వాడీ దగ్గరకి తీసుకెళ్ళాడు. ఆమెని ఆటోలోనే ఉంచి వెళ్ళి మార్వాడీతో మాట్లాడాడు.

చవగ్గా తాను గొలుసు ఇప్పిస్తానసీ- దానికి కమీషన్గా ఓ వందోందలు కావాలనీ అడిగాడు.

మార్వాడీ వెంటనే ఒప్పుకున్నాడు. ఆటో డ్రైవర్ తిరిగివచ్చి "రండమ్మా! కొంటాడట!...." అని చెప్పాడు.

" ఫర్వాలేదు. నువ్వెళ్ళి తీసుకురా! " అంటూ మెడలోని గొలుసు తీసింది.

" అడపిల్లవి కదా! మెడ బోసిగా వుంటే బావుండదమ్మా!" అని తండ్రి అన్నప్పుడు -

" అబ్బా డాడీ! అప్పుడమ్మలా అలంకరించుకుంటే నాకు సిగ్గేస్తుంది డాడీ! ప్లీజ్... ఈ గాజులు- దుద్దులు వద్దు. గొలుసుకూడా చాలా పెద్దగా ఉంది. వేరే ఏదయినా చిన్న గొలుసుంటే చూడండి. మీకోసం వేసుకుంటాను." అంది తాను గారాంగా.

"చిన్న గొలుసులేమీ లేవమ్మా ఇంట్లో! ఈరోజే జమునాలాల్కి ఫోన్చేసి నువ్వు కోరినట్లుగానే నన్నటి గొలుసు తెప్పిస్తాను.. "

ఇంటర్మీడియట్లో తండ్రి కొనిచ్చిన ఆ గొలుసు ఇప్పటి వరకూ ఎప్పుడూ మెడలోంచి తీయలేదు.

ఈ పరిస్థితుల్లో దాన్ని తియ్యాల్సిరావడం సెంటిమెంటల్గా ఆమెని కుదిపేసింది.

గొలుసు తీసుకుంటున్నప్పుడు తన చేతిమీద కన్నీటి చక్కలు పడడంతో క్షణం ఆటో డ్రైవర్ మనసు ద్రవించింది.

మళ్ళీ అంతలోనే- తన ఇంట్లో ఉన్న ఇరవై రోజుల ఎసికందు గుర్తొచ్చింది. రేపే ఉయ్యాల్లో వేస్తున్నారు. కనీసం ఆ బుజ్జిముండకి ఓ చిన్న ఉంగరమన్నా కొనలేకపోయానే అని బాధపడుతున్న అతనికి వైష్ణవి గొలుసు అమ్ముతాననడం అరుదైన అవకాశంలా కనిపించి- దాన్ని క్యాష్ చేసుకున్నాడు.

తన కూతురు గుర్తు రాగానే - అతని మనసు తిరిగి గట్టిపడింది. గొలుసు తీసుకెళ్ళి మార్వాడికిచ్చి - డబ్బుతెచ్చి వైష్ణవికిచ్చాడు. ఆమె కనీసం లెక్క పెట్టుకోకపోవడం చూసి-

" పదిహేను వందలిచ్చాడమ్మా!" అని చెప్పాడు.

"ఊ....."

" ఎక్కడికి తీసుకెళ్లమంటారు?"

ఆటో అతను అడిగిన ప్రశ్నకి క్షణం బిత్తర పోయింది. ఎక్కడికెళ్ళాలి తను? తనకి ఇల్లు లేదు. అవ్వలు లేరు.... పోలీసుల్ని శివాజీరావు కోసేశాడు. తన సర్కిల్ వ్యక్తుల్ని- తనకి పిచ్చి అని చెప్పి నమ్మించేశాడు చిత్తరంజన్.

ఆ మారణహోమాన్ని ఆపేవాళ్లే లేరా ? ఎవరికి చెప్పుకోవాలి తాను? తనకి 'నా' అనే మనుషులే లేరు కదూ!

"నీకోట్ల రూపాయలు నీ ఒక్క కన్నీటి బొట్టుని కూడా తుడవలేవు వైష్ణవీ!" అన్న వైభవ్ మాటలు చెవుల్లో ప్రతిధ్వనించాయి.

నిజమే! ఇరవై నాలుగు గంటలూ డబ్బు సంపాదన గురించే ఆలోచించిందిగానీ - తనకి నిజంగా సాయపడే ఒక్క వ్యక్తిని సంపాదించుకోలేకపోయింది. తనని పిచ్చిగా ప్రేమించిన వైభవ్ మనసుని తీవ్రంగా గాయపెట్టింది. దారుణంగా వంచించింది.

వైభవ్!

అతనన్న మరో మాట...ఆఖరిగా అతనన్న మాట గుర్తొచ్చింది.

"నీకోసం నాతలుపులెప్పుడూ తెరిచే ఉంటాయ్!"

అవును ఇప్పుడతన్ని శరణూకోరడం మించి వేరే మార్గం లేదు. అతను తప్ప ఈ దారుణ మారణహోమాన్ని మరెవరూ ఆపలేరు.

"కీర్తి అపార్ట్మెంట్స్కి పోనీ"- చెప్పింది.

మరో పావుగంటకి ఆటో కీర్తి అపార్ట్మెంట్స్ ముందాగింది. పరుగులాంటి నడకతో లిఫ్ట్ ఎక్కడం మర్చిపోయి మెట్లక్కి వైభవ్ ఫ్లాట్ కాలింగ్ బెల్ నొక్కింది.

"ఎవరూ?" అంటూ తలుపు తీసిన మందాకినిని-

"వైభవ్గారున్నారా?" అడిగింది.

ఎదురుగా నిలబడ్డ ఈ అమ్మాయిని ఎక్కడో చూసినట్లు ఉన్నా ఎక్కడ చూసిందో గుర్తురావడం లేదు మందాకినికి.

"లేడమ్మా! బయటికెళ్లాడు"

"ఎక్కడికెళ్లారో చెప్పగలరా?" ఆత్రంగా అడిగింది.

"రమణీ అని...మా అబ్బాయి సెక్రటరీ మేరేజ్ రిసెప్షన్ ఇస్తుంటే అక్కడున్నాడు"

"ఎక్కడ?" ఆగలేనట్లుగా అడిగింది.

"మందాకిని లోపలికెళ్లి ఓ ఇన్విటేషన్ కార్డు తీసుకొచ్చి ఇచ్చింది. వెంటనే రిసెప్షన్ టైమింగ్స్ చూసింది."

"అంటే...టైం దాటిపోయింది కదా! ఇంకా అక్కడే ఉంటారా?" అడిగింది వైష్ణవి.

"ఉంటాడమ్మా! నేనిప్పుడు అక్కడ నుంచే వస్తున్నాను. రెండుగంటలకి ఏదో మీటింగ్ ఉందంట... పొవుతక్కువ రెండు దాకా ఉండొచ్చు..." చెప్పింది మందాకిని.

"ఇప్పుడు టైం..."

"ఒకటిన్నరయింది."

"మైగాడ్! వస్తాండీ! థాంక్యూ!" అనేసి నాలుగడుగులు ముందుకి వేసింది వైష్ణవి.

"అమ్మాయ్...నీపేరేంటి?" బయటికొచ్చి అడిగింది మందాకిని.

"వైష్ణవి!"

(ఇంకా వుంది)

న్యూస్ ధ్యాస కూడా మరిపించిన సీరియల్

సీరియల్ ఆరంభమయిన దగ్గర నుండి న్యూస్ కూడా వట్టించుకోలేదు. మిస్ కాకుండా "సీరియల్" చేయాలి. రచయితకు (చల్లా) మా అభినందనలు. సస్పెన్స్ సీరియల్ మమ్మల్నింతగానో ఆకట్టుకొంటున్నది.

గండిమెడ వెంకటేశ్వరరావు,
శ్యామలాదేవి,
నందివెలుగు.

కాలగర్భంలో కరిసిపోతున్న కొల్లేరుగాథ!

భారతదేశంలోనే అతి పెద్ద మంచినీటి సరస్సుగా "కొల్లేరు సరస్సు" ప్రాముఖ్యత సంతరించుకొంది. ఈ సరస్సుపై చరిత్రకారులు విభిన్న అభిప్రాయాలు వెలిబుచ్చారు. క్రీ.శ. 633నుండి 663 వరకూ పరిపాలించిన జయసింహాని కాలంలో ప్రఖ్యాత ప్రపంచ పర్యాటకుడు హ్యూవాన్త్సాంగ్ కొల్లేరు ప్రాంతాన్ని సందర్శించినట్లు చారిత్రాత్మక ఆధారాలున్నాయి. తన పర్యటనానుభవంలో ఆయన కొల్లేరులో హిందూ సంస్కృతి విలసిల్లుతున్నదని, ప్రతిచోటా హిందూ దేవాలయాలే అగుపిస్తున్నాయని, నౌకా యుద్ధంలో అరితేరిన జయసింహాని నౌకలే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అలనాటి కొల్లేరు గత వైభవం చరిత్ర పుటల నడుమ మరుగు పడిపోయి, నేడు కొల్లేరు జీవచ్ఛవంలా వుంది.

కొల్లేరు గురించి 18వ శతాబ్దం చివరినుండి పలువురు బ్రిటిష్ అధికార్లు, ఇంజనీర్లు, అనాటి పాలకులు కొల్లేరు గురించి ఏదో ఒక ప్రణాళిక, నివేదికలను వెల్వడించారు. కానీ అవి ఏవీ కార్యరూపం దాల్చలేదు. 1873లో అప్పటి చీఫ్ ఇంజనీర్ లెఫ్టినెంట్ కర్నల్ ఏలియమ్స్ కొల్లేరును తగ్గించడాన్కి మార్గాలేవో అన్వేషించాలన్నారు. 1890లో గవర్నర్ మకాం చేసి అనాటి కొల్లేరు రైతుల గోడు విన్నారు. ఇదే కాలంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీ సి.టి. వాల్పి కృష్ణా-గోదావరి డెల్టాల వల్ల కొల్లేరుకు వరదలు సంభవిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. 1895లో కొల్లేరుకు భారీ వర్షాల వల్ల వరదలు వచ్చాయి. వరద పరిస్థితిపై 'అట్కిన్సన్' ఒక నివేదిక అందజేశారు. ఇంజనీర్లు కూడా వచ్చి కొల్లేరును పరిశీలించి తగు సూచనలిచ్చారు. 1898-99లో కొల్లేరుపై కొద్దిపాటి వ్యయం కాగల పథకాలు చేపడ్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

1901 సెప్టెంబర్లో వచ్చిన సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ హాలీ ఉప్పుటేరును వెడల్పు చేయాలన్నారు. 1904లో కొల్లేరు రైతులు తమ పంట నష్టాన్ని గూర్చి ప్రభుత్వానికి విన్నవించుకోగా, మరలా ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ సి.కమనల్ను నియమించింది. 1960లో ప్రజా ప్రతినిధులు ఒక స్పెషలాఫీసర్ను నియమించి కొల్లేరు వరద నివారణను గూర్చి పరిశీలించాలని కోరగా అప్పటి చీఫ్ ఇంజనీర్ శ్రీ ఎస్. జె. విల్సన్ ఆ ప్రతిపాదనను త్రోసిపుచ్చారు. 1906 నవంబర్ 13వ తేదీన మద్రాస్ కౌన్సిల్లో కొల్లేరు సమస్య ప్రస్తావనకొచ్చింది. ప్రభుత్వ ప్రతినిధి శ్రీ జి. ఎ. సిమ్మిత్ కొల్లేరు గురించి పరిశీలించామని, దానికి నీరు పోయేందుకు ఉప్పుటేరు ఒక్కటే మార్గమని సమాధానమిచ్చారు. 1915 మార్చి 29వ తేదీ మరలా మద్రాస్ కౌన్సిల్లో రావ్బహద్దర్ శ్రీ మోచర్ల రామచంద్రరావు పంతులుగారు కృష్ణా-గోదావరి డెల్టాలను సక్రాలంలో బాగుచేయనందున ఇష్టపడే కొల్లేరులో వ్యవసాయం చేస్తున్నారని కొల్లేరు రైతులకోసం ప్రజాధనం ఎందుకు ఖర్చుచేయాలనే వాదనను శ్రీ ఇల్లీస్ లేవనెత్తారు. 1917 ఫిబ్రవరి 6వ తేదీన శ్రీ భూపతిరాజు వెంకటపతిరాజు కొల్లేరు గూర్చి ప్రశ్నించారు. మరలా ఆయన 1918 ఆగస్ట్ 3వ తేదీన పట్టు విడవకుండా కౌన్సిల్లో కొల్లేరు విషయం ప్రస్తావించారు. దానిపై మద్రాస్ ప్రభుత్వం అప్పటి చీఫ్ ఇంజనీర్ శ్రీ హాలీని కొల్లేరుపై ఒక సమగ్ర నివేదిక ఇవ్వవల్సిందిగా కోరింది. శ్రీ హాలీ 1920 అక్టోబర్ 23వ తేదీన అంతవరకూ కొల్లేరుపై జరిగిన తర్జన భర్జనలను ఒక నివేదిక రూపంలో అనాటి ప్రభుత్వానికి సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా కొల్లేరుపై అనేక విషయాలు వెలుగులోనికి వచ్చాయి.

కొల్లేరు సరస్సు భారతదేశంలోని అతి పెద్ద మంచినీటి సరస్సు. దీని విస్తీర్ణం 901 చ.కి.మీటర్లు. ఇది సారవంతమైన కృష్ణా- గోదావరి డెల్టాల మధ్య భాగంలో సహజసిద్ధంగా ఏర్పడింది. ఇది కృష్ణా జిల్లాలోని 49వేల 415 ఎకరాలు,పశ్చిమగోదావరి జిల్లాలో ఒక లక్షా 56వేల 457 ఎకరాలలో విస్తరించియున్నది. పశ్చిమ గోదావరి జిల్లాలో పూర్వపు తాలూకాలైన తాడేపల్లిగూడెం, ఏలూరు, భీమవరం, కృష్ణా జిల్లాలోని పూర్వపు తాలూకాలైన కైకలూరు, గుడివాడ ఈ సరస్సుకు సహజ సరిహద్దులుగా వున్నాయి. దీని క్రింద కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాలోని 98 గ్రామాలున్నాయి. 3లక్షల ఎకరాల్లో నుండి 15 కాలువలు, 15 మురుగు కాల్వలు (డ్రయిన్లు), రెండు నదులనుండి ఒక లక్షా 10వేల క్యూసెక్కుల నీరు ఈ సరస్సులోకి చేరుతుందని ఒక అంచనా. అయితే 1964 వరదల్లో 2.2 క్యూసెక్కుల నీరు తీసుకొనివచ్చినట్లు ఒక సర్వేలో వెల్లడైంది. రాను రాను కృష్ణా-గోదావరి పరీవాహక ప్రాంతంలో సగటు వర్షపాతం కూడా పెరుగుతున్నది. కొల్లేరు బేసిన్లో 1965నుండి 1975వరకూ ప్రభుత్వం నమోదు చేసిన వర్షపాతం అంకెలు ఈవిధంగా వున్నాయి. భీమవరం ప్రాంతంలో 953.7 మి.మీ., తాడేపల్లిగూడెం ప్రాంతంలో 1095.6మి.మీ., ఏలూరు ప్రాంతంలో 957.9 మి.మీ., కైకలూరు ప్రాంతంలో 868.1మి.మీ., గుడివాడ ప్రాంతంలో 892.7 మిల్లీమీటర్లుగా నమోదయింది. సంవత్సర సగటు వర్షపాతం 969 మి.మీ.గా వుంది.

కొల్లేరు సరస్సు యొక్క నదీ పరీవాహక ప్రాంతాలనుండి, మెట్టప్రాంతాల నుండి 1365 చదరపు మైళ్ళు, డెల్టా ప్రాంతాలనుండి 756 చదరపుమైళ్ళు, మొత్తం 2121 చదరపు మైళ్ళు నుండీ సాలీనా 63.36 కోట్ల ఘనపుటడుగుల నీరు కొల్లేరులోకి వస్తుంది. ఇందులో మెట్ట ప్రాంతాలనుండి 52.25 కోట్ల ఘనపుటడుగులు,డెల్టా ప్రాంతం నుండి 11.11 కోట్ల ఘనపుటడుగుల నీరు కొల్లేరులోకి వస్తుంది. ఇవికాక కృష్ణా, గోదావరి జిల్లాల్లోని డెల్టా ప్రాంతాల నుండి మురుగు కాల్వలనుండి 300చదరపు మైళ్ళలో పడే మురుగు, ముంపు నుకూడా ఈ కొల్లేరే భరించాలి. ఇవన్నీ 1965కు ముందున్న లెక్కలు మాత్రమే. రానురాను వర్షపాతం సగటున పెరిగిపోతున్నది. దశాబ్దాలతరబడి త్రవ్విన డ్రయిన్లు పూర్తిగా పూడిపోయి, మరి కొన్ని రైతుల ఆక్రమణలకు గురయి వాటి పాత్రను అవి (డ్రయిన్లు) నిర్వహించలేకపోతున్నాయి.

దానికితోడు కొల్లేరుకు కృష్ణా-గోదావరి డెల్టాలనుండి వివిధ ప్రవాహాలు తీసికొనివస్తున్న సారవంతమైన ఒండ్రు మట్టితో కొల్లేరు సరస్సు మట్టం గణనీయంగా పెరిగింది. కొల్లేరు సరస్సు సాలుకు రెండు వ్వర సెంటీమీటర్లు చొప్పున పూడిపోతున్నదని, దీనిప్రకారం + 0.91 మీటర్లు కాంటూర్ లెవెల్లో 86లక్షల ఘనపుమీటర్లు పూడిక సరస్సులో చేరుతున్నట్లు తేలుతున్నదని, + 1.5 మీటర్లు కాంటూర్ లెవెల్లో సరస్సులో 65కోట్లు ఘనపుటడుగుల నీరు నిల్వకు అవకాశం వున్నదని 1974-75 సం.నికి సరస్సులో నీరు నిల్వగల పరిమాణం 17వ్వర కోట్ల ఘనపుటడుగులకు పడిపోయిందని 1984లో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (హైద్రాబాద్) వారు నిర్వహించిన ఒక సర్వేలో తేలింది. కొల్లేరు సరస్సు వార్షిక నీటిమట్టం సగటున పెరుగుతున్నది. 1916-45 సం.ల మధ్య సాలు సరి సగటు నీటిమట్టం + 1.96 మీటర్లుండేది. 1946-80 మధ్య కాలంలో ఇది 2.28 మీటర్లకు పెరిగింది. దీనిని బట్టి సరస్సు నీటిమట్టం పెరుగుతున్నదని గ్రహించవచ్చు. వ్యవసాయ భూముల నుండి వచ్చే మట్టి సరస్సులో మేటలు వేయడాన్కి ప్రధాన కారణం. సరస్సు మధ్యలో నీరు తీసిన కాలంలో బయట పడే కొల్లేరు భూముల్లో సరస్సు వెంబడి దున్నడం, అందులో వ్యవసాయం చేయడంవల్ల సరస్సు + 0.91 మీటర్లు లెవెల్కు బయటపడిన ఒక లక్ష ఎకరాలలో రెండవ పంట (దాళ్వా)లో సాగుచేస్తున్నారు. వర్షాకాలంలో ఇటువంటి భూముల్లోని మట్టి సరస్సులోనికి కొట్టుకుపోతున్నదని శాస్త్రజ్ఞులు మొత్తుకుంటున్నారు. అందువల్ల కొద్దిపాటి వరద వచ్చినా కొల్లేరు ఎగదన్ని రెండు జిల్లాల్లోని పంట భూములను, గ్రామాలను ముంచెత్తుతుంది. కొల్లేరు నుండి నీటి ప్రవాహం సముద్రంలోకి వెళ్ళేందుకు ఒకే ఒక మార్గం వుంది. అదే ఉప్పుటేరు. దీని పొడవు 62.8 కిలోమీటర్లు. మిత్రా కమిటీ సిఫార్సుల మేరకు 1980లో స్ట్రెయిట్ కట్ చేసిన తరువాత ఉప్పుటేరు పొడవు 49 కి.మీ.కు తగ్గింది. ఉప్పుటేరు అభివృద్ధిపర్చకముందు సరస్సులో 7 అడుగుల నీటిమట్టం వున్నప్పుడు ఉప్పుటేరు 650 క్యూసెక్కుల నీరును సముద్రంలోకి పంపేది. స్ట్రెయిట్కట్ అభివృద్ధి పర్చిన దరిమిలా 1983, 86 సం.ల్లో వచ్చిన వరదల్లో 14వేల 600క్యూసెక్కుల నీటిని సముద్రంలోనికి పంపింది.

కొల్లేరు బడా ఆక్రమణదారుల కబంధ హస్తాల్లో చిక్కివుంది. మాజీ మంత్రులు, పెద్ద పెద్ద నాయకులు, వందలాది ఎకరాలు చేపల చెరువులు త్రవ్వి నడి కొల్లేరులో ఎత్తయిన చెరువు గట్లు వేయడంతో మొత్తం సరస్సు ప్రవాహంలో అనుకోని మార్పులు వచ్చాయి. దీనికితోడు కొల్లేరు ప్రజానీకాన్ని నాగరిక ప్రపంచానికి దగ్గర చేయాలన్న ధ్యేయంతో పాలకులు కొల్లేరు గర్భంలో 50 కిలోమీటర్లు ఆర్.అండ్ బి. రోడ్లు, మరో 50 కిలోమీటర్లు పంచాయితీ రాజ్ రోడ్లు వేయటంతో సరస్సు ప్రవాహం తీరులో మార్పులు వచ్చాయి. దీని ఫలితంగా కొద్దిపాటి వర్షం కురిసినా కొల్లేరు సహజ ప్రవాహానికి అడ్డుగోడలులావున్న చేపల చెరువు గట్లు కొల్లేరులోని రోడ్లవల్ల, కొల్లేరు ప్రవాహం మునుపటివలే స్వీకరించలేక ఎగదన్నుతూ వుండడం వల్ల దీని సహజ ప్రవాహ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. కొల్లేరు ఎగదన్నడంతో ఆ నీరు దాని పరీవాహక ప్రాంతాలపై పడడం, అనేక లక్షల ఎకరాల పంట భూములు, డెల్టా గ్రామాలను వరద ప్రవాహంలో ముంచెత్తడువరి నాలుగైదు రోజులకు కొల్లేరు ముంపునకు గురవుతుంది. ఈ అనుభవాలను 1983, 86, 89 వరదల్లో కృష్ణా, ప.గో.జిల్లా రైతాంగం చవిచూడాల్సి వచ్చింది. అయినప్పటికీ ఈ ప్రభుత్వానికి స్పందన లేకపోవడం శోచనీయం.

1951 నుండి 1955వరకూ కొల్లేరు వల్ల జరిగిన ముంపు నష్టాలను పరిశీలిస్తే ఈ వివరాలు తెలుస్తాయి. పంటల నష్టం 27కోట్లు. గృహాలు కూలిపోవడంవల్ల 4కోట్ల 90లక్షలు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం 50 లక్షలు. పశువుల నష్టం 35 లక్షలు. వరద నివారణకు ప్రభుత్వం ఇచ్చిన నష్టం 20లక్షలు. సుమారు వెయ్యికిపైగా జననష్టం కూడా జరిగింది. నాలుగైదేళ్ళలో ప్రభుత్వాంచనాల ప్రకారం 33కోట్ల రూ.ల నష్టం జరిగింది. 1956 ఆగస్ట్ నెలలో వచ్చిన వరదలకు కొల్లేరు బాగా ముంచెత్తింది. దీనివల్ల కృష్ణా, గోదావరి జిల్లాలు వరదకు గురయినందున బుడమేరు ముంపు వల్ల 47వేల 500 ఎకరాలు, కొల్లేరు ముంపువల్ల కృష్ణా జిల్లాలో 32వేల ఎకరాలు, ప.గో.జిల్లాలో 32వేల 380ఎకరాలు, తమ్మిలేరు ముంపువల్ల 6వేల ఎకరాలు, వివిధ చిన్న పెద్ద డ్రయిన్ల వల్ల 35వేల ఎకరాలు, మొత్తంమీద ఒక లక్షా 52వేల 880ఎకరాలు దెబ్బతిన్నాయి.

మరలా 1958 లో వచ్చిన భారీ వర్షాలు కారణంగా ప. గో. జిల్లాలోని 6 తాలూకాలు, కృష్ణాజిల్లాలోని రెండు తాలూకాలు అపార నష్టానికి గురయ్యాయి. ప. గో. జిల్లాలోని 116 గ్రామాల్లో 84 వేల 118 ఎకరాల పంటభూములు, వరదల తాకిడికి 7451 గృహాలు నేలమట్టమయ్యాయి అని అనాటి రెవిన్యూ మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి శాసనసభకు నివేదించారు.

1964 సెప్టెంబరు 27 నుండి 29 తేదీల్లో రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా గత 30 సం.ల్లో లేనంత వరద కొల్లేరుకు వచ్చింది. వరద నష్టంయొక్క ప్రభుత్వ అంకెలు ఈ విధంగా ఉన్నాయి. ప. గో. జిల్లాలోని నీటి వనరులకు కల్గిన నష్టం 9 లక్షల 59వేల 50 రూలు. వరదల్లో ఒక లక్షా 22 వేల 377 ఎకరాలు ముంపునకు గురికాగా పంట నష్టం విలువ ఒక కోటి 71 లక్షల 36 వేల 240 రూ.లు. రోడ్లకు కల్గిన నష్టం ఒక కోటి 30 లక్షల 32 వేల 70 రూలు. ప్రభుత్వ ఆస్తులకు 30 వేల రూ.లు నష్టం సంభవించినది. మనుషుల ప్రాణ నష్టం 6, కృష్ణాజిల్లాలో ఒక లక్షా 81 వేల 49 ఎకరాల్లో పంటనష్టం కాగా దాని విలువ 31 లక్షల 81 వేల 119 రూ.లు. రోడ్లకు సంభవించిన 31 లక్షల 81 వేల 119 రూ.లు, రోడ్లకు సంభవించిన నష్టం 76 లక్షల 24 వేలు, ప్రభుత్వ ఆస్తులకు కల్గిన నష్టం 2 లక్షల 43 వేల రూ.లు, 8 మంది మనుషులు, 235 పశువులు చనిపోయాయి. అనాటి ప్రభుత్వం ప.గో. జిల్లాకు 6 లక్షలు, కృష్ణాజిల్లాకు 2 లక్షల రూ.లు తాత్కాలిక సహాయం ఇచ్చింది. అనాటి రాష్ట్రప్రభుత్వం కోరిక మేరకు కృష్ణా, గోదావరి కొల్లేరు మురుగు ముంపు సమస్యలను దృష్టిలో వుంచుకొని కేంద్ర ప్రభుత్వం వరద నివారణోపాయాలపై ఉత్తర ప్రదేశ్ చీఫ్ ఇంజనీర్ శ్రీ ఎ. సి. మిత్రా అధ్యక్షతన ఒక కమిటీ నియమించింది.

అనాటి కేంద్రప్రభుత్వం నియమించిన "మిత్రాకమిటీ" 5 గురు ఉద్దండులైన ఇంజనీరింగ్ నిపుణులాలతో ఏర్పాటైంది. శ్రీ ఎ. సి. మిత్రా (ఉత్తర ప్రదేశ్ మాజీ చీఫ్ ఇంజనీర్, లక్నో) అధ్యక్షునిగాను, శ్రీ ఆర్.డి.ధీర్ (చీఫ్ ఇంజనీర్, కేంద్రజలవిద్యుత్ శాఖ, న్యూఢిల్లీ) కమిటీ కార్యదర్శిగానూ, శ్రీ యు. అనందరావు (నలహాదారు,జలవిద్యుత్ శాఖ, మద్రాసు, శ్రీ జి. ఏ. నరసింహారావు, (అదనపు కార్యదర్శి, ప్రజాపనులు, ఆంధ్రప్రదేశ్) డా. డి. వి. జోగ్లేకర్ (గౌరవ సలహాదార్, జలవిద్యుత్ శాఖ, పూనా)లు సభ్యులుగా ఉన్న కమిటీ కృష్ణా-గోదావరి, కొల్లేరు బేసిన్లో సమగ్రమైన పరిశోధనలుచేసింది. కొల్లేరు, కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతాల సమగ్ర వరద నివారణ పథకాలురెండు దశల్లో 20-25 కోట్లు రూ. లు వ్యయంతో అయిదారేళ్లలో పూర్తిచేయడానికి తగిన పథకాలను మిత్రా కమిటీ 1965లోనే తన నివేదికలో పేర్కొంది.

ఈ సంవత్సరం జూలై, ఆగస్టు నెలల్లో కొల్లేరుకువచ్చిన ముంపు దృశ్యం.

1964 నుండి 1989 వరకు కొల్లేరు సరస్సు ఉప్పుటేరులో అత్యధిక రికార్డుగా నమోదయిన వరద నీటిమట్టం (అడుగులలో) ఈ క్రింది పట్టికలో చూపిన విధంగా వుంది.

సంవత్సరం	నెల తేదీ	కొల్లేరు సందిరిపల్లిగూడెం వద్ద	ఉప్పుటేరు ఆకివీడురోడ్ బ్రిడ్జివద్ద
1964	సెప్టెంబర్, 27,28,29..	10.7	9.6
1983	అక్టోబరు,5,6	9.9	7.9
1986	ఆగస్ట్,17,18..	9.0	7.4
1989	జూలై,24,25		
1989	ఆగస్ట్,24,25	9.8	7.9
1989	సెప్టెంబర్,1..	9.9	8.4

ఈ ఫొటోలో కన్పించేది అటవీప్రాంతం అనుకుంటున్నారా? కాదు కొల్లేరు మురుగు, ముంపునీరు తీసుకొనివచ్చే ఒక డ్రైన్. దశాబ్దాలు తరబడి బాగుచేయనందున చెట్లు-చేమలతో డ్రైన్ పూడిపోయిన దృశ్యం.

మొదటి దశ

1. కొల్లేరు సరస్సులో నీరు 7 అడుగుల మట్టంలో ఉన్నప్పుడు ఉప్పుటేరు 16 వేల క్యూసెక్కులు నీటిని సముద్రంలోనికి తీసికొనిపోయే విధంగా అభివృద్ధిచేయాలి. రెండవదశలో ఉప్పుటేరు 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహానికి వీలుగా అభివృద్ధి చేయాలి. అందుకవసరమైన భూసేకరణ జరగాలి.

(మిగతా రేపటి సంచికలో)

-కొండవీటి త్రినాథ.

ఒరుశేయవి యొనరించిన నరవర యుపకృతము తన మనంబునకెగుదా
వొరులకువవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములెల్లన్

ఆంధ్రపత్రిక

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు : 1938-1972

చర్చ - చర్య

రాష్ట్రం తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్న తరుణంలో రాష్ట్ర ప్రజల ప్రతినిధులందరూ ఒక చోట చేరి తలలు రాపాడించడం, అభిప్రాయాలను కలబోసుకోవడం హర్షించదగిన అంశం. ఆగ్రహించిన ప్రకృతి, అతివృష్టి భీకరాకృతి ఒక వంక, పరాకాష్ఠకు చేరిన హింసోన్మాదంతో ముదిరిపోయిన నక్సలిజం మరో వంక రాష్ట్ర ప్రజలను కకావికలు చేస్తున్న సమయంలో మనం ఎన్నుకొన్న మన ప్రతినిధులందరూ కొలువుదీరి కూర్చోవడం ప్రజలకు ఎంతైనా మేలు చేకూర్చే పరిణామం అయితే ముందున్న ఎన్నికలను మన నుంచి ఉంచుకొని గౌరవ సభ్యులు స్వీయ రాజకీయ ప్రయోజనాల దృష్టితో ప్రజా సమస్యలను చూడడం మంచి పద్ధతి కాదు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉతికి ఆరవేయడానికి ఒక ఉపకరణంగా ఈ సభలను వినియోగించుకోవాలని కాంగ్రెస్ వారు సంకల్పించినా, కేంద్ర ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టడానికి దీనినొక అవకాశంగా వాడుకోవాలని తెలుగుదేశం, దాని మిత్ర పక్షాలు భావించినా అది క్షంతవ్యం కాని నేరం.

నానాటికీ ప్రబలుతూ, అమాయకుల ప్రాణాలతో అడుకొంటున్న నక్సలిజం విషయంలో అన్ని పక్షాల ప్రజా ప్రతినిధులు ఒక అంగీకారానికి వచ్చి ఉంటే బాగుండేది. ఆ అంగీకారం శాసనసభ తీర్మానం ద్వారా అన్ని రాజకీయ పక్షాల ఆమోదాన్ని పొంది ఆ ప్రకారం సమస్య పరిష్కారానికి పటిష్టమైన చర్య అరంభమై ఉంటే ఎంతో లెస్సగా ఉండేది. అయితే అటువంటిదేమీ జరగడం లేదు. జరుగుతుందన్న ఆశలు కానరావడం లేదు.

వరసగా రెండుసార్లు విరుచుకుపడి, విధ్వంసించి నానా బీభత్సాన్ని సృష్టించి, బడుగు ప్రజల కొంప, గోడు కొల్లగొట్టిన వరదల విషయంలోను సభలో చర్చ ఆశించినంత సమగ్రంగా జరగలేదు. వరదల నివారణకు తగిన పటిష్టమైన పథకాన్ని ప్రభుత్వం సభ ముందు ఉంచలేకపోయింది. కోస్తా జిల్లాలలో చిన్న చినుకు పడితే చాలు వాగులు భయంకరంగా పొంగి లోతట్టు ప్రాంతాలలో కల్లోలం సృష్టిస్తున్న పరిస్థితికి కృష్ణ, గోదావరి డెల్టాలలో మురుగునీటి పారుదల వ్యవస్థను మరమ్మతు చేయకపోవడమే ప్రధాన కారణమనే సంగతిని సభాముఖంగా ప్రజల దృష్టికి తీసుకురావడంలో ప్రతిపక్ష సభ్యులు కృతకృత్యులయ్యారు. పది సన్నెంబేళ్లుగా మరమ్మతులు లేక, మురుగు కాలువలు మేట వేసి చిరు చిన్న ప్రవాహాన్నైనా ఆకలింపు చేసుకోలేని స్థితిలో ఉన్నాయి. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన దాదాపు గత ఆరు సంవత్సరాలలో కూడా మురుగు పారుదల వ్యవస్థ మెరుగుదలకు గట్టి చర్య లేవీ తీసుకోలేదనేది వాస్తవం. ప్రభుత్వం తన తప్పును ఒప్పుకోవడానికి బదులు అంత ఖర్చు చేశాము, ఇంత ఖర్చు చేశాము అనే ధోరణిలో మాట్లాడి బాధ్యత నుంచి తప్పుకోవడానికి ప్రయత్నించడం అత్యంత శోచనీయమైన అంశం. మురుగుపారుదల మెరుగుదల కోసం మిత్రా కమిటీ సమర్పించిన నివేదికను, రామకృష్ణయ్య నివేదికను ఏమి చేశారని అడగగా అవి తమ వద్ద భద్రంగా ఉన్నాయని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు తార్కాణం. ఈ నివేదికలను ఇంకా ఎంత కాలం పరిశీలిస్తారు? కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదిక ఇంకో నెల రోజులలో వెలువడుతుందని మంత్రివర్యులు చెప్పారు. ఆ నివేదికను కూడా ఇలాగే సంవత్సరాల తరబడి పరిశీలిస్తూ ఉంటారా? మంత్రి సమాధానం చెప్పిన ధోరణి చూస్తుంటే మురుగు పారుదల వ్యవస్థ మరమ్మతు పట్ల ప్రభుత్వం అర్థమనస్కంగానే ఉన్నదని అనుకోవలసి వస్తున్నది. మురుగు కాల్వలను పూర్తిగా మరమ్మతు చేసినా వరదల వల్ల ముప్పు కలగబోదనే హామీ ఏమీ లేదని మంత్రిమాన్యులు సెలవిచ్చినట్టు వచ్చిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. దీపం వెలిగించినా ఆరిపోదనే గ్యారంటీ లేదని అనలు దీపమే వెలిగించడం మానుకొంటామా, ఇది ముమ్మాటికీ సమర్థించకూడని వాదన. ఎల్లరూ ఖండించవలసిన వైఖరి. కోట్ల సంఖ్యల్లో ఖర్చు చూపించడం కాదు కావలసింది. గత రెండు మూడు మాసాల్లో స్వల్ప వ్యవధిలోనే వరుసగా పొంగిన వాగుల వల్ల వరదల వల్ల ఎంత నష్టం సంభవించిందో ఖచ్చితమైన అంచనా వేసి మురుగు కాలువ లన్నింటిలోనూ డ్రెడ్జింగ్ ద్వారా పూడిక తీయించడానికి, ఆక్రమణలు తొలగించడానికి కర కట్టలు గట్టి పరచడానికి ఎంత ఖర్చవుతుందో ఈ పథకాన్ని ఎన్నేళ్లలో పూర్తి చేయవచ్చునో వాస్తవిక దృక్పథంతో ఒక నిర్ణయానికి రావలసిన అవసరం ఉంది. ఇది ప్రభుత్వం తక్షణం చేపట్టవలసిన పని. యుద్ధ ప్రాతిపదికమీద నిర్వర్తించవలసిన కర్తవ్యం. అలా చేయని ప్రభుత్వానికి చిత్త శుద్ధి లోపించిగా లేదని అనుకోవలసి ఉంటుంది. అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతోనూ మాట్లాడి ఒక పథకాన్ని సిద్ధం చేయడమే కాదు, ఆ పథకానికి కేంద్రం నుంచి అవసరమైనన్ని నిధులు సాధించడానికి ప్రజల నుంచి, ధనికులు, దాతల నుంచి భూరి విరాళాలు రాబట్టడానికి కూడా ప్రభుత్వం సారథ్యంలో అఖిలపక్ష కృషి జరగవలసి ఉంది. రైతులు ముందుకొచ్చి ఏభై శాతం వ్యయం భరిస్తే మిగతా సగం ఖర్చు ప్రభుత్వం భరించగలదని ముఖ్యమంత్రి ఆ మధ్య ఒక అభిప్రాయాన్ని ప్రకటించారు. ఎప్పటికీ ఏ ఆలోచన మెరిస్తే దానిని ప్రకటించి ఆ మరుక్షణమే మరిచిపోవడం మన ముఖ్యమంత్రికి అనవాయితీ. ఈ వ్యవహారాన్ని కూడా అలాగే పరిగణించి వ్యవహరించితే ప్రజలు క్షమించరు. రాష్ట్ర ప్రజలను పీడిస్తున్న వరదల బీభత్సం, నక్సలిజం సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం కట్టి కదిలేటట్టు చేయడం అన్ని పక్షాలకు చెందిన గౌరవ శాసనసభ్యులందరి మీద ఉన్న గురుతర బాధ్యత.

మంచిమాట

ప్రజ్ఞావంతుడు కానివాడు, స్నేహితుని మాటను కాలదన్నిన వాడు నాశనమగును.

- పంచతంత్రం

చిత్రహార్‌ను మించింది చిత్రలహరి!

హైదరాబాద్ దూరదర్శన్ గురువారం రాత్రి గం. 7-55 వి. ప్రసారం చేసే "చిత్రలహరి" శుక్రవారాలు రాత్రి గం. 7-55 వి. మార్చారు. ఈ కారణంగా ఢిల్లీ కేంద్రం నుంచి శుక్రవారం 7-55 వి. ప్రసారమయ్యే "చిత్రహార్" కార్యక్రమం చూసే అవకాశము పోయింది. అందుచేత తెలుగు "చిత్రలహరి"ని వారంలో రెండుసార్లు ప్రతి మంగళవారం, ప్రతి శుక్రవారం ప్రసారం చేయమనవి. చిత్రలహరి ఒకే టైపు పాటల హోరు. అలా కాకుండా మంగళవారం పాత సినిమా పాటలు, శుక్రవారం క్రొత్త సినిమా పాటలు ప్రసారం చేస్తే శ్రోతలకు మనోరంజకంగా ఉంటుంది.

యనమండ్ర శ్రీనివాస భాస్కరరావు, కొత్తపేట.

ఇక ఆలస్యం ఎందుకు?

తనను సి.ఐ.ఎ. ఏజెంట్ అని నిరూపిస్తే ఎబిడ్స్‌లో బహిరంగంగా ఉరితీసు కుంటానని ముఖ్యమంత్రి రామారావుగారు సవాల్ చేసారు. తమ దగ్గర ఎన్.టి.ఆర్. సి.ఐ.ఎ. ఏజెంట్ అవడానికి సాక్ష్యాలు ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు బైట పెడతామని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు, కేంద్రమంత్రి జలగం వెంగళరావు చాలాసార్లు చెప్పారు. రామారావు సవాలు చేసారు. కాబట్టి నిజంగా వారి దగ్గర ఆధారాలు ఉంటే నిరూపించాల్సిన సమయం వచ్చింది. లేకుంటే అసత్య ఆరోపణలు చేసినందుకు ప్రజలకు, ఎన్.టి.ఆర్.కి క్షమాపణలు చెప్పాలి. ఇరుపక్షాలలో ఎవరు తోక ముడిచినా సిగ్గుమాలినతనమే అవుతుంది.

ఎమ్.వి. భీమశంకరం
హైదరాబాద్-13

తపాలుడబ్బా తలనొప్పితగ్గాలి

విజయవాడ తారాపేట దగ్గర వున్న పార్కు మూలమీద నాలుగు రోడ్లు కూడలిలోని పోస్టు బాక్సుకు పోస్టల్ వారు తాళం వీర్పాటు చేసి పోస్టు డబ్బాను బాగుచేసి ప్రజల ఉత్తరాలకు రక్షణ కల్పించాలి.

షేక్ మస్తాన్,
విజయవాడ

కరెంటు స్తంభం మార్చాలండి

భట్టిప్రోలులో మెయిన్‌రోడ్డుపై ఉన్న ఎస్2/బి2 నెంబరు కరెంటు స్తంభం నేలమట్టానికి రెండడుగుల పైన ఓ అడుగు పొడవు తుప్పు పట్టి శిథిలమైపోయింది. ఈ రోడ్డుపై రోజూ వందల మంది తిరుగాడుతుంటారు. ఎన్నో వాహనములు ప్రయాణిస్తుంటాయి. ఏ సమయంలో వీరికి ఎట్టి అపాయం కలిగినా కలుగవచ్చు - ముందే విద్యుత్ శాఖాధికారులు మేల్కొని స్తంభాన్ని మార్చాలని కోరుతున్నాను.

నందం రెడ్డియ్య,
భట్టిప్రోలు.

జనఘోష

కొయ్యలగూడెం నిరుద్యోగి క్షోభ!

ఏలూరు ఎంప్లాయిమెంటులో పేరు నమోదుచేసికొని 10 సం.రాలు దాటినది. ఇంతవరకు ఒక కాల్‌కూడా లేదు. రెన్యూల్స్ తప్పటంలేదు. మా ఊరువుకు ఏలూరు వెళ్లాలంటే 55 కి.మీ.లు దూరం. అంత దూరం వెళ్లాలన్నా చాలాభారంగా యుంది. కారణం నిరుద్యోగం. చాలామంది స్థితి ఇదే. కొయ్యలగూడెం ఏజిన్సీకి ముఖద్వారం సుమారు గిరిజన గ్రామాలు కొయ్యలగూడెంనకు 17 కి.మీ.దూరంలో యున్నవి.

ఇప్పట రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలున్నవి. హరిజన, గిరిజన, వె.త. వారు ఏలూరు వెళ్లుటకు చాలా కష్టంగా యున్నది. గనుక ప్రభుత్వం వారు కొయ్యలగూడెంలో సబ్-ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజి పెడితే ఈ చుట్టు ప్రక్కల గ్రామస్తులకు చాలా సౌకర్యంగా యుండును.

యన్. ఆనందరావు,
కొయ్యలగూడెం.

కవర్డు, హైటర్ శిలా విగ్రహాలు

విశాఖ జిల్లా నర్సీపట్నంలో అల్లూరి సీతారామరాజుతో కడెం వద్ద జరిగిన పోరాటంలో మరణించిన కవార్డ్, హైటర్ మరియు మరొకరి సమాధులు ఆలనాపాలనా లేకుండా పడివున్నవి. మట్టి గడ్డి, చెత్త, చెదారం, మల మూత్రములున్నవి. నేను అతికష్టంమీద ఆ సమాధుల వద్దకు పోయివాటిమీద రాతలను చదువుగలిగినాను.

కావున అర్కియాలజీ డిపార్ట్‌మెంటు వారుగాని, స్వాతంత్ర్య యోధుల సంఘం వారుగాని వాటిని ప్రిజర్వ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని నా మనవి. నర్సీపట్నం ఆ పరిసరప్రాంతాలలో ఇటువంటి కట్టడాలింకేమైనా ఉంటే వాటిని కూడా ప్రిజర్వ్ చేయాలి. అవి నాటి చరిత్రకు చెరగని సాక్ష్యాలు.

నర్సీపట్నం నుండి తుని రోడ్డు అంతా గతుకులతో గుంటలతో భయంకరముగా నున్నది.

ఇంతపెద్ద రహదారి ఈ దుస్థితిలో నుండుట శోచనీయము. కనుక సంబంధిత ప్రభుత్వ శాఖ వెంటనే ఈ రోడ్డును బాగుచేయించాలని నా మనవి.

బి.వి.ఎస్. రావు
చిక్కడపల్లి, హైదరాబాద్.

ఆశ్చర్యం!

ఆర్యా! మనదేశంలో నిరుద్యోగ సమస్య, రౌడీల, గుండాల అరాచకపు పనులు, గిన్నిస్ బుక్కు ఎక్కుతాయంటే ఆశ్చర్యం లేదు, కారణం-

ఇందుగలరు అందులేరు అనకేమీ
గుండా, రౌడీ, నిరుద్యోగులు.

కొటికలపూడి శివరామప్రసాద్,
హైదరాబాద్.

ఉరుకుంద 'ఈరణ్ణి!'

ఆదోని తాలూకా ఉరుకుంద గ్రామంలో ఉరుకుంద ఈరణ్ణి శ్రీ నృసింహస్వామి ఆలయం ఉన్నది. ఈ ఉరుకుంద దేవాలయం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏటా శ్రావణమాసంలో జరిగే స్వామి వారి ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి వేలాది భక్తులు వస్తారు. మొక్కుబట్లు చెల్లిస్తుంటారు.

కాని యాత్రికులకు ఏ సౌకర్యములూ లేక చాలా ఇబ్బంది కలుగుతున్నది. కనీసం బస్ షెల్టర్‌కూడా లేదు. కనుక యాత్రికుల సౌలభ్యంద్రష్ట్వా అక్కడొక, 'బస్ షెల్టర్'ను నిర్మించాలి., సౌకర్యములు అభివృద్ధిచేస్తే మరింత పెద్ద సంఖ్యలో భక్తులు రాగల్గుతారు.

జి. యమధర్మరాజు,
అరుణ్యోతినగర్, ఆదోని.

ఇంకెన్నాళ్ళీ రావణకాష్ఠం!

నక్సలైట్ కార్యకలాపాలలో ఈమధ్య కిడ్నాప్ ఉదంతాలు జోరుగా ఉన్నాయి. ప్రభుత్వాధికారులను, ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేయటం, గ్రామాలలో హత్యలు, హింసాత్మక చర్యలకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులను దగ్ధంచేయటం జరుగుతున్నది. పలితంగా రగిలే మర్దనల్లో అఱరుకు అమాయక ప్రజలు సైతం ప్రాణాలు కోల్పోతున్నారు.

అరవయ్యో దశాబ్దం చివర పశ్చిమబెంగాల్‌లోని నక్సల్ బరీ ప్రాంతంలో ప్రారంభమైన నక్సలైట్ల ఉద్యమం విద్యార్థులను, మేధావివర్గానికి చెందిన కొందరిని ఆకర్షించింది. వీరి సిద్ధాంతం పేదరైతులకు వ్యవసాయ కూలీలకు ఉత్తేజమిచ్చింది. భూస్వాములను, పెట్టుబడిదారులను అంతంచేసి జనతా ప్రజాతంత్రాన్ని (పీపుల్స్ డెమొక్రసీ) ఏర్పాటుచేయటం వీరి ఇక్యం. వీరిలోని అన్నివర్గాలవారికి సాయుధ పోరాటంలో విశ్వాసం ఉంటుంది.

తుపాకి గొట్టంద్వారానే పీడిత ప్రజలకు రాజ్యాధికారం లభిస్తుందనే సిద్ధాంతంతో మన రాష్ట్రంలో నక్సలైట్లు గత రెండు దశాబ్దాలనుండి సాయుధపోరాటాన్ని కొనసాగిస్తున్నారు. మొట్టమొదటిసారిగా శ్రీకాకుళం జిల్లాలో నక్సల్‌బరీ పంథాలో సాయుధ పోరాటం జరిగింది. నక్సల్‌బరీ వెన్వెంటనే వచ్చిన ఆ ఉద్యమాన్నే టీజింగ్ రేడియో భారతదేశంలో వ్యవసాయక విప్లవం వచ్చేసిందని వ్యాఖ్యానించటం జరిగింది.

1969 శ్రీకాకుళం ప్రాంతంలో జరిగిన ఈ సాయుధ ఉద్యమం అంతర్జాతీయంగా దృష్టి నాకర్షించగలిగింది. 1948లో తెలంగాణా సాయుధపోరాటం సందర్భంగా నల్గొండ ప్రాంతాలు విముక్తి పొందాయని అనుకున్నట్లుగానే, 1969లో శ్రీకాకుళం ప్రాంతంకూడా విముక్తి పొందిన ప్రాంతంగా నక్సలైట్లు భావించారు. అయితే శ్రీకాకుళం ప్రాంతంలో జరిగిన సాయుధ పోరాటాన్ని ఆనాడు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చాకచక్యంగా అణచివేయగలిగాయి. 1970లో బొరికొండల్లో ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యనారాయణలను పోలీసులు హతమార్చటంతో నక్సలైట్లు అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోవటం, కొంతకాలం తమ కార్యకలాపాలను నిలుపుజేయటం జరిగింది. శ్రీకాకుళం, ఖమ్మం జిల్లాలకే పరిమితమైన ఆ కార్యకలాపాలను తరువాత రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించి కొనసాగించటం జరుగుతూంది.

మావోయిస్టు, చారుమజుందార్ ఆశయాలతో ప్రభావితులైన నక్సలైట్లు ప్రస్తుతం అనేక ముఠాలుగాను, గ్రూపులుగాను విడిపోయి వున్నారు. మన రాష్ట్రంలోనే 12 తీవ్రవాద గ్రూపులు వున్నాయని తెలుస్తుంది. వీటిలో నాలుగు చురుకుగా పనిచేస్తున్నాయి. చండ్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, పైలా వాసుదేవరావు, రవూఫ్, నాగిరెడ్డి స్థాపించి UCCRI (M L), లిన్‌పియావో వర్గాలుగా అవికొనసాగుతున్నవి. అన్ని గ్రూపులకంటె కొండపల్లి సీతారామయ్య 'పీపుల్స్ వార్' గ్రూపు శక్తివంతమైనదని, అటవీ ప్రాంతాలలో జరిపే చర్యలు, హత్యలన్నింటికి పీపుల్స్‌వార్ గ్రూపువారే బాధ్యులని పోలీసుల కథనం. ఈ గ్రూపుకు చెందిన దళసభ్యులు ఆకువచ్చరంగు దుస్తులను ధరిస్తూ సాయుధకార్యకలాపాలు కొనసాగిస్తూంటారట !

ఈ గ్రూపులన్నిటి కేంద్ర స్థావరాలు అటవీ ప్రాంతంలో వున్నాయి. అడవులలోనే సాయుధులై సంచరించే వీరు వివిధ దళాలుగా ఏర్పడి పనిచేస్తుంటారు. ఒక్కొక్క దళానికి ఒక్కొక్క పేరు. ఈ దళాలమధ్య పటిష్టమైన 'కొరియర్' (వార్తాహరుడు) వ్యవస్థ వుంటుంది. నక్సలైట్ల కార్యకలాపాలకు మూలస్తంభాలు, జీవనాడి ఈ 'కొరియర్'లే.

రాష్ట్రంలో ఉన్న 32 లక్షలమంది గిరిజనులలో 22 లక్షలమంది గిరిజనులు శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, ఖమ్మం, కరీంనగర్, అదిలాబాద్ జిల్లాలలోనే నివసిస్తున్నారు. నక్సలైట్లు గిరిజన ప్రాంతాలలోనే తమ కార్యకలాపాలను ఎక్కువగా సాగిస్తుంటారు. వీరు గిరిజనులకు అండగా నిలబడి వారి భూములు, ఇళ్ళు, భూస్వాముల, నిరంకుశ అధికార్ల, వడ్డీ వ్యాపారస్తుల, దళారుల చేతుల పడకుండా, విచ్చలవిడి బోపిడి సాగకుండా కాపాడుతామంటారు.

గిరిజనులలో హెచ్చుశాతం నిరక్షరాస్యులు, పీడితులు అగుటచేత వీరి సిద్ధాంతాలు, కార్యకలాపాలపట్ల తేలిగ్గా ఆకర్షించబడుతున్నారు. మన రాష్ట్రంలో ముఖ్యంగా వరంగల్, అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాలలో వీరి కదలికలు, దాడులు కనిపిస్తాయి. అలాగే పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్ జిల్లాలలోను, ఒరిస్సాలోని కోరాపుట్, గంజాం జిల్లాలలోను, మధ్యప్రదేశ్‌లోని బస్తర్ జిల్లాలోను వీరి స్థావరాలు ఎక్కువగా వున్నాయి. నిరక్షరాస్యులైన గిరిజనుల మద్దతుమీద, భూమిలేని నిరుపేదలమీదే వీరు ఎక్కువగా ఆధారపడి వున్నారు. రాష్ట్రం మొత్తంమీద వీరు సుమారు ఐదువేల వరకు ఉంటారని, వీరిలో 500 మంది పేరుమోసిన తీవ్రవాదులని పోలీసుల అంచనా.

దాదాపు 50 పైగా దళాలు వివిధ పేర్లతో అడవులలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయని, దళాలలో పలువురు మహిళలుకూడా ఉన్నారని పోలీసువర్గాల కథనం.

వీరు సుశిక్షితులని, తగిన ఆయుధ సంపత్తి, రక్షణ స్థావరాలు కలిగివున్నారని, తరచు పోలీసులతో జరిగే ఘర్షణలు, దాడులు, కిడ్నాప్‌లు ధృవపర్చుతున్నాయి.

గత రెండేళ్ళుగా వీరి కార్యకలాపాలను పరిశీలిస్తే రెండు విభాగాలుగా తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని పోలీసుల అభిప్రాయం.అజ్ఞాతంగా 'పోరాటం' జరిపేవారూ, ప్రజలలో బహిరంగంగా సంచరిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు ద్వారా తమ భావాలు, ఆశయాల ప్రచారం సాగించేవారూను.

రాష్ట్రంలో 1970-72 ప్రాంతంలో - 936 నేరాలు, 1983లో - 415 నేరాలు, 1984లో - 427 నేరాలు, 1985లో - 425 నేరాలకు నక్సలైట్లు పాల్పడినట్లు లెక్కలు చెబుతున్నాయి. 1985లో ఎన్నడులేని విధంగా తీవ్రవాదులకు పోలీసులకు మధ్య 37 ఘర్షణలు జరిగాయి. 1985 నుండి 1989 మే వరకు 242 - హత్యలు, 39 - దోపిడీలు, 1450 - ఇతర నేరాలకు పాల్పడటమేగాక వీరు 52 మంది పోలీసులను హతమార్చటం, 190 బస్సులు, లారీలు, జీపులు వంటి వాహనాలనుసైతం తగులబెట్టటం జరిగింది. ఇంతేగాక 15 మండల కార్యాలయాలను, 5 మైక్రోవేవ్ స్టేషన్లను, 11 టెలిఫోన్ ఎక్స్చేంజీలను, 6 రైల్వే స్టేషన్లను ధ్వంసం చేశారు.

నక్సలైట్ల దళాలు అన్నింటిలోను పెద్దదిగా అంటున్న 'పీపుల్స్ వార్' గ్రూపు దళాలవద్ద శక్తివంతమైన ఎ.కె.47 (నైనా తయారీ) రైఫిళ్లు, తుపాకులు, రివాల్వర్‌లు, గ్రెనేడ్‌లు, మందు పాతర సాదనాలు భారీగా ఉంటున్నాయి. వీరి నాయకుడు కొండపల్లి సీతారామయ్య ఉస్మానియా ఆసుపత్రి నుంచి 1984 జనవరి 4వతేదీన తప్పించుకున్న దరిమిలా పోలీసులపై దాడులు, హత్యలు ప్రారంభమయ్యాయి. 1986 లో కరీంనగర్ జిల్లా పెదపల్లి డి.ఎస్.పి. బుచ్చిరెడ్డిని, 1986 ఆగస్టు 18వతేదీన అదిలాబాద్ జిల్లాలోని అల్లంపల్లి అడవులలో పదిమంది పోలీసులను, 1987 జూలై 30న తూర్పు గోదావరి జిల్లా దారగడ్డ సమీపంలో ఆరుగురు పోలీసులను, అక్టోబరు 8వ తేదీన కరీంనగర్ ఆయుధాగారంపై దాడి జరిపి ఒక పోలీసు కానిస్టేబులును, వీరు చంపివేశారు. ఈ సంవత్సరం ప్రారంభంలోనే అదిలాబాద్ జిల్లాలోని రాజారాం ప్రాంతంలో డిటోనేటర్ల సహాయంతో పోలీసు జీపును ప్రేల్చి ఏడుగురు పోలీసులను హత్య చేశారు. అదిలాబాద్, విశాఖపట్నం జిల్లాలలో మందుపాతరలుపెట్టి పోలీసులను, ప్రభుత్వ అధికారులను హతమార్చడం జరిగింది. ఈ విధంగా తాము పోలీసులను హతమార్చటానికి బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో పోలీసులు కాల్చివేస్తుండటమే కారణమని వీరు ప్రకటనలు చేస్తుంటారు. కరీంనగర్ నాయకుడు దగ్గు రాయలింగు, మేకల నరసయ్యలను పోలీసులు చంపినందుకు ప్రతీకారంగా వీరు పలు హత్యలను, ప్రభుత్వ ఆస్తి విధ్వంసాలు జరిపారు.

ఇంతవరకూ ఇలా సాగిన నక్సలైట్ల హింసా ఉద్యమం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. అధికారులను, ప్రజా ప్రతినిధులను కిడ్నాపులు చేసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి తమ కోర్కెలను సాధించుకోడానికి ప్రయత్నిస్తున్నారు. తొలిసారిగా 1987 డిసెంబరు 28 న తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం ఏజన్సీ గుర్తేడు వద్ద ఆరుగురు ఐ.ఎ.ఎస్. అధికారులను కిడ్నాప్ చేసి, కాకినాడ, విశాఖపట్నంలలో ప్రభుత్వ బందీలుగా ఉన్న తమ అనుచరులను విడిపించుకోడంతో కిడ్నాప్‌ల పట్టం మొదలైంది. గత రెండు, మూడు మాసాలుగా మండలాధ్యక్షులను కిడ్నాప్‌లు చేసి, ప్రభుత్వాన్ని బెదిరించి పనులు జరిపించుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా కమాన్‌పూర్ మండలాధ్యక్షుడు రామచంద్రగౌడ్‌ను కిడ్నాప్ చేసి మూడు రోజుల పిదప వదిలివేసినా తాడిచర్ల మండలాధ్యక్షుడు మల్‌పాల్ రావునుకిడ్నాప్‌చేసి తమ నాయకులు అయిలయ్య, రాజమల్లుల విషయంలో ప్రభుత్వం ఉదాసీనత వహించటంతో చంపివేశారు. పిదప వరంగల్ జిల్లా నర్మెట్ట మండలాధ్యక్షుడు రాజిరెడ్డిని కిడ్నాప్ చేసి ప్రభుత్వం అయిలయ్య, రాజయ్య ఆచూకీ కోసం రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి శ్రీ టి. లక్ష్మీనారాయణరెడ్డితో కమిషన్ వేసినట్లు ప్రకటించడంతో ఏ హాని చేయకుండా విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ మండలం రామవరం వద్ద ఇద్దరు పోలీసు కానిస్టేబుల్సును పీపుల్స్‌వార్ గ్రూప్ కిడ్నాప్ చేయగా 'ప్రజాబంధు' పేరిట పౌరహక్కుల సంఘం కార్యదర్శి శ్రీ బాలగోపాల్ దీనికి ప్రతిగా కౌంటర్ కిడ్నాప్ కావటం అటు పోలీసులు, ఇటు బాలగోపాల్ ఇద్దరు క్షేమంగా విడుదల గావటం తెలిసినదే.

(మిగతా రేపటి సంచికలో)

రాష్ట్రంలో నక్సలైట్ సమస్య ప్రధాన చర్చనీయాంశంగా ముందుకొచ్చింది. ఇది కేవలం శాంతి భద్రతల సమస్య మాత్రమేకాదని, రాజకీయ, సామాజిక స్థాయిలో దీని పరిష్కారానికి కృషి జరగాలని యించు మించు ఇప్పుడు అందరూ అంగీకరిస్తున్నారు. తాజా పరిణామాల తీవ్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఒక స్థిరమయిన, స్పష్టమైన విధానంతో దీని పరిష్కారానికి చొరవ తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితిని లభ్యమవుతున్న మేరకు సమాచారం ఆధారంగా సమీక్షిస్తున్నారు. సోమేశ్వరరావ్ మన్నె.

అక్కరకు రాని విద్య ఇక వద్దు

విద్య అంటే చాలామంది పుస్తకాలను వల్లించటమని, కొందరు జ్ఞాన సముపార్జనమని, మరికొందరు పరీక్షలు పాస్ అవటమని అనుకొంటుంటారు. ఇవన్నీ ఏనుగు, ఏడుగురు గుడ్డివాళ్ళు సామెతే. విద్య అంటే కేవలం జ్ఞాన సముపార్జనే కాదు. నిజానికి అది ఒక వ్యక్తి జీవితంలో సాధించే క్రమాభివృద్ధి. కోడిపిల్లలు తల్లిని చూసి పురుగులను, ఇతర ఆహారాన్ని తీసుకోడం నేర్చుకుంటాయి. పక్షులు ఎగురుతుంటాయి. చేపలు ఈదుతుంటాయి. ఇవన్నీ క్రమ పద్ధతిలో అభివృద్ధి చెందగా వచ్చిన విద్యలు. అంటే విద్యకు మొదలు, చివర లేదు. ఉండదు కూడా!

జాతీయ జీవనంలో సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక మార్పులు తీసుకురావటానికి విద్య కేవలం ప్రేరణే కాక చాలా శక్తివంతమైన సాధనం కూడా! కాని మన విద్యావిధానం సవికిమారిసదయి, శక్తిహీనమైపోయింది. నేటి విద్య సమాజాభివృద్ధికి ఏమాత్రమూ ఉపయోగపడుటలేదు. అందుకే నేటి మన విద్యావిధానంలో అనేక సంస్కరణలు రావలసివుంది. మహాకవి శ్రీశ్రీ చెప్పినట్లు విద్యార్థులే నవ సమాజ నిర్మాతలు. అందుకే సమాజానికి లౌకికతత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సాంఘిక న్యాయాలకి విద్య దోహదవడాలి.

విద్యార్థికి అన్నిటికన్నా ముఖ్యమైనది క్రమశిక్షణ. విద్యయొక్క అంతిమ లక్ష్యం గుణం. క్రమశిక్షణ, గుణం లేని విద్య నిరర్థకం. అది గాలిబుడగ వంటిది. క్రమశిక్షణ అలవడేందుకు సమర్థవంతమైన ఉపాధ్యాయులు, మంచి స్నేహితులు, యన్.యస్.యస్., యన్.సి.సి., స్కౌటు లాంటి శిక్షణలు ఎంతో ఉపయోగకరం. ఈ సేవా సంస్థలు క్రమశిక్షణతోపాటు సేవాభావాన్ని సమకూరుస్తున్నాయి. శీల నిర్మాణంలో విద్య నిర్వహించు పాత్ర అతిముఖ్యమైనది. శీలం లేని విద్య నడిసంద్రంలో తుపాను మధ్య చుక్కాని లేకుండా నడిచే నావతో సమానమని చెప్పవచ్చును. నేటి విద్యార్థులు పెద్దలయెడ, ఉపాధ్యాయులయెడ సమాజంపట్ల ఏమాత్రం బాధ్యత, గౌరవం చూపుటలేదు.

లాలాలజపతిరాయ్ చెప్పినట్లుగా రాజకీయాలకతీతంగా విద్యార్థులేమీ సాధించలేరు. విద్యార్థులు రాజకీయాలు తెలుసుకొని మంచి రాజకీయాలు చెయ్యాల్సిందే! కాని నేటి కూటమి రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం విద్యాలయాల్లో విద్వేష బీజాలు నాటి విద్యా వాతావరణాన్ని కలుషితం చేసి విద్యార్థుల, జాతి భవిష్యత్తును అంధకారబంధురం చేస్తున్నారు.

ఇక సిలబస్‌ల విషయానికొస్తే నేటి పాఠాలు విద్యార్థుల స్థాయిని మించి ఉండుట, తమ జీవితావసరాలకూ, సమాజానికీ ఏమాత్రం ఉపయోగపడని పాఠాలుండటం, యల్.కే.జి. విద్యార్థులపై కూడా కేజీలకొద్దీ సిలబస్‌లను రుద్దటం మూలంగా విద్య అర్థమే మారిపోతోంది. అందుకే "కాన్వెంటు బళ

తెలుగుసారాపై ఎన్నికలప్రభావం?

గుంటూరు, సెప్టెంబరు 12 (నవవార్త): సారాదుకాణాలవారి లైసెన్సులు మంజూరు, వేలంపాటల విధానంప్రకారం జిల్లాలోగల 762 వారుణవాహిని దుకాణాలకు స్థానిక వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో తోరుగా వేలంపాటలు జరుగుతున్నాయి. పూర్వం జిల్లాలోని దుకాణాలన్నింటికి ఏ కొద్దిమంది పెట్టుబడిదారులో పాడుకొని కోట్లు ఆర్జించారు. అయితే గత ఏడాది నుండి దుకాణాలవారి వేలం విధానం ప్రవేశ పెట్టారు. గత సంవత్సరం కన్నా ప్రస్తుతం దుకాణాలకోసం పెద్ద సంఖ్యలో పోటీ పడటం, వారిలో కొందరు మండలాధ్యక్షులు, ఎం.ఎల్. ఏలు, రాజకీయ నాయకులు భవిష్యత్తులో పార్లమెంటు, అసెంబ్లీ సీట్లు కోరుకొంటున్న వ్యక్తులు, లేదా వారి అనుచరులు కనబడుతున్నారు.

కొద్ది కాలంలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటమే ఈ పోటీ ప్రభావమని తెలుస్తోంది. దీనివలన ఎక్సైజ్ అధికారులు ఊహించనిదానికన్నా ఎక్కువ ఆదాయం వస్తున్నది. గుంటూరు పట్టణ, రూరల్ మండలంలోని 71 దుకాణాలకుగాను 21 దుకాణాలకు వేలం జరగ్గా కోటి 75 లక్షలు లభించింది. గత ఏడాదికన్నా రు. 40 లక్షలు అదనంగా వచ్చింది. ఈ 21 దుకాణాలకు మినిమమ్ గ్యారంటీ కోటా 2.77 లక్షల లీటర్లను నిర్ణయించగా కంట్రాక్టర్లు పోటీపడి 3.19 లక్షల లీటర్లకు పెంచారు.

గత ఏడాది జిల్లా మొత్తంపై ప్రివిలేజ్ ఫీజుద్వారా రు. 19 కోట్ల ఆదాయం సమకూరగా, ఈ ఏడాది 21.76 కోట్లు ఆదాయం సమకూరే అవకాశాలున్నాయి. గత ఏడాది జిల్లాలో 41.75 లక్షలు లీటర్ల సారాను విక్రయించారు. ఈ ఏడాది ప్రివిలేజ్ ఫీజును రు. 45 నుండి రు. 50 కి పెంచారు.

పంచాయితీ జనాభాను బట్టి, మండలం, పట్టణాన్నిబట్టి లీటరు సారాపై వసూలుచేసే ధర మారుతున్న దృష్ట్యా సారా ప్యాకెట్లు విచ్చలవిడిగా ప్రాంతాలు మారుతున్నట్లు, వారికి కొందరు ఎక్సైజు అధికారుల ఆశీస్సులున్నట్లు తెలుస్తోంది.

గత సంవత్సరంకంటే ఈసారి ఎవరెక్కువగా అమ్మగలిగితే వారికే దుకాణం లభిస్తుంది. జిల్లాలో దుకాణలకు లైసెన్సులు రెండు వేల నుండి 25 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాది నిబంధనల ప్రకారం గుంటూరులో ఒక కి.మీ లోపువరకు సారా దుకాణం పెట్టుకోవటానికి రు. 25 వేలు, పెద్దపంచాయితీలకు 10 వేలు, చిన్న పంచాయితీలకు 5 వేలు, 2 వేలు లైసెన్సుకోసం చెల్లించవలసి ఉంటుంది.

సారా వ్యాపారంలో ఏక చత్రాధిపత్య ధోరణులను, బడా వ్యాపారులను తొలగించి, నిరుద్యోగ సమస్యను నివారించే విధంగా సారా దుకాణాలకు విడిగా లైసెన్సులు మంజూరు చేయాలని సంకల్పించినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

గ్రామ సింహాలు, బడాకంట్రాక్టర్లను కాదని, నిరుద్యోగులు పెద్దమొత్తాల్లో డిపాజిట్లు చెల్లించి షాపు తెరచినా ఎంతకాలం నడుపగలడో మనకి తెలిసినదే. ప్రస్తుతం పాత కంట్రాక్టర్లే బినామీ పేర్లతో దుకాణాలను పాడుకోవటం కనిపించింది.

మలేషియా బృందం ఆస్పత్రి సందర్శన

గుంటూరు, సెప్టెంబరు 12 (నవవార్త): మలేషియా ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖకు చెందిన మంత్రిత్వశాఖ డైరెక్టర్ డాక్టర్ అబ్దుల్లా బిన్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని, వైద్య కళాశాలను సందర్శించింది.

ఈ ప్రతినిధి బృందంలో మలేషియా జాతీయ విశ్వవిద్యాలయం మెడికల్ విభాగం డీన్ ఆచార్య డాక్టర్ మహ్మద్‌బిన్, మహ్మద్ మార్, డాక్టర్ మహ్మద్ రెయిలానీ, అబ్దుల్‌మజీద్ ప్రభృతులు సభ్యులుగా వున్నారు. ఇక్కడి ఎం.బి.బి.ఎస్. కోర్సుతో సంబంధాలు ఏర్పాటు చేసుకోవటానికి ఈ ప్రతినిధి బృందం వచ్చింది.

ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. సరోజినీదేవి, ఆర్. ఎం. ఓ. డాక్టర్ ఎస్. వి. కృష్ణారావు, డాక్టర్ జాన్ అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రబాబు వారి వెంటవున్నారు.

వడ్డెర సంక్షేమసంఘ నూతన కార్యవర్గం

గుంటూరు సెప్టెంబరు 12 (నవవార్త): స్థానిక వడ్డెర సంఘ కార్యాలయంలో శ్రీ తిరుమలకొండ అంకాళ్ళు అధ్యక్షతన జరిగిన వడ్డెర సంక్షేమ జిల్లా సంఘం ఎన్నికలలో అధ్యక్షునిగా డాక్టర్ బండారు మోహనరావు, ఉపాధ్యక్షులుగా ఓర్సు చినరాములు, శ్రీ అబ్బ సాంబయ్య, శ్రీ వల్లెపు ముసలయ్య, శ్రీ తమ్మిశెట్టి బసవరాజు, ప్రధానకార్యదర్శిగా శ్రీ వి. శివనాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా శ్రీ చంద్రగిరి ఏడుకొండలు, శ్రీ తమ్మిశెట్టి నరసింరాజు, శ్రీ ఉప్పు వెంకటేశ్వర్లు, అర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీ మల్లె శంకరరావు, కోశాధికారిగా శ్రీ అంకాళ్ళు ఎన్నికైనారు.

దక్షిణ రైల్వే

స్క్రాప్ సామగ్రి అమ్మకం

పెర్లస్, నాన్‌ఫెర్లస్ స్క్రాప్, నిరుపయోగమైన వాగన్లు, కోచెస్, లోకోమోటివ్‌లు, స్క్రాప్, రెయిల్స్, స్లీపర్లు, స్టీల్ ప్లేట్స్, గర్డర్లు, బోరింగ్ అండ్ టర్నింగ్స్ మెల్టింగ్ సామగ్రిని ఈ క్రింది కార్యక్రమం ప్రకారం వివిధ డిపోలలో వేలం వేయబడును.

4-10-89	అశోక్‌పురం, మైసూరు	500 మె.ట. సుమారు
12-10-89	పాన్‌మాలై, తిరుచ్చి	1500 మె.ట. సుమారు
18-10-89	పెరంబూర్ జనరల్ స్టోర్స్‌డిపో	2000 మె.ట. సుమారు
25-10-89	హెడ్‌క్వార్టర్స్ ఆఫీస్ స్టోర్స్ బ్రాంచి, అయినావరం, మద్రాసు-600 023.	2000 మె.ట. సుమారు

ఇతర వివరాలకు సంప్రదించండి :

1) మెస్సర్స్ గల్లీ అండ్‌కో, నెం. 1 జనరల్ పాటర్స్ రోడ్, మౌంట్‌రోడ్, మద్రాసు-600 002. (టెలిఫోన్ నెం. 839324)

2) ది సీనియర్ స్టోర్స్ ఆఫీసర్/Rm ఆఫీస్ ఆఫ్ ది కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్, అయనావరం, మద్రాస్-600 023. ఫోన్ : 618387.

Pub. 4/1/A/10/377/7-9-89

నగరపాలక సంస్థ- విశాఖపట్టణం

షార్టు టెండరునోటీసు నెం./5776/EE-II/89-90

ఆర్.సి.నెం. /5776/EE-II/89-90, తేది 11-9-89

1. విశాఖపట్నం నగరపాలక సంస్థ కమీషనరుగారు ఈ దిగువ పేర్కొనబడిన పనులకు సీలు వేసిన టెండర్లు తేది 30-9-89 సాయంత్రం గం. 3-00ల వరకు తీసుకొని అదే తేది సాయంత్రం గం. 3.30ని.లకు వారుగాని, వారిచే అధికారము పొందినవారుగాని, నగరపాలక సంస్థ కార్యాలయమునందు టెండరుదారుల సమక్షమున తెరువబడును. టెండరు తెరచురోజు సెలవురేజు అయినచో ఆ మరుసటి దినమున టెండర్లు తెరువబడును, మరల అట్టి టెండరులను సమకాలములో చేరునట్లు భావించబడును.
2. టెండరు షెడ్యూలు ధర రిఫండు రాదు, ఇంకొకవనికి సర్దుబాటు కాదు.
3. టెండరు ధరావత్తు సొమ్ము నగరపాలక సంస్థ ట్రెజరీలోనే తేది 29.9.89 లోగా చెల్లించి టెండరుతోజతపర్చవలెను. డిమాండు డ్రాఫ్టులు, చెక్కులు, అంగీకరించబడవు.
4. టెండరు షెడ్యూలు ఫారం ఖరీదు చెలానా ద్వారా సై సంస్థ ట్రెజరీలోనే చెల్లించవలెను.
5. కమీషనరుగారుగాని, స్థాయీ సంఘము అధ్యక్షులుగాని ఏ టెండరునైనా, ఏ కారణము ఉదహరించకనే పాక్షికంగాగాని, పూర్తిగాగాని, తిరస్కరించే అధికారము పొందుయున్నారు.
6. టెండరు రేట్లు అక్షరములలోనూ, అంకెలలోనూ వివులముగా వ్రాయవలెను.
7. ఇతర వివరముల కొరకు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్II వారిని, ఆఫీసు పనివేళలో సంప్రదించవలెను.
8. టెండరు షెడ్యూలు సప్లయి తేది 25.9.89 నుండి 26.9.89 వరకు.
9. టెండరు షెడ్యూలు దరఖాస్తు తీసుకొను ఆఖరి తేది 23.9.89
10. జి.ఓ.నెం. 633, ఎం.ఎ. తేది 10.7.73ది ప్రకారము నమోదయిన కాంట్రాక్టర్లు మాత్రమే అర్హులు.
11. కార్పొరేషన్‌గాని, టెండరు ఆమోదించు అధికారిగానీ, అవసరమని భావించినయెడల కాంట్రాక్టు మొత్తములో 5శాతము నుండి 10శాతము వరకు అదనపు ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. అనగా ఈ క్రింది వివరించిన పట్టికలోని 5 వ కాలమునకు బదులుగా ఈ అదనపు ధరావత్తు సకాలములో చెల్లించనియెడల ఇ. యం.డి. సొమ్ము కార్పొరేషన్ నిధులకు జమ చేయబడును. తిరిగి యివ్వబడదు.
12. నూతన స్తోమత పత్రములు మరియు, ఇన్‌కంటాక్స్ సర్టిఫికేట్‌ను జి. ఓ. నెం.633/ఎం.ఎ., తే. 10-7-1989ది ప్రకారము దాఖలు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే షెడ్యూలు ఇవ్వబడును.
13. కాంట్రాక్టు తీరు ఎల్.ఎస్.

పనుల పట్టిక

వ. నెం.	పని పేరు	అంచనా మొత్తం	ఇ.యం.డి. $2\frac{1}{2}$ శాతం రూ.లు	ఎ.ఎస్.డి. $2\frac{1}{2}$ శాతం రూ.లు	టెండరు ఫారము ఖరీదు రూ.లు	అర్హులైన కాంట్రాక్టర్ల తరగతి	పని పూర్తి చేయవలసిన కాలము
1)	వీధి దీపముల నిర్వహణ కొరకు 40వాట్టుల కాపర్ చోకులు సప్లై మరియు డెలివరి చేయు నిమిత్తము	1,38,600.00	3465.00	3465.00	100.00	నాణ్యమైన సంస్థల నుండి	10రోజులు
2)	ఎక్స్‌టెన్షన్ టైపు అల్యూమినియం లాడర్స్ సప్లై మరియు ఫిక్సింగ్ చేయు నిమిత్తము	92,000.00	2300.00	2300.00	50.00	,,	15రోజులు
3)	నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయమునకు 100కె.వి.ఎ. డీజిల్ జనరేటర్ సప్లై మరియు డెలివరి చేయు నిమిత్తము.	3,50,000.00	8750.00	8750.00	200.00	నాణ్యమైన అనుభవం గల సంస్థల నుండి	15రోజులు

(సం.). . . . . .

కమీషనరు తరపున

నగరపాలక సంస్థ, విశాఖపట్నం

Printed and Published for Nageswara Rao Estates Ltd., by *S. Nageswara Rao*, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-520 003, Editorial Adviser: *S. Radhakrishna*, Editor: *G. Sreeramamurty*, (Vijayawada), Phones: Business: 61247, 61248, Editorial: 75667.

టీచర్ చేసిన అవమానానికి విద్యార్థిని బలి

నెల్లూరు, సెప్టెంబరు 12 (నవవార్త): విద్యార్థులకు చదువు-సంస్కారం నేర్పవలసిన ఉపాధ్యాయుడే సంస్కారహీనంగా ప్రవర్తించి ఒక విద్యార్థిని ప్రాణం తీసిన ఉదంతం తెలిసింది.

నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలంలోని మహమ్మదాపురం గ్రామంలోని హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న చందా అనిత (14) అనే విద్యార్థినికి స్కూలుకు ఒక వుత్తరం వచ్చిందట. పోస్టుమ్యాన్ ఆ వుత్తరాన్ని బట్వాడా చెయ్యగానే ఒకరికి వచ్చిన వుత్తరాన్ని మరొకరు చూడకూడదని తన పాఠాల్లో బాగంగా నేర్పవలసిన ఉపాధ్యాయుడు అనిత తన బంధువులు వ్రాసిన వుత్తరమని చెబుతున్నా వినకుండా క్లాసురూంలో ఆ వుత్తరాన్ని చింపి చదివి తోటి విద్యార్థినుల ముందు అవహేళన చెయ్యడంతో, తనకు జరిగిన అవమానాన్ని భరించలేక హాస్టల్ బావిలో దూకి ఆత్మహత్య చేసుకొందని ఆ బాలిక తండ్రి జిల్లా పోలీసు సూపరింటెండెంటుకు, జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ బాలికకు వచ్చిన ఆ వుత్తరం ఆమె బావ వ్రాసాడని, తన కుమార్తెకు జరిగిన విధంగా మరో బాలికకు జరక్కుండా ఉపాధ్యాయుడిని శిక్షించాలని కూడా వారు కోరారు.

ఆ గ్రామ సర్పంచ్ ఫిర్యాదును పురస్కరించుకొని కేసు దర్యాప్తు ప్రారంభించారు.

శీలాన్ని శంకించి భార్యహత్య

నెల్లూరు, సెప్టెంబరు 12 (నవవార్త): ఒక శాడిస్టుకు భార్య అయిన పాపానికి భర్తచేత అతి కిరాతంగా, పాశవికంగా హత్యగావించబడిన ఒక ఇల్లాలు ఉదంతం వెలుగులోకి వచ్చింది.

నెల్లూరు జిల్లా, ఎ.యస్.పేట మండలంలోని హసనాపురం గ్రామంలో వల్లేరు పెద్ద నరశింహులు అనేవ్యక్తి తన భార్య ధనమ్మ (22) శీలాన్ని శంకించి, ఆమెను నిత్యం హింసిస్తూ ఉండేవాడు. ఓరోజు ఏకంగా హత్యచేసి కసితీర్చుకున్నట్లు ఆత్మకూరు సి. ఐ. శ్రీ ధనరాజ్ తెలియజేసారు.

హత్యగావించబడ్డ రోజు ఇరువురు చిన్న గొడవపడ్డారని, ఆదమరిచి నిద్రిస్తున్న ధనమ్మను నరశింహులు కత్తితో పొడిచి అంతటితో ఆగక ఆమె శరీర భాగాల్ని కత్తితో కోసివేసాడని కూడా ఆయన చెప్పారు. నరశింహులు మొదటి భార్య గతంలో నరశింహులు పెట్టిన చిత్రహింసలు తట్టుకోలేక మరణించిందని, ఇప్పుడు మృతిచెందిన ధనమ్మ అతనికి రెండవ భార్య అని సి.ఐ. వివరించారు.

నరశింహులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచగా అతన్ని ఈనెల 22వ తేదివరకు రిమాండ్‌లో ఉంచమని న్యాయమూర్తి ఆదేశించారు.

లారీఢీకొని పూలవ్యాపారిమృతి

నెల్లూరు, సెప్టెంబరు 12 (నవవార్త): కావలిలో జాతీయ రహదారిపై మురళీకృష్ణ హోటల్ సమీపంలో రాత్రి 1 గంట సమయంలో భాదర్‌భాష (33) అనే పూలవ్యాపారి లారీ క్రిందపడి మృతిచెందాడు. గొర్రెల్ని మద్రాసుకు వేగంగా తీసుకువెళుతున్న లారీ అతన్ని ఢీకొని వెళ్ళిపోయింది.

లారీ నెంబరు చూసిన ఒకవ్యక్తి పోలీసుస్టేషన్‌లో విషయం తెలియజేయగా కావలి పోలీసులు నెల్లూరుకు తెలియజేయగా లారీని నెల్లూరులో పట్టుకొన్నట్లు తెలియవచ్చింది.

దిగుడుబావి నీళ్లే దిక్కు

ఉదయగిరి, సెప్టెంబర్ 12 (నవ వార్త): సీతారామపురం మండలం శింగారెడ్డిపల్లె గ్రామ పంచాయతీలోని నాంచారమ్మపల్లె ప్రాంతంలో ఉన్న బోరు 12 రోజుల నుండి పని చేయకపోవడం వలన ఆ గ్రామస్తులు పూర్వపు దిగుడుబావికి యధావిధిగా అర మైలుదూరం కాలి నడకన వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నారు. వెంటనే ఆ గ్రామంలో పాడైపోయిన బోరును రిపేరు చేయాలని సర్పంచ్ గోరంట్ల చిన్న తిరుపాలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాంతానికి వున్న బోర్ మెకానిక్ బదిలీ కావడంతో కొత్త మెకానిక్‌ను నియమించనందున ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. శింగారెడ్డి పల్లె హరిజనవాడలో వున్న ఒకే ఒక బోరు పూర్తిగా పోవడం వలన అక్కడి వారు మంచినీటి కోసం చాలా బాధపడుతున్నారు. వెంటనే కొత్త బోరు వేయాలని ఆయన కోరారు.

డాక్టర్‌ను నియమించండి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాపించి ఇప్పటికి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇంత వరకు శాశ్వత భవనం లేదు. ఆరోగ్య కేంద్రానికి ఆరు నెలలుగా రెగ్యులర్ డాక్టర్ లేరు. మారుమూల ప్రాంతమైనందున ప్రైవేట్ డాక్టర్లు కూడా లేరు. అత్యవసర కేసులు మాడవలసినప్పుడు ఇక్కడ నుంచి దాదాపు 70కి.మీ. పోవలసి వస్తోంది. ఇప్పుడు డిప్యూటేషన్‌పై డాక్టర్‌ను నియమించారు. వారు కూడా విధులకు సక్రమంగా రావటం లేదు. హాస్పటల్ భవనం కూడాప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రమైన ప్రసూతి సహాయకురాలు భవనం నందు నడుపుతున్నారు. ఇది చాలా ఇరుకుగాను, ప్రజలకు కనీసం ఒక పూట ఉండుటకు వీలు లేనంత చిన్నదిగా ఉండుట వలన ఇటు అధికారులకు, అటు ప్రజలకు ఇబ్బందికరంగా వున్నది. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం చేపట్టవలసినదిగా కోరుచున్నారు.

స్వామి శివానంద 102వ జయంతి

రాజోలు, సెప్టెంబర్ 12 (నవ వార్త): రాజోలులోని దివ్య జీవన సంఘం వారు శ్రీ స్వామి శివానంద 102వ జయంతి సందర్భంగా అన్నదానం వస్త్రదానం చేశారు.

ఈ సందర్భంగా పురమందిరంలో రాజోలుసంఘ అధ్యక్షుడు శ్రీ రుద్రరాజు రామరాజు అధ్యక్షతన సభ జరిగింది. నిడదవోలు కళాశాల ఆంగ్లోపన్యాసకులు శ్రీ మహంకాళి సుబ్రహ్మణ్యం, శ్రీ స్వామి శివానంద అనుభూతి, దివ్యశక్తులు ఆయన రచించిన పుస్తకములు సమీక్షించారు. శ్రీ గ్రంధి అమ్మిరాజు అచ్చొత్తించిన నారద గాన రామాయణ పుస్తకమును శ్రీ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించి శ్రీ రామదూతం శిరసాన మామి పుస్తకములతో పాటు పంచిపెట్టారు. ఆచార్య శిరోమణి శ్రీ జె. వి. సుబ్బారావు శ్రీ విఠల్‌కృష్ణ, శ్రీ పోచిరాజు పేర్రాజు స్వామి శివానంద ప్రవచనములను వివరించి వారిని అవతార పురుషులుగా అభివర్ణించారు. సంఘ కార్యదర్శి శ్రీ దేవిశెట్టి వీరభద్ర సుబ్రహ్మణ్యం వందన సమర్పణ చేశారు.

ఇన్స్యూరెన్స్ వారోత్సవాలు

జీవిత బీమా సంస్థ రాజోలు బ్రాంచిలో ఇన్స్యూరెన్స్ వారోత్సవాల సందర్భంగా జరిగిన బహిరంగ సభకు బ్రాంచి మేనేజర్ శ్రీ మారెళ్ళ సత్యనారాయణశర్మ అధ్యక్షత వహించారు. రాజోలు సబ్ జడ్జి ఖాదర్ మొహిద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల స్థాయి విద్యార్థుల మధ్య జరిపిన వ్యాస రచన పోటీలో విజేతలైన బి. శ్రీనుబాబు, టి. మూర్తి కె. ప్రకాశలకు ముఖ్య అతిథి బహుమతులను అందజేశారు. శ్రీ ఎన్. రమణరాజు మాట్లాడారు.

కోనేరుకు పదవి: పలువురి హర్షం

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 12 (నవ వార్త): శ్రీ కోనేరు నాగేశ్వరరావుకు చిన్న నీటిపారుదల శాఖ మంత్రి పదవి లభించినందుకు బూర్గంపహాడ్, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం వెలిబుచ్చారు.

తెలుగురైతు అధ్యక్షుడు శ్రీ దుద్దికూరి లక్ష్మయ్య, బూర్గంపహాడ్ మండలాధ్యక్షుడు శ్రీ నెట్టెం ప్రకాశరావు, బూర్గంపహాడ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ దుగ్గిరాల గాంధీరెడ్డి, కుక్కునూరు మండలాధ్యక్షుడు, శ్రీకుచ్చెర్లపాటి రామకృష్ణంరాజు వేలేరుపాడు మండల తెలుగుదేశం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీతాటి వెంకటేశ్వర్లు, శ్రీ దుద్దుకూరి రామచంద్రరావులు హర్షం వెలిబుచ్చారు.

రోజ్‌గార్ నిధులు దుర్వినియోగం

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 12 (నవవార్త): బూర్గంపహాడ్ గ్రామపంచాయతీలో రోజ్‌గార్ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, నిధుల ఖర్చుల గురించి సరిఅయిన అధికార అజమాయిషీ లేకపోవటంతో సర్పంచ్ ఆయన ఇష్టం వచ్చినట్లు ఖర్చుపెడుతూ, అవినీతికి పాల్పడుతున్నారని గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు శ్రీ కైపు పాపిరెడ్డి ఆరోపించారు.

రోజ్‌గార్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను గ్రామ సర్పంచ్, రోజ్‌గార్ కమిటీ సభ్యులు దుర్వినియోగం చేస్తున్నారని, గ్రామంలోని మంచినీటి పథకం విస్తరణ కోసం ఇటీవల భద్రాచలంలోని ఐరన్‌షాపు కాంట్రాక్టు ద్వారా విజయవాడనుండి అంగుళంవ్యాస పైపు గొట్టాలు 600 మీటర్లు కొనుగోలు చేశారు. కాగా వాటి ఖరీదు ఒక మీటరు రు.70లచొప్పున 600 మీటర్లు రు. 42వేలకు కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపారు. కానీ ఇనుప పైపులు భద్రాచలంలో ఒక మీటరు ఖరీదు రు.39లనుండి రు.45ల వరకు ఉందని అన్నారు. తెచ్చిన పైపులు అతితక్కువ నాసిరకం పైపులు అనీ, పైపుల కొనుగోలులో గ్రామ పంచాయితీ అధ్యక్షుడు, రోజ్‌గార్ మెంబర్‌లు కలిసి 15వేల రూపాయలనుండి 18వేల రూపాయల వరకూ దుర్వినియోగం చేశారని అన్నారు.

మధ్యపాన మత్తులో వార్డెన్ మృతి

మధ్యపాన మత్తులో ముప్పిగి కుక్కునూరు మండలం, అమరవరం గ్రామంలోని యస్.సి. హాస్టల్ వార్డెన్ పి. నాగేశ్వరరావు (40) వసతిగృహంలోనే మృతి చెందాడు.

నాగేశ్వరరావు గత వారంలోజలనుండి విపరీతంగా మద్యం సేవిస్తున్నారు.

2వ విడత రోజ్‌గార్ నిధులు

పర్చూరు, సెప్టెంబరు 12నవార్త): పర్చూరు మండల ప్రజా పరిషత్‌కు "జవహర్ రోజ్‌గార్ యోజన" రెండవ దఫా విడత 26 గ్రామ పంచాయతీలకు 2 లక్షల 46వేల 963 రూపాయల నిధులను చెక్కుల ద్వారా సంబంధిత గ్రామ సర్పంచ్‌లకు అందజేసినట్లు పర్చూరు మండలాభివృద్ధి అధికారి శ్రీ కె. రామారావు తెలిపారు.

క్లయిమ్‌లు నిర్ధారణ

భూమి హక్కుల పత్రం గుర్తింపు కోసం మండలంలోని 12 గ్రామాలలో 12 వేల 900 మంది తమ దరఖాస్తులు దాఖలు చేసుకొన్నట్లు, ఇప్పటికి 2785 క్లయిమ్‌లు నిర్ధారించినట్లు అందులో గొల్లపూడి గ్రామంను పూర్తి చేసినట్లు, మాతులపాడు, దేవరపల్లె త్వరలో పూర్తి కానున్నట్లు మండల రెవిన్యూ అధికారి శ్రీ ఆర్. లక్ష్మయ్య తెలిపారు.

సెప్టెంబరు నెలకు పర్చూరు మండలం చౌక దుకాణ డీలర్లకు 30 క్వింటాళ్ళ చక్కెర, 164 క్వింటాళ్ళ బియ్యం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. పామోలివ్ ఆయిల్ మాత్రము గత నాల్గు నెలల నుండి సరఫరా చేయని కారణంను వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇవ్వలేదని తెలిపారు.

కృష్ణయ్యకు సన్మానం

ఇంకొల్లు, సెప్టెంబరు 12: (నవవార్త) : స్థానిక ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పర్చూరు ప్రాంత ఉప విద్యాధికారి శ్రీ పులి వీరయ్య పాల్గొన్నారు. స్థానిక ప్రధానోపాధ్యాయుడు శ్రీ పి. వెంకటేశ్వర్లు సమావేశంకు అధ్యక్షత వహించారు.

పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు శ్రీ కందిమళ్ల కృష్ణయ్యను శ్రీ పులు వీరయ్య సన్మానించారు.

అధిక మార్కులు పొందిన కొల్లూరి సరళ, పూసపాటి చంద్రశేఖర్, కె. రాజశేఖర్‌తిలక్, తూమాటి విజయలక్ష్మిలకు రు. 116 చొప్పున క్లబ్ చైర్మన్ జె. ఈదర కృష్ణమూర్తి నగదు బహుమతి అందజేశారు. కార్యదర్శి సత్య నారాయణ జ్ఞాపికలను అందజేశారు.

ఇంకొల్లు మండల సమావేశంలో ఉద్రిక్తత

ఇంకొల్లు, సెప్టెంబర్ 12 (నవ వార్త): ఇంకొల్లు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఉద్రిక్తత వాతావరణంలో ప్రారంభమయింది. సమావేశంకు మండలాధ్యక్షుడు శ్రీ భవనం శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఒక దినపత్రికలో స్థానిక సర్పంచ్‌పై మండలాధ్యక్షుడు చేసిన ప్రకటనపై స్పందించిన సర్పంచ్ శ్రీ కొట్లూరు నాయుడమ్మ పేపరులోని ప్రకటనను మండలాధ్యక్షునికి చూపిస్తూ దీనిపై వివరణ చెప్పాలని నిలదీశారు. దీనిపై ఇక్కడ వివరణ చెప్పవలసిన అవసరం లేదని, నా గదిలోకి వచ్చి మాట్లాడాలని శ్రీ శ్రీనివాసరెడ్డి అన్నారు. చాటుగా మాట్లాడవలసిన అవసరం లేదని ఈ సమావేశంలోనే తెలపాలని ఇలాంటి వార్తలు వ్రాయిస్తే నేనూరుకోను తేలుస్తానని సర్పంచ్ నాయుడమ్మ అన్నారు. దీనిపై ఆగ్రహించిన మండల ఉపాధ్యక్షుడు శ్రీ గోరంట్ల కోటయ్య నీవు తేలచేదానికి 24గంటలూ రెడీగా వున్నామని ఆవేశంగా అన్నారు.

పత్రికల వారున్నారు గమనించి మాట్లాడడండని నాగండ్ల సర్పంచ్ శ్రీ రావిపూడి వెంకటాద్రి హెచ్చరించారు. సమావేశంలో ప్రశాంతత నెలకొంది, రోడ్ల నిర్మాణ విషయం చేపట్టారు.

ఈ రోజ్‌గార్ నిధులతో ఏ రోడ్డు వేయాలో అర్థం కావటం లేదని ఇటుకలపాడు సర్పంచ్ శ్రీ జి. కోటయ్య అన్నారు.

గ్రావెల్ రోడ్లువేయాలని చెప్పిన అధికారులు ఇప్పుడు మెటల్ రోడ్లు వేయాలనడంపట్ల సర్పంచ్‌లు విరసన తెలిపారు.

దుద్దుకూరు సర్పంచ్ శ్రీ నల్లూరి సుబ్బారావు, కొనికి సర్పంచ్ శ్రీ గట్టు చింపిరయ్య మాట్లాడారు.

స్వప్రయోజనాలకు అధికారదుర్వినియోగం

గూడూరు, సెప్టెంబర్ 12 (నవ వార్త): ప్రభుత్వాలు తమ స్వప్రయోజనాల కోసం, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాయని బి.జె.పి. గూడూరు పట్టణ శాఖ అధ్యక్షులు కె. వెంకట సుబ్బయ్య ఆరోపించారు. కొన్ని రాజకీయ పార్టీలు చేపడుతున్న స్వార్థపూరిత ఉద్యమాల వల్ల ప్రజాస్వామ్యానికే ముప్పు ఏర్పడే ప్రమాదముందని ఆయన అన్నారు. ఇటీవల దేశంలో జరుగుతున్న బంద్‌లు, పార్లమెంటులో జరుగుతున్న అవాంఛనీయ సంఘటనలు చూస్తుంటే ప్రజాస్వామ్యంపై ప్రజలు నమ్మకం కోల్పోయే విధంగా నాయకులు ప్రవర్తిస్తున్నారని ఆయన విమర్శించారు. బంద్‌లు విరమించాలని కోరారు.

పిడుగుపాటుకు కన్నుపోయింది

చిల్లకూరు మండలం తొణూకుమాల గ్రామంలో ప్రాథమిక పాఠశాలపై పిడుగు పడగా భవానీ శంకర్ (9) అనే బాలుడి కుడి కన్ను చూపు కోల్పోయింది. ఉడతా వారిపాలెం గ్రామానికి చెందిన ఈ బాలుడు టైలర్ వద్దకు వెళుతూ దారిలో వర్షం పడడంతో పాఠశాలల్లోకి వెళ్లాడు. దానిపై పిడుగు పడడం వల్ల ఆ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడని చిల్లకూరు ఎం.ఆర్.ఓ. తెలిపారు. అయితే అదే పాఠశాలలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

దిక్కు తోచని స్థితిలో రైతు

బూర్గంపహాడ్, సెప్టెంబర్ 12 (నవ వార్త): ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన బూర్గంపహాడు, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో తమ పొలాల్లో పరినాట్లు కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గత రెండు నెలల్లో సంభవించిన వరదలు వర్షాల వలన తిరిగి రైతులు కోలుకోక ముందే మళ్లీ ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన కొన్ని వందల ఎకరాలలో వరి పైరులు దెబ్బ తిని కొట్టుకుపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలలో మొదటిసారి వరదలకు, పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. రెండవసారి నాటిన వరిపైర్లు కూడా తిరిగి కొట్టుకుపోయాయి. బూర్గంపహాడ్ మండలంలో రెండుసార్లు గోదావరి, వరదలు భారీ వర్షాల వలన మూడవసారి నాటిన వరిపైర్లుకొట్టుకు పోయాయి. ఏదో విధంగా పంటలు పండకపోతా

ఎదురుమొండి పైపుల ప్రాజెక్టు వంప్ హౌస్ నిర్మాణం పూర్తవుతోంది.


సముద్రంలోగుండా పూర్తైన జలగర్భ పైపుల ప్రాజెక్టు.

దీవులలో పసిడి పంటలుపండనున్నాయి!

(కొల్లూరి వెంకట్)

విజయవాడ, సెప్టెంబరు 12: దేశంలో అనేక ఉప్పెనలూ, ఉత్పాతాలూ జరిగినా, 1977 చరిత్రలో మరిచిపోలేని విషాదగాథ గుర్తొచ్చినప్పుడల్లా కళ్లు ధారావాహికంగా వర్షించే ఒక చెరిగిపోని విషాద రాత్రి.

ఆనాటి ప్రకృతి కరాళనృత్యానికి ఎన్ని సవోయాలు జరిగినా ఈనాటికీ అక్కడ ఏదో అస్పష్టమైన లోటు కనిపిస్తోంది.

అన్నిటిలోకి ముఖ్య విషయమేమిటంటే ఆనాటి రాత్రి శవాలు ప్రవహించిన ఆ నేల దాదాపు చవుడు బొక్కపోయి పంటలు పండక అక్కడ ప్రజలకు జీవనాధారం దాదాపు భారమైపోయింది.

నాగాయలంక మండలంలోని నాచుగుంట, ఈలచెట్ల దిబ్బ గ్రామాలలో ప్రాంతీయాభివృద్ధి సంఘం తరపున శ్రీ ముక్కామల నాగభూషణం, అనేకమంది షెల్టర్లు నిర్మించారు.

అదే సంస్థ ఇప్పుడు చవుడుబారిపోయిన పొలాలకు పంటనీరు రప్పించడంకోసం, వేల ఎకరాల సారవంతమైన భూములను మళ్లీ పసిడి పంటలు పండించడంకోసం శ్రీ నాగభూషణం ఒక పథకం తయారు చేశారు. ఆ పథకంయొక్క ఫలితమే వీడుబారిన పొలాలలో రేపు డిసెంబరునుండి కృష్ణానదినుండి తియ్యటి నీరు ప్రవహించనుంది. మళ్లీ ఆ ప్రదేశం సస్యశ్యామలం కానున్నది.

ఈ అడివిపాలెం లాక్‌నుండి ఎదురుమొండి వరకు రెండుపైపుల వరస, ఈలచెట్లదిబ్బకు ఒక పైపువరస కృష్ణానదినుండి నీటిని సప్లైచేయడంకోసం సముద్రగర్భంగుండా పైపు నడిపించారు. వీటికయ్యే వెట్టుబడిని శ్రీ నాగభూషణం అభ్యర్థన మేరకు కెనిడియన్ బాప్టిస్ట్ ఓవర్సీస్ మిషన్, కెనిడియన్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా సహాయం చెయ్యడానికి ముందుకొచ్చాయి.

ఈ పైపులద్వారా కృష్ణా పశ్చిమ కాలవనుండి 90 క్యూసెక్కుల నీరు దీవులకు అందుతాయి.

ఈ రెండు స్కీములకు 1982లో శ్రీ భవనం వెంకటరామ్ హయాంలో శంఖుస్థాపన జరిగింది. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ ఇంజనీర్లు నిర్మాణ బాధ్యత స్వీకరించారు.

మొత్తం ఈ రెండు స్కీములకు 2805 మీటర్ల పైపులు భూగర్భం ద్వారా రెండు మీటర్ల లోతులో దీవులకు నడపడంకోసం 1983లో బాంబేలోని ఎక్సోమెట్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. 57 లక్షల 40 వేల రూపాయలకు ఆ రోజు కాంట్రాక్ట్ కుదిరింది. కంపెనీకు ఇరిగేషన్ డిపార్టుమెంట్ రు. 28 లక్షలు చెల్లించింది. మరికొంత ధనం వెచ్చించారు. మరికొంత ధనం వెచ్చించి 400 హెచ్.డి. మోటార్ పంపుసెట్లుమకూడా కొన్నారు. పంపుహౌస్ నిర్మాణంకూడా ప్రారంభించారు.

అయితే ఆ సంస్థ 1840 మీటర్ల పైపు మాత్రమే సరఫరా చేసి, పనికి వూనుకున్నారు. కానీ, పైపులైను రెండు మీటర్ల లోతు చాలదని, ఆరు మీటర్ల లోతులో పైపు నడపాలనీ ఇంజనీర్లు పట్టుపట్టారు. కంపెనీ అందుకు తిరస్కరించింది. ఇలా వాదోపవాదాలు జరుగుతూ 3 సం.ల కాలం ఉప్పునీటిలో కలిసిపోయింది.

అదీ, ఇదీ చేసి చివరకు, రాష్ట్ర ప్రభుత్వం ఒక జీ.ఓ.ను జారీ చేసింది. దాని సారాంశమేమిటంటే, ఎక్సోమెట్ కంపెనీవారు తమ ఇష్టమైన విధంగా పైపులు నడుపుకోవచ్చునని, అయితే 5 సం.ల బ్యాంక్ గ్యారంటీ ఇవ్వాలని కోరింది. అందుకుకూడా ఎక్సోమెట్ తిరస్కరించింది. మరో ఏడాది వృధా అయిపోయింది. ఇక చేసేది లేక ఇంజనీర్లు ఎక్సోమెట్ కాంట్రాక్ట్ రద్దుచేసి పారియోఫిల్స్ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారు.

ఈ కొత్త కాంట్రాక్ట్ ప్రకారం 2805 మీ. పొడవు, రెండు అడుగుల తైవారం కలిగిన హెచ్.డి.పి.ఇ. పైపులను సరఫరాచేసి, రెండు మీటర్ల లోతులో నడపాలని, 5 సం.లు గ్యారంటీ ఇవ్వాలని, అందుకు ప్రతిఫలంగా ఎక్సోమెట్ గతంలో సప్లయిచేసిన 1840 మీ. పైపులనూ, అదనంగా రు. 92 లక్షలు చెల్లించేట్లు కాంట్రాక్టు కుదిరింది.

ఇది ఇలా ఉండగా 1983-84లో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కొన్న 400 హెచ్. పి. మోటార్లు పనికిరావని, వాటిని అలాగే ఉంచి, మరో నాలుగు 250 హెచ్. పి. పంపుసెట్లు, మోటార్లును డిపార్టుమెంట్ కొనుగోలు చేసింది.

1983లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో పంపుసెట్ల నిర్మాణానికి కాంట్రాక్టర్లెవరూ ముందుకు రాకపోవడంతో, లబ్దిదారులే రాళ్లెత్తే కూలీలయ్యారు. నిర్మాణం జరుగుతోంది.

కానీ, ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో చొరవతీసుకొని పట్టుదలగా కృషిచేసిన సూపరిన్‌డెంట్ ఇంజనీరును బదిలీ చేయడంతో మళ్లీ ప్రాజెక్టు నిర్మాణం నత్తనడక ప్రారంభించింది. 1983లో పూర్తిచేస్తామని అధికార్లు, ప్రభుత్వం వాగ్దాన పవనాలు కురిపించినప్పటికీ ఇంతవరకు పూర్తికాలేదు. ఈ లోపు వ్యయం తడిచి మోపెడయింది.

1983లో ప్రభుత్వం అక్కడున్న బలహీనవర్గాలకు, పట్టెకార్లకు రెండున్నర ఎకరాలచొప్పున ఇచ్చి పట్టాలిచ్చింది.

వారంతా గంపెడాశతో ఫలితాన్ని కళ్ల జూచుపోవడంకోసం ఎదురుచూస్తున్నారు. ఏమైతేనేం ఈ సంవత్సరం డిసెంబరులో రెండు పైపువరసల ప్రాజెక్ట్, తరువాత అతికొద్ది కాలంలోనే సింగిల్ పైప్ ప్రాజెక్ట్ ప్రారంభమవుతాయని శ్రీ నాగభూషణం తెలిపారు.

ప్రభుత్వ కార్యకలాపాలు ఎంత చురుగ్గా సాగుతాయో తెలుసుకొనేవారికి ఈ పైపుల ప్రాజెక్టు నగ్నరూపం కనబడుతుంది. ఈ ప్రాజెక్టు క్రింద మొత్తం 6 వేల ఎకరాలకుపైగా సాగు జరుగుతుంది.

సైనికతిరుగుబాటుఆలోచనలు!

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాద్, సెప్టెంబరు 12: నేషనల్ ఫ్రంట్ చైర్మన్‌గా, ముఖ్యమంత్రిగా ఒక బాధ్యతాయుతమైన పదవిలో వుండి శ్రీ ఎన్.టి. రామారావు, సైనిక తిరుగుబాటుకు పిలుపునివ్వడం, అవసరంవస్తే రేపు సైనికుల తిరుగుబాటు ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవలసి కుంటున్నారేమోనని సిపిఐ. రాష్ట్ర శాఖ కార్యదర్శి శ్రీ నల్లమల గిరిప్రసాద్ అనుమానాన్ని వ్యక్తం చేశారు.

"ఆంధ్రప్రదేశ్ సామరస్య ప్రజాస్వామ్య సంఘటన" ఆధ్వర్యంలో సోమవారం సచివాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీ గిరిప్రసాద్ పై విధంగా పేర్కొంటూ, ఒకవేళ సైనికులు తిరుగుబాటు చేస్తే తాము ఏమీ చేయలేమని ముఖ్యమంత్రి శ్రీ రామారావు ప్రకటించడంవల్ల ఈ రాష్ట్రానికి ఆయన ముఖ్యమంత్రిగా వుండడమే సిగ్గుచేటు అని ఆయన విమర్శించారు.

తానే గొప్ప "సామరస్యవాది" నని ప్రకటించుకుంటున్న ముఖ్యమంత్రి శ్రీ రామారావు కేవలం "భూస్వామ్య సమర్థవాది" మాత్రమేనని, అందుకే సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా భూసంస్కరణలు అమలు పరచడంలేదని ఆయన అన్నారు.

రాష్ట్రంలో మురికికాలువలు, చెరువులు, డ్రైనేజి వ్యవస్థ సరిగ్గా నిర్వహించనందుకే వరదల్లో అనేక గ్రామాలు ముంపుకు గురవుతున్నాయని ఆయన అన్నారు.

ఎన్.జి.వో.లు తమ న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తే వారిపై నాసా, ఎస్మా చట్టాల్ని వుపయోగించి ప్రజాస్వామ్య వ్యతిరేక, ప్రభుత్వం ప్రవర్తించిందని అన్నారు. చెబితేవాడిముందు శంఖం ఊదినట్లుగా తాము ఎన్ని సూచనాలు చేసిన, ధర్నాలు నిర్వహించినా ముఖ్యమంత్రి పట్టించుకోవడంలేదని ఆయన ఆలోచన ఆయనే గాని, ప్రజల ఆకాంక్షలు ఏ మాత్రం నెరవేరలేదని ఆయన తెలిపారు.

విద్యుచ్ఛక్తి కొరత తీవ్రంగా వుంది. ఏ ప్రాజెక్టు కూడా ఇంతవరకు పూర్తి కాలేదు. తె.దే. అధికారంలోనికి వచ్చిన ఈ ఏడు, సంవత్సరాల్లో సాధించింది ఏమీ లేదు. తమిళనాడు ప్రభుత్వం కొంత డబ్బు ఇస్తుందనే ఆశతోను, పేరుకోసం తెలుగుగంగ ప్రాజెక్టు మొదలు పెట్టారని ఆయన అన్నారు.

ప్రాజెక్టు కోసం కేటాయించిన డబ్బుని ఉపయోగించడం లేదని, నాన్ ప్లానింగ్‌లో అనవసర ఖర్చులు పెడుతున్నారని ఆయన తెలిపారు.

రామజన్మభూమి బాబ్రీ మసీదు విషయంలో కూడా ముఖ్యమంత్రి శ్రీ రామారావు ఢిల్లీలో విశ్వహిందూ పరిషత్ నాయకులతో చర్చలు జరిపి వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. మతకల్లోలాలు జరిగితే దానికి బాధ్యతఅందరం వహించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ప్రజల్ని మోసం చేయడానికి కేంద్రంలో కాంగ్రెస్ (ఐ), రాష్ట్రంలో తెలుగుదేశం పోటీపడుతున్నాయని, లోక్‌దళ్ రాష్ట్రశాఖ అధ్యక్షుడు శ్రీ గొతులచ్చన్న విమర్శించారు.

శ్రీ రామారావు ప్రతిక్షణం ప్రజల్ని భ్రమింప చేయడానికే ప్రయత్నిస్తున్నారని, ఆయన చెప్పింది చేయుడని , అలాగే చేసేది చెప్పడని ఆయన అన్నారు.

ఎన్నో దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్ (ఐ) కంటే కూడా ఈ ఏడు సంవత్సరాల్లో తెలుగుదేశం పాలనలో లంచగొండి తనం మితిమీరిందని ఆయన తెలిపారు.

ప్రస్తుతం తాను శాసనసభ సభ్యురాలిగా వుంటే శ్రీ రామారావు అన్యాయాల్ని భరించలేక రోడ్డు మీదుకు ఈడ్చుకు వచ్చేదాన్నని రిపబ్లికన్ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి ఈశ్వరీభాయ్ అన్నారు.

గత నెలరోజులుగా ప్రతిజిల్లాల్లో మేము ధర్నాలు నిర్వహించి కలెక్టర్లకు మెమొరాండాలు ఇస్తున్నాం. అయినా ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీన్ని బట్టి తెలుసుకోవచ్చు. మన ప్రభుత్వానికి ప్రజల సమస్యల ఎడల ఎంత శ్రద్ధ వుందో తెలుస్తున్నదని, తెలుగునాడు ఎన్నికల సంఘం కార్యదర్శి శ్రీ కె. జానారెడ్డి విమర్శించారు.

ఈనిరంకుశ ప్రభుత్వంలో వుండలేక రాజీనామా చేసి ముందుకు వచ్చామని ఆయన పునరుద్ఘాటించారు.

రాష్ట్రప్రభుత్వం అప్పు 1983లో రు. 1800 కోట్లు అయితే ప్రస్తుతం రు. 3 వేల వందకోట్లకు చేరుకుందని ఆయన అన్నారు.

తె.దే. పార్టీ అధికారంలోనికి వచ్చే ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలను వమ్ము చేసిందని, అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, అభివృద్ధి నిరోధకంగా నిరంకుశంగా తయారయిందని ఆయన విమర్శించారు.

గత నెలరోజులుగా ప్రతి జిల్లాలో ధర్నాలు నిర్వహిస్తూ తమ 26 డిమాండ్ల మెమొరాండాలు కలెక్టర్లకు సమర్పించామని, ఈ కార్యక్రమంలో తమ ధర్నాల కార్యక్రమం అయిపోతుందని సిపిఐ నగర శాఖ కార్యదర్శి శ్రీ ఎ. పుల్లారెడ్డి తన అధ్యక్షోపన్యాసంలో తెలిపారు.

ఇంకా ఈ సమావేశంలో శ్రీ వెంకటరెడ్డి (సిపిఐ) శ్రీ రామచంద్రరావు (ఎపి. జనతాదళ్) శ్రీ రాజేశ్వరరావు (ఎం.ఎల్.ఎ) మాజీ శాసనసభ్యుడు శ్రీ డి. రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్‌లో ఎ.ఎస్.ఐ. సహా 6గురు మృతి

చండీఘర్, సెప్టెంబరు 12: పంజాబ్‌లో గడిచిన 24 గంటల్లో ఒక ఎ.ఎస్.ఐ. ఇద్దరు పాకిస్తాన్ అక్రమిత ప్రవేశదార్లతో సహా ఐదుగురు తుపాకి గుళ్లకు గురై మరణించారు. భద్రతా దళాలు ఆరుగురు ఉగ్రవాదులను అరెస్టు చేశారు.

అమృత్‌సర్ జిల్లాలో మధ్యాహ్నం పొద్దు వద్ద భద్రతా దళాలు ఇద్దరు పాకిస్తాన్ చొరబాటుదారులను కాల్చివంపాయి.

బటాల పోలీసులు ముగ్గురు ఉగ్రవాదులను అరెస్టు చేసి ఒక రివాల్వర్‌ను, ఒక రాకెట్ గ్రెనేడ్‌ను, ఒక డిటనేటర్‌ను స్వాధీనపరచుకున్నారు.

రోపర్ పోలీసులు చంగేరి గ్రామం వద్ద ధయాన్ సింగ్‌ను అరెస్టు చేసి ఒక ఎ.కె.47 తుపాకిని, ఒక స్కూటర్‌ను స్వాధీనపరచుకున్నారు.

రూప్‌కన్వర్ 'సతి' రెండవ వర్ధంతి

దియోరాలా, సెప్టెంబరు 12: గట్టిబందోబస్తు మధ్య "సతి" పాటించిన రూప్‌కన్వర్ రెండవ వర్ధంతి శాంతియుతంగా ముగిసింది.

'సతి' జరిగిన స్థలం వద్ద పోలీసుల వలయాన్ని ఏర్పాటు చేసి ఎవ్వరివి రానివ్వలేదు. గ్రామానికి వచ్చే దారులన్నింటిని మూసి వేశారు.

గ్రామస్తులందరు ఇండ్లలోనే తలదాచుకున్నందున గ్రామం నిర్మానుష్యంగా కనిపించింది. రూప్‌కన్వర్ నివసించిన ఇంట్లో మాత్రం వారి కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొన్న "రామాయణ పఠనం" కార్యక్రమం జరిగింది.

చిన్నారులను విక్రయించేముఠా అరెస్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: : పిల్లల్ని గల్ఫ్ దేశాలలో అమ్మే ముఠాకు చెందిన ఇద్దరు వ్యక్తుల్ని పోలీసులు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు.

అరెస్టు అయిన జఫార్ హుస్సేన్ (40), రామేశ్వర్‌లాల్ (45) లు రాజస్థాన్‌లోని చురుజిల్లా సర్దర్ షహర్‌కు చెందిన వారని పోలీసులు తెలిపారు.

గతవారంలో అబుదుబాయ్‌కి వీరు, హాబీట్ పాంతిమా అనే పిల్లలను తీసుకువెళ్లారు. అక్కడ పిల్లల్ని అరబ్ షేక్‌లు ఒంటె పోటీలకు కొంటూంటారు. చిన్న పిల్లల్ని ఒంటెలకు కట్టి పోటీలను ప్రారంభిస్తారు. పిల్లలు చేసే ఆర్తనాధాలకు ఒంటెలు పోటీలో బాగా పాల్గొని గెలుస్తాయని అందుకే ఇలా చేస్తుంటారని పోలీసులు అన్నారు.

జఫార్ హుస్సేన్ ఇప్పటి వరకు కనీసం 6గురు పిల్లల్ని అబుదుబాయ్ పంపాడు. ఒక్కొక్క పిల్లాడికి రు. 18 వేలు చెల్లించారని పోలీసులు తెలిపారు.

అరెస్టు అయినవారి నుండి 5గురు పిల్లలకు సంబంధించిన విదేశీ ప్రయాణపత్రాలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.

పిల్లల తల్లితండ్రులకు, అక్కడ మీ పిల్లలకు మంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని వీరు తీసుకుపోతున్నట్లు దర్యాప్తులో తేలింది.

అబుదుబాయ్‌లో ఈ ఒంటెల పోటీలు ఆరు నెలలు కొనసాగుతాయి. ఇవి అక్టోబర్ నుండి ప్రారంభమవుతాయని పోలీసులు తెలిపారు.

మృదంగ విద్యాంసులు రాధాకృష్ణరాజు మృతి

విజయవాడ, సెప్టెంబరు 12: ప్రఖ్యాత మృదంగ విద్యాంసులు శ్రీ మహాదేవు రాధాకృష్ణరాజు సోమవారం తెల్లవారుఝామున 2-30 గంటలకు విజయవాడ దుర్గాపురంలోని తమ స్వగృహంలో మరణించారు. వారి వయస్సు 80 సంవత్సరాలు. కృష్ణా జిల్లా, పెదవిరివాడ గ్రామంలో జన్మించిన శ్రీ రాధాకృష్ణరాజు దాదాపు 60 సంవత్సరాలుగా సంగీత రంగంలో శ్రమిస్తూ, ప్రముఖ విద్వాంసులెందరికో మృదంగ సహకారం అందించారు. విజయవాడ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల మృదంగ అధ్యాపకునిగా రమారమి పదహారు సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన శ్రీ రాధాకృష్ణరాజు, పదవీ విరమణ అనంతరం తమ స్వగృహంలో ఒక మృదంగ గురుకుల విద్యాలయాన్ని స్థాపించి అనేక మంది విద్యార్థులకు మృదంగంలో ఉచితంగా శిక్షణ యిచ్చారు.

'మృదంగ వాద్య విశారద' 'మృదంగ జ్యోతి' నాదభిగీరద, నాద సుధార్ణవ ఇత్యాది బిరుదులతో శ్రీ రాజు సన్మానింపబడ్డారు. శ్రీ రాధాకృష్ణరాజుకి ఇద్దరు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. యువ మార్దంగికుడు మహాదేవు లక్ష్మీనారాయణ రాజు ఆయన కుమారులలో ఒకరు.

శ్రీ రాధాకృష్ణరాజు మృతికి సర్వశ్రీ డా. మంగళంపల్లి బాల మురళీకృష్ణ, అన్నవరపు రామస్వామి, వేదుమారి కృష్ణమూర్తి, వి. కమాలాకరరావు, ఎల్లా వెంకటేశ్వరరావు, కోలంక వెంకటరాజు మొదలైన ప్రఖ్యాత విద్వాంసులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

అక్బర్ అహమ్మద్ కాంగ్రెస్‌లో చేరిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: : జనతాదళ్‌కు ఆదివారం రాజినామా చేసిన శ్రీ అక్బర్ అహమ్మద్ (డంపీ) నేడు కాంగ్రెస్ (ఐ) పార్టీలో చేరారు.

దేశంలో మైనార్టీలను రక్షించేది కాంగ్రెస్ (ఐ) పార్టీనే అని అందుకే కాంగ్రెస్‌లో చేరానని శ్రీ అహమ్మద్ ప్రకటించారు.

ఎ.ఐ.సి.సి. (ఐ) ప్రధాన కార్యదర్శి శ్రీ వి.ఎన్.గాడ్గిల్, ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ (ఐ) అధ్యక్షుడు శ్రీ బలరామ్‌సింగ్ యాదవ్ పాల్గొన్న విలేకరుల సమావేశంలో శ్రీ అహమ్మద్ తన నిర్ణయాన్ని ప్రకటించారు.

సంజయ్ విచార్‌మంచ్‌కు చెందిన 90 శాతం మంది ఆఫీస్ బేరర్లు తన తోపాటు కాంగ్రెస్ (ఐ)లో చేరారని శ్రీ అహమ్మద్ అన్నారు.

ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, నేను కాంగ్రెస్ (ఐ)ని వదలలేదని, అప్పుడు యు.పి.సి.సి. (ఐ) అధ్యక్షుడు శ్రీ వి.పి.సింగ్ తనను పార్టీ నుండి బహిష్కరించారని శ్రీ అహమ్మద్ చెప్పారు.

శ్రీ అహమ్మద్ జనతాదళ్ నేత శ్రీ వి.పి.సింగ్‌ను తీవ్రంగా విమర్శిస్తూ, ఆ పార్టీ 'నకిలీ కాంగ్రెస్ (ఐ)' అని అభివర్ణించారు. 'దళ్'లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని, ఆ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో కేవలం పేపర్ల వరకే పరిమితమయిందని అన్నారు.

బోఫోర్స్ హెచ్.డి.డబ్ల్యు సబ్‌మెరైన్ కొనుగోలు నిర్ణయంలో అరుణ్ నెహ్రూకు, వి.పి.సింగ్‌కు సంబంధమున్నదని శ్రీ అహమ్మద్ తెలిపారు.

యు.పి.లో దళ్ కార్యకర్తలు పార్టీ అధ్యక్షుడు శ్రీ ములాయం సింగ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీ సంజయ్‌సింగ్‌లను తొలిగించాలని కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారని ఆయన అన్నారు.

జనతాదళ్‌లో చంద్రశేఖర్ తప్ప మరే నాయకుడు సరిగ్గా లేడని శ్రీ అహమ్మద్ అన్నారు.

ఎర్షాద్‌తో దాస్‌మున్షీ చర్చలు

ఢాకా, సెప్టెంబరు 12 : భారత వాణిజ్య శాఖ సహాయమంత్రి శ్రీ ప్రియరంజన్ దాస్ మున్షీ బంగ్లాదేశ్ అధ్యక్షుడు శ్రీ హుస్సేన్ ఎం.ఎర్షాద్‌ను కలిశారు. వారిద్దరూ రెండు దేశాల మధ్య వ్యాపార సంబంధాల గురించి, పరస్పర సహకారం గురించి చర్చించుకున్నారు.

మధర్ థెరిస్సా రాజీవ్ పరామర్శ

కలకత్తా, సెప్టెంబరు 12: : నగరంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధర్ థెరిస్సా త్వరితంగా కోలుకోవాలనే ఆకాంక్షను ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వ్యక్తం చేశారు.

శ్రీ రాజీవ్‌గాంధీ, భార్యసోనియాగాంధీతో ఆస్పత్రికి వెళ్లి పదిని మిషాలు గడిపి థెరిస్సా ఆరోగ్యం గురించి పరామర్శించారు.

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అయిన 79 సంవత్సరాల మధర్ థెరిస్సా శ్రీ రాజీవ్‌గాంధీని దీవించారు. ఆస్పత్రిలో రాజీవ్‌పై చెయ్యివేసి "చినపిల్లవాడిగా నిన్ను చూసాను. ఇప్పుడు ఎదిగి పోయావు" అని ఆమె అన్నారు. పరామర్శించేందుకు వచ్చిన రాజీవ్ దంపతులకు కృతజ్ఞతలు తెలిపి వారి పిల్లలు రాహుల్, ప్రియాంకాల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మధర్ థెరిస్సాకు చికిత్స చేస్తున్న డాక్టర్లతో రాజీవ్‌గాంధీ మాట్లాడారు. ప్రభుత్వంనుండి సహాయం కావలిస్తే అందించగలనని రాజీవ్‌గాంధీ తెలిపారు.

మధర్ థెరిస్సా ఆరోగ్య పరిస్థితి స్థిరంగా వున్నదని, "పేస్‌మేకర్" లేకుండా ఆమె గుండె మామూలుగా కొట్టుకుంటున్నదని డాక్టర్లు ప్రకటించారు.

లంకఅఖిలపక్షచర్చలకుగ్రహణం

మద్రాసు, సెప్టెంబరు 12: శ్రీలంక అధ్యక్షుడు శ్రీ రణసింఘె ప్రేమదాస ఈనెల 13 వ తేదీన జరిగే అన్ని పార్టీల సమావేశంలో పరిశీలకునిగా తమిళ ఈలం లిబరేషన్ ఫ్రంట్స్ (ఎల్.టి.టి.ఇ.) పాల్గొనడాన్ని ఈశాన్యరాష్ట్ర పాలక ఈలం పీపుల్స్ రివల్యూషనరీ లిబరేషన్ ఫ్రంట్ (ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్.) వ్యతిరేకించనున్నది.

ఎల్.టి.టి.ఇ.నిపరిశీలకునిహోదాలో పాల్గొనేందుకు అనుమతించిన పక్షంలో చర్చలను బహిష్కరించే విషయం ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్. ఆలోచిస్తుందని ఆపార్టీ పార్లమెంటు సభ్యుడు శ్రీ వి. కె. యోగసుందరి ఇక్కడ పత్రికల వారికి చెప్పారు.

సమోదయిన ఒక రాజకీయ పార్టీగా ఎల్. టి. టి. ఇ. చర్చల్లో పాల్గొనటంపట్ల ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్. వ్యతిరేకం కాదన్నారు. అయితే అంతకు మించి వివరించటానికి ఆయన తిరస్కరించారు.

ఎల్. టి. టి. ఇ. సమోదయిన రాజకీయ పార్టీ కాదని, అందువల్ల అఖిలపక్ష చర్చల్లో పాల్గొనజాలదని, సాంకేతికంగా మాట్లాడితే పరిశీలకునిగా కూడా ఆ పార్టీ చర్చల్లో పాల్గొనజాలదని శ్రీ యోగసుందరి అన్నారు.

తాము కేవలం పరిశీలకునిగానే చర్చల్లో పాల్గొంటున్నామని, ఏవిధమైన ప్రతిపాదన పెట్టబోమని ఎల్.టి.టి.ఇ. స్పష్టం చేసినట్లు కొలంబో నుంచి అందిన వార్తలు తెలుపుతున్నాయి.

శ్రీలంకలో ప్రత్యేకించి దక్షిణ ప్రాంతంలో మొత్తంగా శాంతి అవసరాన్ని ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్. నొక్కి చెబుతుందని ఆయన అన్నారు.



ఆ నొప్పికి
స్ట్రాంగ్ చికిత్స
అత్యంతావశ్యం

విపరీతమైన తలనొప్పులు, వొళ్ళునొప్పులు, భరించలేని నరముల తీపులు మరియు వెన్నుపులు.....వీటన్నిటికీ అమృతాంజన్ స్ట్రాంగ్ పెయిన్‌బామ్ వుపశమనము: చేకూర్చగలదు.

మీకు సుపరిచితమైన అమృతాంజన్‌లో యిమిడివున్న మూలపదార్థాములే మరింత శక్తివంతంగా సమ్మిళితం చేయబడినాయి అమృతాంజన్ స్ట్రాంగ్‌లో విపరీతమైన నొప్పులను, బాధలను త్వరితంగా వుపశమింపచేయగలందులకే స్ట్రాంగ్‌గా తయారుచేయబడింది అమృతాంజన్ స్ట్రాంగ్.

అమృతాంజన్
స్ట్రాంగ్

మిక్కిలి బాధాకరమైన నొప్పులకు

అమృతాంజన్ లిమిటెడ్

OBM 831 TG

ఇందిరా గోల్డ్‌కప్ హాకీ

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ విజయం

శ్రీనగర్, సెప్టెంబరు 12: ఇక్కడ జరుగుతున్న 14వ అఖిలభారత ఇందిరా గోల్డ్‌కప్ హాకీ టోర్నమెంట్‌లో సోమవారంనాడు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జట్టు 4-3 స్కోరుతో హోల్ జట్టును (కాన్పూర్) ఓడించింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జట్టుకు 'సడన్ డెత్' ద్వారా విజయం ప్రాప్తించింది. ఈ మ్యాచ్‌లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జట్టుకు మొత్తం ఏడు పెనాల్టీ కార్నర్‌లు లభించినప్పటికీ గోల్‌గా మార్చటంలో విఫలమైంది. హోల్ జట్టుకు మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి.

5వ స్థానానికి దిగజారిన క్రిస్

న్యూయార్క్, సెప్టెంబరు 12: సోమవారంతో ముగిసిన యు.ఎస్. ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌తో గ్రాండ్ స్లామ్ కెరీర్‌కు స్వస్తి పల్కిన అమెరికాకు చెందిన క్రిస్ ఎవర్ట్ కంప్యూటర్ ర్యాంకింగ్‌లో 5వ స్థానానికి దిగజారింది. క్రిస్ ఇంత తక్కువ స్థానానికి దిగజారటం యిదే ప్రథమం. ఆమె ఈ సీజన్ చివరిలో రిటైర్ కాబోతోంది.

ఈ సంవత్సరం ప్రారంభంలో క్రిస్ ఎవర్ట్ ప్రపంచ మూడవ నంబర్ స్థానంలో వుంది. ఆస్ట్రేలియా ఓపెన్ అనంతరం నాల్గవ స్థానానికి దిగజారింది. సోమవారం విడుదలైన కంప్యూటర్ ర్యాంకింగ్స్‌లో క్రిస్‌కు 5వ స్థానం లభించింది. ఫ్రెంచ్ ఓపెన్ విజేత అరంటా శాంచెజ్ నాల్గవ స్థానానికి ఎగబ్రాకింది.

యు.ఎస్. ఓపెన్ టోర్నమెంట్ విజేత స్టెఫీగ్రాఫ్ కంప్యూటర్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకుంది. మార్టినా నవ్రతిలోవా, గాబ్రియెలా సబాటినిలు ద్వితీయ, తృతీయ స్థానాలలో వున్నారు. ఈ కంప్యూటర్ ర్యాంకింగ్స్‌కు 1977లో శ్రీకారం చుట్టారు.

నేటినుండి బిలియర్డ్స్ పోటీలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: బుధవారం నుండి యిక్కడ ప్రారంభం కానున్న ఛెస్టర్ ఫీల్డ్ ప్రపంచ ఓపెన్ ప్రొ-ఆమ్ బిలియర్డ్స్ టోర్నమెంట్‌కొరకు మ్యాచ్‌లలో టాప్‌సీడ్ క్రీడాకారుడు మైక్‌రస్సెల్ (ఇంగ్లండ్), శ్రీ లల్‌కు చెందిన సిరి సోమాతోను, భారతదేశానికి చెందిన గీత్ సేథీ పాకిస్తాన్‌కు చెందిన మహ్మద్ యూనస్‌తోను తలపడతారు.

సింగపూర్ జాతీయ ఛాంపియన్ ట్యువాన్ ఛోంగ్ కూడా ఈ పోటీలో పాల్గొంటున్నాడు.

మార్క్ కార్లేన్ ముందంజ

హాంగ్‌కాంగ్, సెప్టెంబరు 12: ఇక్కడ జరుగుతున్న 50 వేల అమెరికన్ డాలర్ల కాథే పసిఫిక్ డన్‌లప్ హాంగ్‌కాంగ్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియాకు చెందిన మార్క్ కార్లేన్ 15-11, 15-5, 12-15, 6-15, 15-12 స్కోరుతో పాకిస్తాన్‌కు చెందిన ఫహీమ్ ఖాన్‌ను ఓడించి 'మెయిన్ డ్రా'లో ప్రవేశించాడు.

18న గుంటూరులో క్రీడాకారుల ఎంపిక

గుంటూరు, సెప్టెంబరు 12: గుంటూరు బి.ఆర్. స్టేడియంలో జిల్లా స్పోర్ట్సు అథారిటీ వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నేషనల్ స్పోర్ట్సు టాలెంట్ సెలక్షన్స్ ఈ నెల 18వ తేదీన, షటిల్ బాడ్మింటన్ సెలక్షన్స్ 19వ తేదీన జరుగుతాయని స్పోర్ట్సు అథారిటీవారు ఒక ప్రకటనలో తెలిపారు.

అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్, హాకీ, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, ఫుట్‌బాల్ (బాలురకు) మొదలైన వాటిలో సెలక్షన్స్ జరుగుతాయి. ఈ సెలక్షన్స్‌లో పాల్గొనే వారి వయసు నవంబరు 14 నాటికి 10 సం.రాల పైన 12 సం.రాల లోపు ఉండాలని తెలిపారు.

జిమ్నాస్టిక్స్ సెలక్షన్స్‌లో పాల్గొనేవారి వయసు నవంబరు 14 నాటికి 9 సం.రాలు పైన 10 సం.రాలలోపు ఉండాలని జిల్లా స్పోర్ట్సు అథారిటీ కార్యదర్శి మరియు జిల్లా ఎన్.సి. శ్రీ వివేక్ దూబే ఒక ప్రకటనలో తెలిపారు.

షటిల్ బాడ్మింటన్ సెలక్షన్స్ 19వ తేదీ ఉదయం 8 గం.లకు జరుగుతాయని ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆయా తేదీలలో ఉదయం 8 గం.లకు బి.ఆర్. స్టేడియంలో కోచ్-ఇన్‌చార్జి శ్రీ జి. ఎస్. అప్పారావుగార్కి రిపోర్టు చేయవల్సినదిగా ఆయన పేర్కొన్నారు.

వాలీబాల్ పోటీలు

విజయవాడ, సెప్టెంబరు 12 (నవవార్త): విజయవాడలోని కాలేజి, హైస్కూలు విద్యార్థులకు రోటరీ మిడ్‌టౌన్ ఆధ్వర్యాన ఈ నెల 17వ తేదీన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షులు శ్రీ నియంత ఒక ప్రకటనలో తెలిపారు.

కాలేజీ పోటీలు పురుషులకు, హైస్కూలు పోటీలు బాలికలకు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు కార్ల్ లూయిస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: వచ్చే వారంలో రెండు రోజులపాటు యిక్కడ జరుగనున్న క్రిబ్ కో-కలోనా నెహ్రూ అంతర్జాతీయ అథ్లెటిక్ పోటీలలో ప్రపంచ మరియు ఒలింపిక్ ఛాంపియన్ కార్ల్‌లూయిస్ కూడా పాల్గొంటున్నాడు.

లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడలలో లూయిస్‌కు 100 మీ, 200 మీ. పరుగు పందెంలోనూ, లాంగ్ జంప్‌లోనూ, 4 x 100 మీటర్ల రిలే పరుగులోను స్వర్ణ పతకాలు లభించాయి.

పిడుగురాళ్లలో క్విజ్ పోటీలు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 12 (నవవార్త): గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబరు 2న స్థానిక శ్రీ వల్లి రెసిడెన్షియల్ స్కూలులో రాజుపాలెం, పిడుగురాళ్ళ, నకరికల్లు మండల పరిధిలో హైస్కూలు స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నారు. ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరూ పాల్గొనుటకు అర్హులు. ప్రథమ బహుమతి రూ. 116 ఉచిత భోజన వసతులు పోటీలో పాల్గొనేవారికి ఏర్పాటు చేస్తారు. ఎంట్రీ ఫీజులేదు. ఎంట్రీలు పంపదలచినవారు ఈ నెల 20 లోగా, ప్రధానోపాధ్యాయులు, శ్రీ వల్లి విద్యానికేతన్, కొండమోడు, పిడుగురాళ్ళ అనే చిరునామాకు పంపవలసినదిగా ప్రధానోపాధ్యాయులు శ్రీ యం. శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ముక్కుపచ్చలారని పసిపిల్లలను, యువతులను అరబ్ దేశాలకు తరలిస్తున్న ఒక నయవంచక ముఠా కబంధ హస్తాలనుండి విముక్తి పొందిన బాలలు.

పెరగనున్నగ్యాస్, చమురుఉత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశంలో చమురు వార్షిక ఉత్పత్తి 8వ ప్రణాళికా కాలంలో గణనీయంగా పెరగగలదని ప్రణాళికాసంఘం నివేదిక పేర్కొంది. చమురు వార్షిక ఉత్పత్తి 8వ ప్రణాళిక ప్రారంభ సంవత్సరం 1990లో 365.5 లక్షల టన్నుల నుండి 1995 నాటికి 510 లక్షలకు పెరగగలదని ఆ నివేదిక వివరించింది.

దేశంలో ముడిచమురు త్రవ్వకాలు, అభివృద్ధి అనే అంశాలు గురించి సమగ్ర పరిశోధన జరిపేందుకు ప్రణాళికా సంఘం నియమించిన బృందం సమర్పించిన నివేదికలో పై వివరాలు పేర్కొనబడ్డాయి. ఇక సహజవాయువు ఉత్పత్తికి సంబంధించినంతవరకు వచ్చే సంవత్సరం ప్రారంభంలో రోజువారీ సహజవాయువు ఉత్పత్తి 610 లక్షల క్యూబిక్ మీటర్లు ఉండగా అది ప్రణాళికాంత సంవత్సరానికి 920 లక్షల క్యూబిక్ మీటర్లకు పెరిగే అవకాశం ఉందని ఈ నివేదిక సూచించింది.

దేశంలో ముడి చమురు ఉత్పత్తి 7వ ప్రణాళికలో 1,573.80 లక్షల టన్నుల స్థాయినుండి 8వ ప్రణాళికలో 2150.90 లక్షల టన్నులకు పెరగగలదని ఈ నివేదిక పేర్కొంది. అలాగే 7వ ప్రణాళికలో 580 లక్షల టన్నుల ఉత్పత్తి అయిన గ్యాస్ 1386.10 లక్షల టన్నులకు పెరగే అవకాశం ఉందని ఈ బృందం తన నివేదికలో పేర్కొంది.

అలాగే హైడ్రోకార్బన్స్ ఉత్పత్తి 8వ ప్రణాళికలో 7వ ప్రణాళికలో కంటే 64 శాతం పెరగవచ్చునని ఈ నివేదిక పేర్కొంది. అలాగే 7వ ప్రణాళికతో పోలిస్తే ముడి చమురు త్రవ్వకాలు 8వ ప్రణాళికలో 62 శాతం చమురు ఉత్పత్తి అభివృద్ధి మూటికి నూరు శాతం పెరిగే అవకాశం ఉంది. మొత్తంమీద 94.3 లక్షల మీటర్ల స్థలంలో 1,337 రిగ్గులు 2,282 బావులలో చమురుకోసం అన్వేషిస్తాయి.

ముడిచమురు త్రవ్వకాలు, పరిశోధన, అభివృద్ధికిగాను మొత్తం రు. 29,171 కోట్లు వెచ్చిస్తారు. ఇందులో రిగ్గులు, ఇతర సామగ్రి కొనుగోలు, అద్దె మొదలైన పెట్టుబడి ఖర్చుల కింద అయ్యే వ్యయం రు. 15,219 కోట్లు.

చమురు అన్వేషణ ముమ్మరం చేయడంవల్ల ఎగువ అస్సాం, కాంబే, బొంబాయి తీరప్రాంతాలతోపాటు చమురు వనరులు విశేషంగా ఉండగలవని భావించిన కృష్ణా, గోదావరి, కావేరి, త్రిపుర, అరుణాచల్‌ప్రదేశ్, పశ్చిమ రాజస్థాన్ ప్రాంతాల్లో చమురు క్షేత్రాలను క్రొత్తగా కనుగొనే అవకాశం లభిస్తుంది.

ఈ ప్రాంతాల్లో చమురు త్రవ్వకపు పనులను మరింతగా ముమ్మరం చేయాలని ముడి చమురు, సహజవాయువుసంస్థ నిర్ణయించింది. చమురు లభించగలదన్న నిర్ధారణ అయిన ప్రాంతాల్లో చమురు త్రవ్వకాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈ బృందం ఒ.ఎన్.జి.సి.కి సూచించింది.

జపాన్ పైచేయి

టోక్యో, సెప్టెంబర్ 12: సోవియెట్ యూనియన్ సైనిక నిర్మాణం కన్నా దూరప్రాచ్యంలో జపాన్ అగ్రశ్రేణిగా ఉన్నట్లు ఆ దేశ ప్రభుత్వ నివేదిక తెలిపింది. ఈ నివేదిక మంగళవారం విడుదల చేశారు. నిరంతర నిఘా, దేశ ప్రస్తుత రక్షణ సామర్థ్యం తోడ్పాటు కొనసాగాలని ఆ నివేదిక విజ్ఞప్తి చేసింది.

అయితే సాంప్రదాయిక అగ్రరాజ్యాలయిన అమెరికా- సోవియెట్ యూనియన్‌లు సైనిక స్థావరాలకు తక్కువ చెల్లించగల్గుతున్నందున తూర్పు పశ్చిమ దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని కూడా వార్షిక రక్షణ సంస్థ నివేదిక తెలిపింది.

అటువంటి క్షీణిస్తున్న ఆర్థిక పరిస్థితుల మధ్య చర్చలకు చర్యలు ముమ్మరం చేయబడ్డాయని, తూర్పు, పశ్చిమ దేశాల మధ్య సంబంధాలలో మారుతున్నట్లు తెలుస్తున్నవని ఆ నివేదిక వెల్లడించింది.

ముడుపుల గుట్టు రట్టు చేయండి భట్నాగర్‌జీ!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలులో ఎవరికి ముడుపులు ముట్టాయో వెల్లడి చేయాలని భారతీయ జనతాపార్టీ సిక్కిం గవర్నర్, దక్షిణశాఖ మాజీ కార్యదర్శి శ్రీ హెచ్.కె. భట్నాగర్‌కు విజ్ఞప్తి చేసింది.

బి.జె.పి. కార్యదర్శులు శ్రీ జె.పి. మాథుర్, శ్రీ వి. కె. మల్‌హోత్రా ఈమేరకు ఇక్కడ ఒక పత్రికా ప్రకటన విడుదల చేసారు.

ఒక పత్రికకు సైనికదళాల మాజీ ప్రధానాధినతి జనరల్ సుందర్జీ ఇంటర్వ్యూ ఇచ్చిన తరువాత పార్టీ పార్లమెంట్ సభ్యుడు శ్రీ జస్వంత్‌సింగ్ ఒక వార్తాపత్రికలో వ్రాసిన వ్యాసంలో ముడుపులు స్వీకరించిన వ్యక్తి ఎవరో తనకు తెలుసునని శ్రీ భట్నాగర్ తనతో చెప్పినట్లుగా వ్రాసారని వీరు పేర్కొన్నారు. ముడుపులు స్వీకరించిన వ్యక్తిపై దర్యాప్తుజరిపి, అతనిని ఎందుకు ప్రశ్నించరాదో తనకు అర్థం కావడం లేదని శ్రీ భట్నాగర్ వాపోయినట్లుగా శ్రీ జస్వంత్ సింగ్ తన వ్యాసంలో పేర్కొన్నారని కూడా వారు చెప్పారు.

శ్రీ సుందర్జీని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ వెంగళరావు విమర్శించడం పట్ల వీరు అభ్యంతరం వ్యక్తం చేసారు. కాంగ్రెస్‌వారి స్వార్థం, పదవీ లాలసత్వాన్ని ఈ విమర్శ వెల్లడి చేస్తోందని, వారు ఈ స్థాయిని మించి ఎదగలేరని శ్రీ మల్హోత్రా, శ్రీ మాథుర్ ఈ సంయుక్త ప్రకటనలో దుయ్యబట్టారు. తమ దుష్కృత్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉన్నతాధికారులను ప్రముఖ రాజ్యాంగ కార్యాలయాలను కాంగ్రెస్ వారు విధివిధానం అవీ నీతిమయంగా చేస్తారో దీనివల్ల విశదమవుతోందని వారు పేర్కొన్నారు.

సుమన్‌కుసన్మానం

(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

హైదరాబాదు, సెప్టెంబరు 12: భాగ్యనగరు కలానికేతన్ ఆధ్వర్యాన 9వతేది సాయంత్రం త్యాగరాయ గాన సభలో నటుడు సుమన్‌కు సన్మానం జరిగింది. శ్రీ కె.వి. భాస్కరరావు అధ్యక్షత వహించారు. వేణుగోపాల్ స్వాగతం చెప్పారు.

అధ్యక్షులు మాట్లాడుతూ తెలుగువారు గర్వించదగిన వ్యక్తి సుమన్ అని ప్రశంసించారు. ముఖ్యమంత్రి సభ యువిధికి విరామమిచ్చినందుకు హర్షం వెలిబుచ్చారు. హిందీరంగంలోకూడా పేరుగాంచి జాతీయస్థాయికి ఎదగాలని ఆశించారు. శ్రీ ఎన్.పి. కనకరాజు ప్రసంగిస్తూ తమజీవితం కళాసేవకే అంకితమన్నారు. కళాకారులకు సహాయపడగలమని చెప్పారు. శ్రీ కె. జగన్నాథం ముమ్మరయుయింకా మంచి చిత్రాలలో సుమన్ నటించాలని తమ ఆకాంక్ష వ్యక్తంచేశారు.

సుమన్ సమాధానమిస్తు సన్మానం చేయించుకోవడం యిదే మొదటిసారని చెప్పారు. పబ్లిసిటీకోసంగాక మానవతాదృష్టితో విరాళం యిచ్చామన్నారు.

సభ ప్రారంభంలో ఉషామంజరి విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు యిచ్చారు. సుమన్‌కు శ్రీ కనకరాజు శాలువకప్పి సత్కరించారు. వేణుగోపాల్ వందన సమర్పించారు.

నక్సలైట్ ఘాతుకం హరిపురంలోహత్య

శ్రీకాకుళం, సెప్టెంబరు 12 (నవవార్త): శ్రీకాకుళం జిల్లాలో మరల నక్సలైట్ల కార్యక్రమాలు ఉధృతంగా చెలరేగుతున్నాయి. ఈ మధ్య ఖమ్మం జిల్లాలో పోలీసు యంత్రాంగం కేంద్రీకరించడంతో కొండపల్లి సీతారామయ్య ముఠా, మరో ముఠావారు శ్రీకాకుళం చేరుకున్నారు. ఇందులో మొదటి కార్యక్రమంగా 1986లో పిరిచే హత్యకు గురిఅయిన మామిడి అప్పన్న కుమారుడు పాపారావును ఈరోజు హత్య చేశారు. పాపారావు బార్బరుషాపు నుండి వస్తున్న సమయంలో ఆయనను మారణాయుధాలతో నక్సలైట్లు హత్యచేశారు. నక్సలైట్లు బాంబులు విసురుకుంటూ పారిపోయారు.

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ కె. జగన్నాథరావు హటాహాటన హత్య ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. ఈ హత్య మందస మండలంలోని హరిపురం గ్రామంలో జరిగింది. ఈ హత్యతో గ్రామస్థులు భీతావహులు అయ్యారు. దుకాణాలు మూసివేశారు. వ్యాపారులు, ధనవంతులు జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం చేరుకుంటున్నారు.

ఆకాశవాణి సిబ్బందిప్రదర్శన

విజయవాడ, సెప్టెంబర్ 12 (నవ వార్త): ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ (ప్రోగ్రాం) సర్వీసును నెలకొల్పగలమని ఎనిమిది సంవత్సరాల క్రిందట చేసిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరుతూ మంగళవారంనాడు విజయవాడ 'ఆకాశవాణి' ముందు రేడియో స్టేషన్ ప్రోగ్రాం సిబ్బంది కొద్దిసేపు నిరసన ప్రదర్శన చేశారు.

గడచిన ఏడాది కాలంలో ఇరువురు కేంద్ర మంత్రులు, ఒక కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి కూడా ఈ 'బ్రాడ్ కాస్టింగ్' (ప్రోగ్రాం) సర్వీస్ ఏర్పాటుకు అనుకూలంగా ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో ఎటువంటి ఫలితం కనిపించకపోవడంతో దేశవ్యాప్తంగా వున్న రేడియో స్టేషన్లు, దూరదర్శన్ కేంద్రాల ముందు ఆయా కేంద్రాల ప్రోగ్రాం సిబ్బంది ఇదే రోజున కొద్దిసేపు నిరసన ప్రదర్శన జరుపుతున్నారు.

తరచూ రేడియోస్టేషన్ అధికారులను బదిలీలు చేయడం నిలిపి వేయాలనీ, రేడియో కేంద్రాల ఇన్‌ఛార్జిగా ఇంజనీర్లను గాకుండా కార్యక్రమ సిబ్బందిని నియమించాలని, ప్రోగ్రాం సిబ్బంది పని విధానాల్ని సమీక్షిస్తుండాలని కూడా వారు కోరుతున్నారు.

ఆకాశవాణి బుధవారం 13-9-89

ఉదయం
6-10 శ్రీ త్యాగరాజస్వామి కీర్తనలు
7-00 సూక్తి సుధ
11-40 ఉన్నత పాఠశాలకి

మధ్యాహ్నం
12-05 "విజ్ఞానపద్ధతి"
12-40 శ్రీ షేక్ నాజర్ సాహెబ్, శ్రీ జగన్నాథన్: నాదస్వరయుగళం

సాయంత్రం
5-30 యువవాణి
6-25 పల్లెసీమలు
7-15 వ్యవసాయ పాఠశాల
8-00 జానపద గేయాలు
8-15 నారాస్
9-15 సంగీత శిక్షణ
9-30 హిందీ ప్రోగ్రాం

దినఫలం

13-9-1989 బుధవారం
గంటలపంచాంగం

శ్రీ శుక్లనామ సం. భాద్రపద మాసం శు. త్రయోదశి : బుధవారం.

1989వ సం.సెప్టెంబరు 13, బుధవారం. బుధ. శు. త్రయోదశ : రా. 11-31, శ్రవణం: ఉ. 6-58, ధనిష్ట : తె. 5-15. వర్జ్యం: వ. 10-41 మొ. 12010 వరకు.

1989వ సం. సెప్టెంబరు 14, గురువారం. గురు. శు. చతుర్దశి: రా. 8-36, శతభిష : రా. 3-1. వర్జ్యం : వ. 11-46 మొ. 1-13 వరకు.

మేషం: మాటకు ఎదురులేదు. రాజకీయరంగాన మేలున్నది. శుభదాయకదినమని గ్రహింపకపోరు. సుఖశాంతులున్నాయి, అదాయమందు వృద్ధి, ఆరోగ్యలోపంలేదు.

వృషభం: ఆదాయం పెరగటం, అనుకూల మిత్రులు చేరటం, ప్రతివ్యవహారం లాభప్రదాయకంగా నెరవేరటం గమనింపదగిన 'దిన' ముఖ్యాంశాలు.

మిథునం: శుభసమయం. బంధుసంబంధంకొరకు ప్రయత్నాలుంటాయి. సానుకూలం అగుటకు గ్రహానుకూలతకూడ యున్నది, గ్రహించండి.

కర్కాటకం: సాయంకాలానికి శుభవార్తాశ్రవణం, వస్తువాహనసేకరణకు అనుకూలం, దూరప్రాంతాలనుండి బంధుమిత్రులు రానున్నారు, శుభనిమిత్తమే.

సింహం: విరోధివర్గమున్నది. ప్రతి వ్యవహారానికి అడ్డుతగిలేవారున్నారు. విద్యావేత్తల సహాయం, ధనవంతులమూలంగా అనుకూలత ఏర్పడుతుంది.

కన్య: దూరప్రాంతాలకు వెళ్లవలసిన అగత్యమున్నది. కళాసాహిత్యరంగాన ప్రసిద్ధి, కొందరు మిత్రులు మీరు కోరనిదే సహాయపడనున్నారు, గ్రహించాలి.

తుల: ఉద్యోగస్తులవలన ఏదో మేలు జరుగనున్నది. ధనవంతుల సహాయం కలసిరానున్నది. ఎంతోకాలంగా రాని అప్పులు ఈనాడు వసూలుకావటం గ్రహిస్తారు.

వృశ్చికం: పదిమందిలోమీకు గౌరవం. కళాసాహిత్యరంగాన ప్రసిద్ధిగలవారికి లాభదాయకం. దినమంతా ఏదో మేలు చేకూరిందని ఆనందిస్తారు. మీది పత్రికారంగమా? అయితే మేలే.

ధనస్సు: 'దినమంతా యోగదాయకం' అని అనుకొనరాదు. చేసిన ప్రయత్నాలన్నీ సాగిపోతాయని అనుకోరాదు. అప్పులన్నీ వసూఅవుతాయా? కొంచమో, గొప్పో రాకనుతప్పదు.

మకరం: విద్యావేత్తల సహాయమున్నది. ధనవంతుల సహాయమున్నది. సభామర్యాదయున్నది. దూరప్రాంతాలకు వెళ్లవలసిన అగత్యముంటుంది.

కుంభం: వ్యవహారరీత్యా మేలైన సమయం. అధికాదాయమున్నదని, ఖర్చులకు యిబ్బందిలేదని, పొంగకండి! కారణం, ఖర్చులపైన ఖర్చులు తలకెక్కుతాయి.

మీనం: అధికారమందువృద్ధి, సభారంగాన అధిక ప్రసిద్ధి, ఆశించినవిధంగా ద్రవ్యలాభం. శుభకార్యాలోచన లేగాక, 'లగ్ననిశ్చయం' కూడుకొందని కొందర విషయంలో చెప్పదగిన అంశం.

-విద్వాన్ కోటసత్యరంగయ్యశాస్త్రి

నవచలనచిత్ర వారపత్రిక

సినిమా రంజని

20-9-89 మంచికల్

★ ఐ. ఏ. ఎస్. అధికారి నోరు మూయించిన అగ్రనటి!
★ అందాల తారతులసి ఫేషన్ పెరేడ్!
- శృంగారపూరితమయిన స్పెషల్ వర్ణచిత్రాల విన్యాసం మీ కోసం ప్రత్యేకం
★ అక్కినేని ఆశయం?
★ రేఖను కిడ్నాప్ చేయడానికి పెద్ద కుట్ర
★ "నేను ఎవరితో నూ పోటీపడను" అంటున్న వర్ధమాన కథానాయకి?!

ఈవారం మరో స్పెషల్ !

1948 నాటి "బాలరాజు" విశేషాలు

ముఖచిత్రం
కృష్ణ - విజయశాంతి
(కొడుకు దిద్దిన కాపురం)

మరో అట్ట మీద
అక్కినేని, వాణిశ్రీ
(రావుగారింట్లో రౌడీ)

ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా ఇరుగుపొరుగు రాష్ట్రాలలో కూడా పాఠకుల నంబర్ వన్ సెలక్షన్!!